అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 14-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 26

Published from Karimnagar, Khammam, Rangareddy, Hyderabad

12 పేజీలు వెల : 6.50

సంక్షోభంలో వస్త్రపరిశ్రమ

(మొదటిపేజీ తరువాయి)

పిడికెడు అన్నట్టు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం..గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం..ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పాత్ర స్పష్టమవుతున్నది. కాగా, ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీ-కాంగ్రెస్ ఒక్కటే అని బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే...
బీఆర్ఎస్-బీజేపీ ఒక్కటని కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెడుతుంటే...
బీఆర్ఎస్-కాంగ్రెస్ ఒక్కటని బీజేపీ గొంతుచించుకుంటున్నది. రాజకీయ విమర్శలు ఎన్ని చేసుకున్నా..కార్మికులకు అన్యాయం చేయడంలో మాత్రం అన్ని పార్టీల విధానాలూ ఒక్కటేనని సిరిసిల్ల నేత కార్మికుల కష్టాలు స్పష్టం చేస్తున్నాయి.



బీజేపీకి ఓట్లు తప్ప నేతన్న వ్యథలు పట్టవా?

కరీంనగర్ పార్లమెంటరీ స్థానంలో సిరిసిల్ల ఉంది. ప్రస్తుతం అక్కడ ఎంపీగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఉన్నారు. ఆ నియోజకవర్గంలో వస్త్రపరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవించే వారు లక్షమందికిపైనే ఉంటారనేది నిజం. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో గెలుపోటముల్లోనూ వారి పాత్ర కీలకం. అలాంటి వారి సంక్షేమం కోసం ఎవ్వరూ ముందుకు రావడం లేదు. సమస్యను మాత్రం రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్న పరిస్థితి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. బండి సంజయ్ పార్లమెంట్‌లో తన ఎంపీ పరిధిలోని నియోజవర్గ పరిధిలోని సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికుల పక్షాన గొంతెత్తింది ఏనాడూ లేదు. పైగా, కేంద్రంలోని మోడీ సర్కారు వస్త్రపరిశ్రమను దెబ్బతీసి కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ పోతున్నా తనకేం పట్టనట్టు వ్యవహరించారనే విమర్శ ఉంది. నేత కార్మికుడు చనిపోతే మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది. నేతన్నలకు ఐసీఐసీఐ లాంబాడ్ హెల్త్ స్కీమ్ ఉండేది. హౌస్ కమ్ వర్క్‌షెడ్ పథకం కింద చేనేత కార్మికునికి లక్షా 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందేది. కేంద్రంలోని మోడీ సర్కారు వీటన్నింటి రద్దు చేస్తు పోతున్నా నేతన్నల పక్షాన బండి ఏనాడూ నిలబడి కొట్లాడలేదు. గతంలో ఉన్న 22 రకాల రిజర్వేషన్లను 11 రకాలకు కుదించినా తనకేం పట్టనట్టు ఆయన వ్యవహరించారు. చేనేత రంగానికి ఏటేటా నిధులను తగ్గిస్తూ పోతున్నా..తన నియోజకవర్గంలో పవర్‌లూమ్ కార్మికుల పక్షాన పార్లమెంట్‌లో సంజయ్ ఏనాడూ మాట్లాడలేదు. పదేండ్ల కాలంలో వస్త్రపరిశ్రమ ముడిసరుకుల ధరలు రెట్టింపు అయ్యాయి. దీనికితోడు పట్టుపై 12 శాతం, నూలుపై ఐదు శాతం, రంగులు, రసాయనాలపై ఐదు నుంచి 12 శాతం, తయారైన వస్త్రం అమ్మే సమయంలో ఐదు శాతం ఇలా జీఎస్టీ మీద జీఎస్టీ వేస్తూ పోతున్నా ఏనాడూ అయ్యో సిరిసిల్ల నేతన్నలకు దెబ్బ మీద దెబ్బ తగిలి అన్యాయం జరుగుతుందనే సోయే ఆయనకు లేకుండా పోయింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ భారాలతో నేతన్నలు మనుగడ సాగించలేని పరిస్థితి. జాతీయ చేనేత బోర్డును రద్దు చేసి చేనేత కార్మికుల గొంతును నొక్కేస్తున్నా బండిసంజయ్ తనకేం పట్టనట్టు వ్యవహరించడంపై కార్మికులు కోపంతో ఉన్నారు.

ఆర్డర్లిచ్చినా..బిల్లుల పెండింగ్‌తో బీఆర్ఎస్ అన్యాయం

బీఆర్ఎస్ ప్రభుత్వం తన హయాంలో పవర్‌లూమ్ కార్మికులకు బతుకమ్మ చీరల ఆర్డర్‌ను ఇచ్చింది. అదే సమయంలో టెస్కో ద్వారా వివిధ ప్రభుత్వ శాఖలకు, వెల్ఫేర్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు అవసరమైన వస్త్ర తయారీ ఆర్డరునూ ఇచ్చింది. ఇంతవరకూ బాగానే ఉంది. అసలు కథ ఇక్కడే మొదలైంది. అదే బీఆర్ఎస్ ప్రభుత్వం పవర్‌లూమ్ పరిశ్రమకు చెల్లించాల్సిన 485.89 కోట్ల రూపాయల బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్డర్లు ఇచ్చి వస్త్రాన్ని తీసుకున్నాయి తప్ప టెస్కోద్వారా నిధులను చెల్లించలేదు. వందల కోట్ల బిల్లుల బకాయిలతో ఆసాములు కూడా చేతులెత్తేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి రోజుల నాటికి సిరిసిల్ల వస్త్రపరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. ప్రస్తుతం మూడు నెలలుగా పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది.

విన్నపాలను కాంగ్రెస్ ప్రభుత్వమైనా మన్నిస్తుందా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పడింది. కానీ, మూడు నెలలుగా సిరిసిల్ల కార్మికులు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. తమకు న్యాయం చేయాలని ఇప్పటికే ఉప ముఖ్యముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు, ఆ శాఖ కమిషనర్‌కు పలుమార్లు కార్మికులు వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడం వల్ల వస్త్రపరిశ్రమ దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని వేడుకున్నారు. అయినా, రాష్ట్ర సర్కారు వారిపట్ల కనికరనం చూపడం లేదు. ఫలితంగా పవర్‌లూమ్ కార్మికుల కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొంది. వారంతా రోడ్లెక్కి నెలకుపైగా నిరసనలు చేస్తూనే ఉన్నారు. పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి పవర్‌లూమ్ పరిశ్రమను ఆదుకుంటుందా? లేక బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల మాదిరిగానే వ్యవహరిస్తుందా? అనేది వేచిచూడాల్సిందే.

అవసరమున్నా ఆర్డర్లేవి?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవసరాలకు వస్త్రాల అవసరం ఉంటుంది. ఆస్పత్రుల్లో బెడ్‌షీట్లు, ఇతర అవసరాలకు బట్టలు అవసరం. కానీ, ప్రభుత్వాలు మాత్రం చేనేతకు ఆర్డర్లు ఇవ్వడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేసే ఆశాలు, అంగన్వాడీలకు, గ్రామపంచాయతీ, ఆర్టీసీ కార్మికులకు, విద్యార్థులకు ఇచ్చే యూనిఫామ్‌ల ఆర్డర్లను చేనేత కార్మికులకు ఇస్తే ఎంతో మందికి ఉపాధి కల్పించి వారి జీవనోపాధిని మెరుగు పర్చొచ్చు. పాలకులు ఈ దిశగా ఆలోచించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ఆదుకునేలా చర్యలు తీసుకో వాలి. లేకపోతే, సిరిసిల్ల మరోమారు ఉరిసిల్లగా మారే ప్రమాదం పొంచి ఉంది.

కార్మికుల కోసం నేడు నిరాహార దీక్ష సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని 485.89 కోట్ల రూపాయల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి సంక్షోభంలో ఉన్న సిరిసిల్ల పవర్‌లూమ్ పరిశ్రమను గట్టెక్కించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చేతులెత్తి వేడుకుంటున్నాం.

ఏటా ప్రభుత్వ శాఖలకు అవసరమయ్యే వస్త్రతయారీ ఆర్డర్లను చేనేత, పవర్ లూమ్ కార్మికులకు ఇచ్చేలా విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. త్రిఫ్ట్ ఫండ్, యారన్ సబ్సిడీ, నేతన్న బీమా పథకాలను అమలు చేయాలి. నేత కార్మికుల సంక్షేమ కోసం ప్రత్యేక పాలసీ రూపొందించాలి. నేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరాహార దీక్షకు కూర్చోబోతున్నాం.

మళ్లీ యురేనియం అలజడి?

నిక్షేపాల కోసం ఏరియల్ సర్వే

- నల్లమల అడవి, కృష్ణా నది పరివాహకంలో పరిశీలన
- నాగార్జునసాగర్‌లో ఢిల్లీ బృందం మకాం..
- భయాందోళనలో గిరిజనులు

నవతెలంగాణ -పెద్దవూర

నల్లమలలో మళ్లీ యురేనియం అలజడి రేగింది. నల్లమల అడవితోపాటు కృష్ణా నది పరివాహకంలో కేంద్రం గుట్టుచప్పుడు కాకుండా సర్వే చేయడమే ఈ భయాందోళనకు కారణం. నల్లమలలో అరుదైన చెంచు జాతి వారున్నారు. కొన్ని వందల గిరిజన కుటుంబాలున్నాయి. యురేనియం వివిధ ఖనిజాల మిశ్రమంగా ఉంటుందని, దానిని వేరు చేసే ప్రక్రియలో ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా గిరిజనుల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. వారిని వేరే ప్రాంతాలకు తరలించినా, తవ్వకాలతో కృష్ణా నది కలుషితమవుతుందని, దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యాంలకు ప్రమాదం పొంచి ఉంటుందని నిపుణులు హెచ్చరించారు. యురేనియం నిక్షేపాల అన్వేషణను తెలంగాణ అటవీ శాఖ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. కొన్నాళ్లుగా స్తబ్ధుగా ఉన్నా మళ్లీ నిక్షేపాల కోసం సర్వేల పేరుతో ఉచిత బోరు తవ్వకాలు చేస్తున్నారు. ఇలా గుట్టు చప్పుడు కాకుండా యురేనియం అన్వేషణ కొనసాగిస్తున్నారని తెలిసింది.



నల్లమల అభయారణ్యం ప్రకృతి రమణీయతకు, అపురూప జంతుజాలానికి నెలవు. ఇక్కడి ప్రాచీన గిరిజన తెగలకు విస్తారంగా ఉన్న కొండలే ఆవాసాలు. ఇప్పుడు వారి భవిత ప్రశ్నార్థకమవుతున్నది. నల్లమల బేసిన్‌లోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో విస్తరించిన ఈ ప్రాంతం యురేనియం అన్వేషణలో పెద్ద యంత్రాల మోతలతో, తవ్వకాలతో తన రూపు కోల్పోనుందని చర్చ సాగుతోంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో యురేనియం నిక్షేపాల అన్వేషణకు కేంద్ర అటవీ సలహా మండలి కేంద్ర అణుశక్తి సంస్థకు అనుమతి ఇచ్చింది. అదే జరిగితే అక్కడి చరిత్ర కనుమరుగు కానుంది.

మకాం వేసిన ఢిల్లీ బృందం

నల్లగొండ జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాల కోసం వేట మళ్లీ మొదలైంది. ఐదు, పది రోజులుగా నాగార్జునసాగర్‌లో ఢిల్లీ బృందం మకాం వేసింది. యురేనియం నిక్షేపాల కోసం వచ్చిన అధికారులు బృందం హెలికాప్టర్ ద్వారా పరిశీలిస్తున్నారు. నంబాపురం, పెద్దగట్టు, కోమటికుంట తండా ప్రాంతాల్లో ప్రతి రోజూ 10 గంటల సమయంలో ఏరియల్ సర్వే నిర్వహిస్తున్నారు. 2003లో యురేనియా కోసం ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతి తీసుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయనీయకుండా అధికారులను అడ్డుకున్నారు పెద్దగట్టు గ్రామస్తులు. స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో బీఆర్ఎస్ పాలనలో యురేనియం తవ్వకంపై పోరాటం చేశారు. దీంతో యురేనియం తవ్వకాలకు బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్లీ ప్రారంభమైంది. నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు చేపట్టొద్దని గతంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసినా.. దానిని పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం, యురేనియం కార్పొరేషన్ ముందుకు సాగుతుండటం గమనార్హం.

2002 నుంచే సర్వే

దేవరకొండ, చందంపేట, పీఏపల్లి మండలాల్లో యురేనియం నిక్షేపాల కోసం 2002 నుంచే అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారత అణుపరిశోధన సంస్థలకు అప్పగించింది. అప్పటి నుంచి ఆయా సంస్థల అధికారులు దేవరకొండ నియోజకవర్గంలో సంచరిస్తూ యురేనియం నమూనాలు సేకరిస్తున్నారు. చందంపేట మండలం చిత్రియాల గుట్టల్లో, పెద్దమూల గ్రామంలో 2500 ఎకరాలు, పీఏపల్లి మండలంలో 1104.64 ఎకరాల అటవీభూమి, 196.71ఎకరాల పట్టా భూముల్లో యురేనియం నిల్వలు ఉన్నట్టు గతంలోనే యూసీఐఎల్ అధికారులు నిర్ధారించారు. కానీ, యురేనియం సర్వే, తవ్వకాలను మొదటి నుంచే స్థానికులు వ్యతిరేకిస్తూ పలు ఆందోళనలు కూడా చేశారు.

దేవరకొండ మండలం శేరిపల్లి, ముదిగొండ పరిధిలో 200 ఎకరాలు, చందంపేట మండలం చిత్రియాల, పెద్దమునిగల్ గుట్టల్లో 2500 ఎకరాలు, పెద్ద అడిశర్లపల్లి మండలం నంబాపురం, పెద్దగట్టు పరిసర గ్రామాల్లో 210 ఎకరాల్లో యురేనియం నిక్షేపాలు ఉన్నట్టు కనుగొన్నారు. యురేనియం కోసం తవ్వకాలు చేపడితే పర్యావరణం దెబ్బతినడమే కాకుండా కృష్ణా జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారు. దీంతో స్థానికులు ఆ తవ్వకాలను అడ్డుకున్నారు. 2003 ఆగస్టులో అప్పటి నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆర్‌పీ సిసోడియా ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. ఈ ప్రయత్నాలను ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. 2005లో శేరిపల్లి వద్ద



యురేనియం శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. 2008 నుంచి అణుశక్తి సంస్థ ఖనిజాన్వేషణ మొదలు పెట్టింది. 2014 వరకు ఈ అన్వేషణ కొనసాగింది. ఇవి లభ్యం కావడంతో పెద్దగట్టు, నమ్మపురం, కోమటికుంట తండా ప్రాంతాల్లో డ్రిల్లింగ్ అనుమతుల కోసం అణుశక్తి విభాగం ప్రతిపాదన పంపింది. నాగార్జున సాగర్ ప్రాంతంలోని నిడ్గుల్ రక్షిత అటవీ ప్రాంతంలోని 7 చదరపు కిలో మీటర్లు, అమ్రాబాద్ టైగర్ రిజర్వాయర్‌కు సంబంధించిన 87 చదరపు కిలో మీటర్లలో యురేనియం నిక్షేపాల అన్వేషణ, సర్వేకు కేంద్రం అనుమతి ఇచ్చింది.

గతంలోనూ శాస్త్రవేత్తల బృందం పర్యటన

నాగార్జునసాగర్ ప్రాంతంలో గతంలోనూ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్) శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. అప్పట్లో నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం పెద్దగట్టు సమీపంలోని నల్లమల గుట్టలను సందర్శించి సర్వే నిర్వహించారు. యువ శాస్త్రవేత్తలు యూసీఐఎల్ ఆధ్వర్యంలో పెద్దగట్టు, నంబాపురంలో యురేనియం నిక్షేపాలను గుర్తించిన గుట్టలను పరిశీలించారు. నమూనాల కోసం గతంలో తవ్విన బోరుబావులను పరిశీలించారు. మట్టి నమూనాలు సేకరించారు. నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ పరిసరాల్లో యురేనియం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పెద్దగట్టు, నంబాపురం ప్రాంతాల్లోని భూగర్భ జలాల్లో యురేనియం అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్టు అటామిక్ మినర్స్ డైరెక్టర్ ఇచ్చిన నివేదిక సంచలనం రేపుతోంది. పెద్దగట్టు, నంబాపురం పరిసరాల్లో గతేడాది 25బోరు బావుల్లో నీటిని సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఎల్ 21శాంపిల్స్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో యురేనియం ఉన్నట్టు వెల్లడైంది. ఇప్పటికే దశాబ్ద కాలంగా పెద్దగట్టు గ్రామస్తులు భూగర్భ జలాలను తాగునీటికి వినియోగించడం లేదు. కేవలం వ్యవసాయానికి మాత్రమే వినియోగిస్తున్నారు. నంబాపురం నుంచి 8 కిలో మీటర్ల పరిధిలో నీటి నమూనాలను అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ సేకరించింది. దాదాపు 8 నెలలపాటు శాంపిల్స్ సేకరించి జరిపిన పరీక్షల్లో యురేనియం స్థాయి 2 వేల 168 పీపీబీ ఉన్నట్టు నిర్ధారించింది. అప్పట్లో రాజుకున్న వివాదం మళ్లీ తెరపైకి వచ్చే అవకాశాలు ఉండటంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.

దేహదానం చేసిన సురేశ్ ఆదర్శనీయుడు : జేవీవీ ఘన నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్





(ఫైల్)

తన జీవిత కాలంలో నిస్వార్థంగా సమాజ మార్పు కోసం కషి చేసిన సురేశ్ తన మరణానంతరం కూడా దేహదానంతో మరింత గొప్ప ఆదర్శాన్ని నెలకొల్పారని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్ పేర్కొన్నారు. శరీర దానంతో మనిషి జీవిత కాలాన్ని పెంచుదామనీ, మెడికల్ కాలేజీలకు అవయవ దానం చేస్తే మరింతమంది నైపుణ్యం కలిగిన వైద్యులు తయారవుతారని వారు తెలిపారు. తద్వారా మనం చనిపోయినా నలుగురికి విజ్ఞానాన్ని అందించడానికి ఉపయోగపడతామని చెప్పారు. దేహదానంతో వైద్య విద్యార్థులకు పాఠాలు నేర్పించవచ్చన్నారు. జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య సబ్ కమిటీ కన్వీనర్ అనుమకొండ సురేశ్ బ్రెయిన్ క్యాన్సర్ బారినపడి వ్యాధి ముదరడంతో మంగళవారం మరణించారు. ఆయన పార్థీవ దేహాన్ని తన అంతిమ కోరిక మేరకు సిద్దిపేటలోని సురభి వైద్య కళాశాలకు ఆయన కుటుంబ సభ్యులు అప్పగించారు. సురేశ్ పార్థీవ దేహాన్ని సురభి వైద్య కళాశాల అనాటమీ విభాగాధిపతి డాక్టర్ సమత రోష్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సురేశ్ భార్య పద్మ, కుమార్తె సునయన, అల్లుడు లోకనాథంను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర కమిటీ, పలు జిల్లా కమిటీలు సురేశ్ కు ఘనంగా నివాళులు అర్పించారు.డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్ మాట్లాడుతూ పునర్జన్మ, స్వర్గనరకాలు, మోక్షం తదితరమైన వాటిని జన విజ్ఞాన వేదిక ప్రచారం చేయదనీ, అయితే శరీర, అవయవ దానాలతో మనిషి జీవిత కాలాన్ని మరింత పెంచవచ్చని అభిప్రాయపడ్డారు. దేహ దానంతో నైపుణ్యం కలిగిన వైద్యులను భావితరాలకు అందించే వీలుందని తెలిపారు. అయితే శరీర, అవయవదానాల పైన ప్రజల్లో సరైన అవగాహన లేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. వీటి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలని వారు ఈ సందర్భంగా కోరారు.

వైద్యరంగం దినదినాభివృద్ధి చెందుతుందని, వివిధ మానవ అవయవాల మార్పిడి చేయగల స్థాయికి వైద్య శాస్త్రం ఎదిగిందని గుర్తుచేశారు. అందులో భాగంగానే రక్తదానం, నేత్రదానం, చర్మ దానం, అవయవ దానం, శరీర దానం లాంటి పలు కొత్త దానాలు ఉనికిలోకి వచ్చాయని చెప్పారు. నేత్రదానంతో అంధులకు చూపు తెప్పించవచ్చని చెప్పారు. దేశంలో కార్నియా దెబ్బతిని చూపు కోల్పోయిన వారు 10 లక్షల మందికి పైగా ఉన్నారని తెలిపారు. దేశంలో ప్రతి ఏటా వీరి సంఖ్య 25000 అదనంగా చేరుతుందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం కోటి మంది మరణిస్తున్నా, అందులో కేవలం 30 వేల మంది మాత్రమే నేత్రదానం చేస్తున్నారని వివరించారు. నేత్రదానం, అవయవ దానం, శరీర దానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మరణానంతరం పార్థీవ దేహాన్ని కాల్చడం, పాతి పెట్టడం వలన ఉపయోగం లేదని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీలకు శరీరాన్ని దానం చేస్తే మరింత నైపుణ్యవంతమైన వైద్య బోధనా ప్రమాణాలు నెలకొల్పడానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ రామచంద్రయ్య, ఛాయ మోహన్, వరప్రసాద్, రాజా, ఆనంద్ కుమార్, జగన్మోహన్ రావు, రమణారెడ్డి, వెంకటరమణ, ఎం.శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా నుండి బురాన్, మల్లయ్యచారి, నాగరాజు, శ్రీనివాస్, శంకర్రావు, జెన్ని, హైదరాబాద్ జిల్లా నుండి లింగస్వామి, వినోద్, రంగారెడ్డి జిల్లా నుండి ప్రహ్లాద, జయబాబు, కుర్మయ్య, కృష్ణమోహన్, రమేశ్, నల్లగొండ జిల్లా నుంచి సైదులు తదితరులు పాల్గొన్నారు.

నీరటి రవి ఆత్మహత్య కేసులో

పలువురి అరెస్టు

- ఒత్తిడి, బెదిరింపులతోనే ఆత్మహత్య
- డబ్బులు ఎగ్గొట్టిన జీఎస్ఎన్ ఫౌండేషన్
- బెదిరింపులకు పాల్పడిన విలేకరులు
- చేసేదేమీ లేక పిల్లలను చంపి, ఆత్మహత్య చేసుకున్న రవి
- మీడియాకు వివరాలు వెల్లడించిన..రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

నవతెలంగాణ-గండిపేట్



రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగుటూరులో చిట్టీల పేరుతో మోసపోయి పిల్లలను చంపి, తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో అసలు కారకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను నార్సింగి ఏసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామానికి చెందిన నీరటి రవి 2022లో టంగుటూరుకి చెందిన తిరుపతిరావు అనే వ్యక్తి ద్వారా విజయనగరంకు చెందిన జీఎస్ఎల్ ఫౌండేషన్ మనీ సర్క్యులేషన్‌కి చెందిన దాంట్లో సభ్యునిగా చేరారు. జీఎస్ఎన్ ఫౌండేషన్‌లో ముందుగా రూ.2వేలు కడితే 45 రోజుల తర్వాత కట్టిన డబ్బులు మొత్తం తిరిగి ఇచ్చి ప్రతి నెలా రూ.1000 చొప్పున ఆరు నెలలు ఇచ్చేవారు. రవి తన ఊర్లో ఉన్న వారితో జీఎస్ఎన్ ఫౌండేషన్‌లో పెద్ద ఎత్తున డబ్బులు కట్టించారు. రవి సేకరించిన డబ్బు తిరుపతి రావుకు పంపగా తిరుపతిరావు ప్రతినెలా రవికి, సభ్యులకు తిరిగి డబ్బులు చెల్లించేవాడు. అయితే మూడు నెలల నుంచి ఫౌండేషన్ తరపున తిరుపతిరావు డబ్బులు చెల్లించకపోవడంతో రవిని గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల సభ్యులు డబ్బుల గురించి అడిగారు. ఈ విషయం బయట తెలియడంతో శంకర్‌పల్లి మండలానికి చెందిన ప్రధాన పత్రికలు, చిన్న పత్రికల విలేకరుల సైతం వార్తలు రాస్తామని రవిని బెదిరించారు. తమకు రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రవి తన భార్య పుస్తల తాడు తాకట్టు పెట్టి రూ.2.50 లక్షలు తెచ్చి విలేకరులకు ఇచ్చాడు. శంకర్‌పల్లి గ్రామానికి చెందిన హోంగార్డు నాగరాజు భార్య మణి కూడా రవి ద్వారా డబ్బులు పెట్టింది. వారు కూడా డబ్బుల కోసం రవిని ఒత్తిడి చేశారు. దాంతో వారికి కొంత డబ్బు చెల్లించాడు. మిగతా డబ్బుల గురించి రవిని ఒత్తిడి చేశారు. వారి బాధలు తట్టుకోలేక రవి తన ముగ్గురు పిల్లలను చంపి, అతనూ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కేసుతో సంబంధం ఉన్న విలేకరులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, హోం గార్డు అల్లూరి రాజు అలియాస్ నాగరాజును అరెస్టు చేశారు. జీఎస్ఎన్ ఫౌండేషన్ తిరుపతిరావు, శ్రీనివాస్, శ్రీనివాస్, వడ్డే మహేష్, మనీలా రామకృష్ణ పరారీలో ఉన్నారు.

సీఏఏ ప్రక్రియ షురూ

- పౌరసత్వం కోసం ఇప్పటికే ప్యానెల్స్ ఏర్పాటు
- ప్రత్యేక వెబ్ పోర్టల్ ప్రారంభం

న్యూఢిల్లీ: సీఏఏ కింద నిబంధనలను నోటిఫై చేసిన ఒక రోజు తర్వాత.. పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్యానెల్స్, ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. సీఏఏ, 2019 కింద అర్హత ఉన్న వ్యక్తులు ఈ పోర్టల్‌లో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కేంద్ర హోం శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. అప్లికేషన్లను సులభతరం చేయటానికి త్వరలో మొబైల్ యాప్ కూడా ప్రారంభించనున్నారు. పౌరసత్వం మంజూరుపై నిర్ణయం తీసుకోవటానికి మంత్రిత్వ శాఖ ఒక అధికార ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. అలాగే పత్రాలను ధృవీకరించే జిల్లా స్థాయి కమిటీలను సైతం ఏర్పాటు చేసింది.

సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు

సీఏఏకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ చట్టానికి వ్యతిరేకంగా అసోంలో 'సర్బత్మక్ హర్తాల్' (సంపూర్ణ సమ్మె)కు కాంగ్రెస్ నేతృత్వంలోని 16 పార్టీల యునైటెడ్ ప్రతిపక్ష ఫోరమ్ పిలుపునిచ్చింది. అయితే, ఈ ఫోరమ్ నాయకులకు గువహతి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లీగల్ నోటీసు జారీ చేయటం గమనార్హం.హర్తాళ్‌తో రోడ్డు దిగ్భంధనం, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు బలవంతంగా మూసివేయటం, ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులకు నష్టం జరిగే అవకాశం ఉన్నదని నోటీసులో పేర్కొన్నారు. ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్, 30 రాజకీయేతర సంస్థలు, అసోమ్ జాతీయతబడి యుబా చత్ర పరిషత్, సీపీఐ(ఎం), కాంగ్రెస్, రైజోర్ దళ్‌లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాయి. పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేసి పదుల సంఖ్యలో ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

'రాజ్యాంగ విరుద్ధం..వివక్షపూరితం'

సీఏఏ అమలుకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మద్దతు పలుకుతున్నారు. నోటిఫై చేసిన నియమాలు "రాజ్యాంగ విరుద్ధమైనవి..వివక్షపూరితమైనవి" అని అనారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 14-3-2024

సంపుటి : 10 సంచిక : 26

Published from Karimnagar, Khammam, Rangareddy, Hyderabad

12 పేజీలు వెల : 6.50



బేర్ పంజా

- రూ.21 లక్షల కోట్లు ఆవిరి
- మూడు సెషన్లలో దలాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్లకు నష్టం
- సెన్సెక్స్ మరో 906 పాయింట్ల పతనం వివరాలు 10లో
- అదానీ షేర్లకు గడ్డుకాలం
- ఎన్నికల బాండ్ల దెబ్బకు విలవిల..!

22,217 బాండ్లు జారీ

22,030 బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీలు

- సుప్రీంకోర్టులో ఎస్‌బీఐ అఫిడవిట్
- రెండు పీడీఎఫ్ ఫైల్స్‌ను పెన్‌డ్రైవ్‌లో ఇచ్చామని వివరణ
- యూనిక్ కోడ్‌పై మౌనం



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత ఎస్‌బీఐ ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు అందజేసింది. ఈ విషయాన్ని బుధవారం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ రూపంలో తెలియజేసింది. ఓ పెన్‌డ్రైవ్‌లో ఎన్నికల కమిషన్‌కు వివరాలు ఇచ్చానని అందులో తెలిపింది. ఈ సమాచారం రెండు పీడీఎఫ్ ఫైల్స్‌లో ఉన్నదని, వాటికి పాస్‌వర్డ్ రక్షణ ఉన్నదని వివరించింది.

2019 ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీ వరకూ (ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ...11లో

చరిత్రను వక్రీకరించడమే..

విమోచన దినోత్సవంపై కేంద్రం నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలంటూ కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌ను జారీ చేయటాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇది చరిత్రను వక్రీకరించడమేనని విమర్శించింది. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా దీన్ని జారీ చేయటం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమేనని తెలిపింది. ఆ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో అణువంత సంబంధం కూడా లేని వారు ఇది విమోచన దినం అంటున్నారని విమర్శించారు. భూమి కోసం, భుక్తి కోసం, జమీందారీ వ్యవస్థ నుంచి విముక్తి కోసం భారత కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలో పోరాటం సాగిందని గుర్తు చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు లాంటి నాయకులు నడిపిన పోరాటమని తెలిపారు. ఆ పోరాట సమయంలో నెహ్రూ-పటేల్ ప్రభుత్వం, నరహంతక నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌తో యథాతథ ఒప్పందం చేసుకున్నదని పేర్కొన్నారు. హైదరాబాద్ రాజ్యాన్ని స్వతంత్ర రాజ్యంగా గుర్తించిందని తెలిపారు. సాయుధ రైతాంగ పోరాటాన్ని అణచలేక, నిజాం రాజు చేతులెత్తేసే సమయంలో నెహ్రూ-పటేల్ ప్రభుత్వ సైన్యాలు తెలంగాణలోకి ప్రవేశించాయని పేర్కొన్నారు. ఎలాంటి ప్రతిఘటన లేకుండా నిజాం రాజు లొంగిపోయాడని తెలిపారు. హైదరాబాద్ రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేస్తూ సెప్టెంబర్ 17న సంతకం చేశాడని గుర్తు చేశారు. అందువల్ల అది ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ రాజ్యం విలీనమైన రోజని పేర్కొన్నారు. మరోవైపు పటేల్ సైన్యాలు నరహంతక రజాకార్ నాయకుడు కాశీం రజ్వీని అరెస్టు చేసి మరణశిక్ష విధిస్తారని రైతాంగం ఆశించిందని తెలిపారు. కానీ సకల సౌకర్యాలతో పాకిస్తాన్‌కు పంపించారని తెలిపారు. అంతేకాదు, నరహంతక నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను కూడా అరెస్టు చేయలేదనీ, ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆయన్ను రాజప్రముఖ్‌గా నియమించారని పేర్కొన్నారు. నిజాం రాజుతో కుమ్మక్కైన ఇండియన్ యూనియన్ సైన్యాలు రైతాంగం మీద ...11లో



సంక్షోభంలో వస్త్రపరిశ్రమ

పెండింగ్‌లో రూ.485.89 కోట్ల బకాయిలు

- సిరిసిల్లలో నెలలుగా ఉపాధి కరువు
- రోడ్డునపడ్డ నేతన్నల కుటుంబాలు
- తిలా పాపం..తలా పిడికెడుగా బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు



ఈ ఫొటోలోని పవర్‌లూమ్ కార్మికుడి పేరు ఎర్రగుంట అశోక్. సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో పని లేకుండా పోయింది. కుటుంబ భారాన్ని మోసేందుకు మిర్చిసెంటర్ పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నాడు.



ఈ ఫొటోలో ఉన్న వార్పిన్ కార్మికుని పేరు సర్గం శ్రీనివాస్. మూడు నెలలుగా ఉపాధి లేకుండాపోయింది. రోజువారీ జీవితం గడవడమే కష్టంగా తయారైంది. ఎటూపాలుపోలేని స్థితిలో కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇలా ఒకరు కాదు..ఇద్దరు కాదు...సిరిసిల్లలోని 15 వేల మంది పవర్‌లూమ్ కార్మికుల కుటుంబాల పరిస్థితి ఇదే. ఒకరు తట్టాపనికి పోతుంటే...మరొకరు సుతారి(భవన నిర్మాణ రంగంలో) పనికి పోతున్నారు. కొందరు హోటళ్లలో పనికి కుదురుతున్నారు. ఉపాధిలేక వలసబాట పడుతున్నారు. అనారోగ్య సమస్యలు, ఇతర పనులు చేయలేని వారి పరిస్థితి మరింత అగమ్యగోచరంగా తయారైంది. ఓవైపు ఉపాధిపోయి పెండ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడబిడ్డలను పోషించలేక..మరోవైపు అనారోగ్య సమస్య తీవ్రమవ్వడంతో తడక శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోవడం సమస్య తీవ్రతను ఎత్తిచూపుతున్నది. ఈ పరిస్థితికి కారణం ఎవరు అని మూలాల్లోకి వెళ్లి పరిశీలిస్తే తలా పాపం..తిలా ...2లో

సీఈసీల నియామకంపై అత్యవసర విచారణ

15న విచారించేందుకు సీజేఐ డివై చంద్రచూడ్ నిర్ణయం

- సీఈసీల నియామకానికి సెలక్షన్ కమిటీ సమావేశంపై అధిర్ రంజన్ చౌదరి లేఖ



వివరాలు 10లో

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం

- ఎలక్టోరల్ బాండ్ల వివరాలు గడువులోగా వెల్లడిస్తాం : సీఈసీ రాజీవ్ కుమార్ వివరాలు 10లో

బరిలో ఎవరు..?

స్థానిక నేతలతో అభిప్రాయ సేకరణ.. అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంపీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ అచితూచి అడుగులేస్తున్నది. ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఆ పార్టీ వేట మొదలు పెట్టింది. అందుకు పార్టీ నేతలే కావాల్సిన అవసరం లేదు. ఎన్నికల రణరంగంలో తలపడే రేసు గుర్రమైతే చాలు అనే విధంగా కాంగ్రెస్ వ్యూహరచన చేస్తున్నది. రాష్ట్రంలో హస్తం అధికారంలో ఉండటంతో అధిష్టానం కూడా టీపీసీసీకి పెద్ద కర్తవ్యాన్ని నిర్దేశించింది. దీంతో ఇప్పటికే బీజేపీ ప్రకటించిన అభ్యర్థులకు ధీటైన నేతలను ఎంపిక చేసే పనిలో రేవంత్ బృందం పడింది. ఈసారి 14 ఎంపీ స్థానాలకు తక్కువ కాకుండా ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో ఆ టీమ్ ఉన్నది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జీలు ఏ మాత్రం ఏమరుపాటు వహించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధిష్టానం సూచించింది. ఇతర పార్టీలకు చెందిన నేతలను చేర్చుకునే విషయంలోనూ స్థానిక నేతల అభిప్రాయాలకే పెద్ద పీట వేస్తున్నది. 'మీ నియోజకవర్గంలో ఎవరు పోటీ చేస్తే విజయం సాధిస్తారు. ఎవర్ని రంగంలో దించితే బాగుంటుంది. అక్కడ బీఆర్‌ఎస్, బీజేపీ పరిస్థితి ఏంటి? ఆ పార్టీలకు చెందిన అభ్యర్థుల బలాబలాలేంటి?' అభ్యర్థిగా ఎవరుండాలి? వారికి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాదరణ, నాయకుల సహకారం తదితర అనేక విషయాలపై రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి... బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలను సేకరించింది. అయితే ఇప్పటికే తమ అభ్యర్థిత్వం పరిశీలించాలంటూ 800 మందికిపైగా నేతలు హైకమాండ్‌కు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. అందులో నుంచి ప్రతి నియోజకవర్గానికి ముగ్గురి పేర్ల చొప్పున కేంద్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీకి పీసీసీ పంపించిన సంగతి విదితమే. కాగా, వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్న తరుణంలో అభ్యర్థుల కోసం దీపాదాస్ మున్షి అభిప్రాయ సేకరణ చేయడం పట్ల పార్టీ నేతల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే తొలి జాబితా వచ్చింది. అందులో జహీరాబాద్ - సురేష్‌కుమార్ షెట్కర్, నల్లగొండ - రఘువీర్‌రెడ్డి, మహబూబ్‌నగర్-చల్లా వంశీచంద్ రెడ్డి, మహబూబాబాద్ (ఎస్టీ) -బలరాం నాయక్ పేర్లు ప్రకటించిన సంగతి విదితమే. మిగిలిన 13 స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు నడుస్తోంది. ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులు తమ అభిప్రాయాలను అధిష్టానం ప్రతినిధుల ముందు వెల్లడిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్ల నియోజకవర్గాలకు చెందిన నాయకుల నుంచి ఇప్పటికే అభిప్రాయ సేకరణ పూర్తయినట్టు తెలిసింది.

బీఆర్‌ఎస్ హయాంలో పది రెట్ల అప్పుల భారం

- కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్‌తో బీడు భూములు సస్యశ్యామలం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వివరాలు 10లో

కాంగ్రెస్ నారీ న్యాయ్ గ్యారంటీ

- ఏడాదికి లక్ష రూపాయల నగదు బదిలీ
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం కోటా
- లోక్‌సభ ఎన్నికలకు ముందు మహిళలకు ఐదు వాగ్దానాలు



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మహిళలకు ఐదు హామీలను ప్రకటించింది. వీటిలో దేశంలోని పేద కుటుంబాల్లోని ప్రతి ఒక్క మహిళకూ వార్షికంగా రూ. 1 లక్ష నగదు బదిలీ, కేంద్రం ప్రభుత్వ ఉద్యోగాల్లో అన్ని కొత్త రిక్రూట్‌మెంట్లలో 50 శాతం కోటా వంటివి ఉన్నాయి. పార్టీ "నారీ న్యాయ్" హామీని ప్రకటించిందనీ, దీని కింద దేశంలోని మహిళల కోసం కొత్త అజెండాను ఏర్పాటు చేయబోతున్నామని 'ఎక్స్'లో ఒక ...11లో

పెంబర్తి వద్ద హైడ్రామా

మాజీ మంత్రి ఎర్రబెల్లితో హైదరాబాద్‌కు మాజీ ఎమ్మెల్యే ఆరూరి పయనం

- పెంబర్తి వద్ద అడ్డుకున్న బీజేపీ నాయకులు,
- ఇరు పార్టీల మధ్య తోపులాట చిరిగిన రమేష్ చొక్కా..
- ఆ తర్వాత బీఆర్‌ఎస్ మీటింగ్‌కు హాజరు



నవతెలంగాణ-జనగామ/హన్మకొండ

బీఆర్‌ఎస్ సీనియర్ నేత, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీలో చేరికపై బుధవారం హైడ్రామా నడిచింది. ఆయన కోసం బీజేపీ నేతలు చేజింగ్ పాలిటిక్స్ నడిపారు. కొంతకాలంగా బీఆర్‌ఎస్‌లో అసంతృప్తిగా ఉంటూ వరంగల్ పార్లమెంట్ స్థానానికి అధిష్టానం ఆమోదం తెలుపకపోవడంతో బీజేపీలోకి వెళ్లాలని ప్రయత్నం చేస్తున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. విషయం తెలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆరూరిని బుజ్జగించే ప్రయత్నంలో బుధవారం హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా జనగామ జిల్లా పెంబర్తి వద్ద బీజేపీ నాయకులు అడ్డుకొన్నారు. వాహనం నుంచి ఆరూరిని బయటకు లాగుతున్న క్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకున్నారు. దాంతో ఇరుపార్టీ నాయకుల మధ్య జరిగిన తోపులాటలో ఆరూరి రమేష్ చొక్కా చినిగింది.

హన్మకొండ హరిత హోటల్లో కొందరు బీజేపీ అధినాయకులను కలిసిన ఆరూరికి వరంగల్ పార్లమెంట్ టికెట్‌పై హామీ రావడంతో బుధవారం ఉదయం తన నివాసంలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరాలని ప్రకటించడానికి ఆరూరి రమేష్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దాంతో బీఆర్‌ఎస్ అధిష్టానం కేసీఆర్, హరీశ్ రావు అప్రమత్తమై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మరికొంత మంది సీనియర్ నాయకులను విలేకరుల సమావేశానికి ముందే ఆరూరి రమేష్ నివాసానికి పంపించారు. వారిని చూసి ఆరూరి ఉద్వేగానికి గురయ్యారు. గతంలో మాదిరిగానే మళ్లీ మన పార్టీ నాయకులే నన్ను ఓడించడానికి ప్రయత్నం చేస్తారని కన్నీరు పెట్టుకున్నారు. ఆరూరిని బలవంతంగా తమ వాహనాల్లో ...11లో

కలెక్టర్లూ... బడులను తనిఖీ చేయాల్సిందే

- వారానికి రెండు పాఠశాలలు తిరిగి నివేదిక ఇవ్వాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేయాల్సిందేనని ప్రభుత్వం ఆదేశించింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును వారు ప్రత్యేకంగా పరిశీలించాలని సూచించింది. పాఠశాలల పర్యవేక్షణపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టిసారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. వారానికి రెండు పాఠశాలలను తిరిగి ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని కోరారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకుని నివేదికను రూపొందించాలని తెలిపారు. ముఖ్యంగా అమ్మాయిలకు ప్రత్యేకంగా టాయ్‌లెట్లు ఉన్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం ...11లో



హీట్ పెంచుతున్న ఎంపీ సీట్లు..

బీఆర్‌ఎస్‌లో అలకలు.. బుజ్జగింపుల పర్వం...

అధినేత నచ్చజెప్పినా ఆగని నేతలు

- పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి కోనేరు కోనప్ప రాజీనామా
- కూతురికి టిక్కెట్ దక్కటంతో అలక వీడిన కడియం
- ఎట్టకేలకు మెత్తబడ్డ మాజీ ఎమ్మెల్యే ఆరూరి
- ఈ పరిణామాల మధ్యే మరో నాలుగు ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్
- చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్, జహీరాబాద్- గాలి అనిల్ కుమార్, నిజామాబాద్ -బాజిరెడ్డి గోవర్థన్, వరంగల్ -డాక్టర్ కడియం కావ్య పేర్లు ఖరారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు... అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్‌ఎస్‌కు, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల రూపంలో మరిన్ని కష్టాలు ఎదురవుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో అసలు అభ్యర్థులే దొరక్క ఇబ్బందులు పడుతుంటే, మరికొన్ని చోట్ల సీటు దక్కని నేతలు పార్టీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకోవటంతో అధినేతల్లో సైతం ఆందోళన మొదలైంది. వరంగల్ జిల్లాలో సీనియర్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ తదితరులు బీఆర్‌ఎస్‌కు గుడ్ బై చెప్పనున్నారనే వార్తలు బుధవారం ఉదయం నుంచి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. దీంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆరే స్వయంగా రంగంలోకి సమావేశాల మీద సమావేశాలు ...11లో

సంపాదకీయం

ఎట్టకేలకు...

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టమైన తీర్పునిచ్చిన సర్వోన్నత న్యాయస్థానం ఆ బాండ్లకు సంబంధించిన వివరాలన్నింటినీ మూడు వారాల్లో (మార్చి 6 లోగా) ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని ఆదేశించిన విషయం విదితమే. దీన్ని ఎస్‌బిఐ అమలు చేయకుండా తాత్సారం చేసింది. డేటా అందుబాటులో లేదని తప్పించుకునే ప్రయత్నం చేసింది. మరో మూడు నెలలకు పైగా (జూన్ 30 వరకు) సమయం కావాలని కోరింది. అయితే ఈ అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.ఆ సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మొన్న మంగళవారం సాయంత్రానికి అందజేయాల్సిందేనని ఆదేశించింది. దీంతో చేసేదేమిలేక ఎస్‌బిఐ ఆ సమాచారాన్ని గడువు ముగిసిన ఆరు రోజులకు ఎట్టకేలకు ఈసికి అందజేసింది. ఎస్‌బిఐ అందించిన సమాచారాన్ని ఈ నెల 15న వెబ్‌సైట్‌లో ప్రజలకు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘాన్ని కూడా కోర్టు ఆదేశించింది. మొదటి నుంచి వివాదస్పదంగా మారిన ఎన్నికల బాండ్ల వ్యవహారం రాజ్యాంగ విరుద్ధం. ఈ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందినది ముమ్మాటికీ అక్రమ సొమ్ము. అయితే ఈ అక్రమాలు బయటపడకుండా చేసే ప్రయత్నంలో కేంద్రం పాత్ర ఉన్నదనే విషయం తెలియనిది కాదు. పాలకుల కనుసన్నల్లో పనిచేయకుండా ఈ సమాచారాన్ని వెనువెంటనే ఇవ్వడం ఎస్‌బిఐ చట్టబద్ధ బాధ్యత. కానీ దాన్ని విస్మరించడం ప్రజల విశ్వాసాన్ని వంచించడమే.

> రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందిన సొమ్మును స్తంభింపజేయాలని మాజీ ఐఏఎస్ అధికారి ఇఎఎస్ శర్మ ఎన్నికల కమిషన్‌ను కోరడం సముచితమైనది. బాధ్యతగల పౌర సమాజం ఈ రీతిలోనే స్పందించాలి. ఎన్నికల బాండ్లను తొలినుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సీపీఐ(ఎం) ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు సరికదా వాటిని నిర్వహించడానికి చట్టరీత్యా అవసరమైన బ్యాంకు అకౌంట్ సైతం తెరవలేదు.

ఇచ్చిన మూడు వారాల గడువులోగా పూర్తి చేయడం మాని ఇంకా గడువు పెంచాలనడం న్యాయ స్థానాన్ని, దేశ ప్రజలనూ మభ్యపుచ్చడానికే. జూన్ 30కల్లా సమాచారమంతా అందచేస్తామనడం ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా వుండేందుకు పన్నాగమే! ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారం, పత్రాలు దేశంలోని వివిధ ఎస్‌బిఐ శాఖలలో ఉన్నాయని, వీటన్నింటినీ డీకోడింగ్ చేయడం కష్టమైనపనని, కొంత సమయం అవసరమవుతుందని ఎస్‌బిఐ కోర్టుకు తెలపడం ఆశ్చర్యకరం. ఎన్నికల బాండ్ల నిర్వహణ కోసం ఎస్‌బిఐకి ఇప్పటికే ఐటీ వ్యవస్థ కూడా ఉంది. తన సకల కార్యకలాపాలనూ డిజిటలైజ్ చేసిన ఎస్‌బిఐ ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను మూడు వారాల్లో ఇవ్వలేక పోవడం నమ్మశక్యం కాదు. బాండ్లకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా, త్వరగా తెలుసుకోవచ్చునంటూ 2019 మార్చి 15న కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌కు ఇప్పటి ఎస్‌బిఐ వైఖరి పూర్తి భిన్నమైనది. ఎన్నికల బాండ్లను తెచ్చిన ఏలినవారి ఒత్తిళ్ల కారణం గానే ఎస్‌బిఐ ఇలా వ్యవహరిస్తోందన్నది జనవాక్యం. తమ రాజకీయ ప్రయోజనాల కోసం అధికార పార్టీ బ్యాంకులను ఉపయోగించుకోవడం గర్హనీయం.



ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించడంలో విఫలమైన భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బిఐ)పై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్), కామన్‌కాజ్ సంస్థలు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాయి. గడువు పొడిగించాలంటూ ఎస్‌బిఐ సమర్పించిన దరఖాస్తు దురుద్దేశ పూరితంగా ఉన్నదని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు విఘా తం కలిగించేందుకు ఆ బ్యాంక్ ప్రయత్నిస్తోందన్న ఎడిఆర్ వాదన సబబైనదే! రాజకీయ పార్టీలకు ఎవరు విరాళాలు అందజేశారు, ఎంత మొత్తంలో ఇచ్చారు అనే సమాచారాన్ని తెలుసుకునే ప్రాథమిక హక్కు రాజ్యాంగంలోని 19 (1) (ఎ) ప్రకారం ప్రజలకుంది. 2017-18 నుండి 2022-23 వరకు రూ.12,008 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను విక్రయించగా వీటిలో బీజేపీకి రూ.6,564 కోట్లు (సుమారు 55శాతం) అందాయి.

రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు పొందిన సొమ్మును స్తంభింపజేయాలని మాజీ ఐఏఎస్ అధికారి ఇఎఎస్ శర్మ ఎన్నికల కమిషన్‌ను కోరడం సముచితమైనది. బాధ్యతగల పౌర సమాజం ఈ రీతి లోనే స్పందించాలి. ఎన్నికల బాండ్లను తొలినుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సీపీఐ(ఎం) ఒక్క రూపాయి కూడా తీసు కోలేదు సరికదా వాటిని నిర్వహించడానికి చట్టరీత్యా అవసరమైన బ్యాంకు అకౌంట్ సైతం తెరవలేదు. సుప్రీంకోర్టులో బాండ్లకు వ్యతిరేకంగా కేసు దాఖలు చేసింది కూడా! అన్ని వైపులనుంచి ఒత్తిడి రావడంతో ఎస్‌బిఐ ఎట్టకేలకు వివరాలు సమర్పించింది.

అయితే ఈ వివరాలు వెబ్‌సైట్‌లో పెడితే అసలు భాగోతం బయటపడుతుంది. కానీ దానికి సాంకేతిక పరమైన చిక్కులున్నాయనేది ఈసి వాదన. ఎస్‌బిఐ అందజేసిన వివరాలు 'ముడి' ఫార్మట్‌లో ఉన్నదని, దాన్ని రెండు,మూడు రోజుల్లో అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదని ఈసి చెబుతోంది. ఏది ఏమైనా ఎస్‌బిఐకి సమయం ఇవ్వకుండా సుప్రీంకోర్టు పట్టుదలతో వివరాలు అందజేసేలా చేసిన ప్రయత్నం ఆహ్వానించదగినది.

ఇప్పటికైనా దామాషా ప్రాతినిధ్య ఎన్నికలు, రాజకీయ పార్టీలకు ప్రభుత్వమే నిధులు సమకూర్చడం, పారదర్శకత పెంపు వంటి ఎన్నికల సంస్కరణల కోసం ప్రజాఉద్యమం సాగాలి. తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవ్వాలి. లేకపోతే జమిలి ఎన్నికలు, ఆ తరువాత అధ్యక్ష తరహా పాలన వంటి వినాశకర విధానాలను పరివార్ శక్తులు ముందుకు తెస్తూనే ఉంటాయి.

ఎవరి ప్రయోజనాల కోసం ఈ కాళేశ్వరం?

గోదావరి నదీజలాలను మెరుగైన సమర్థవంతమైన వినియోగానికి దారితీసే ప్రభుత్వ విధానం ఇప్పటివరకు రాలేదు. ప్రాథమిక, అనిశ్చిత సాంకేతిక సమాచారం ఆధారంగా కోట్ల రూపాయల పెట్టుబడులు ఉంటాయి గనుక ప్రభుత్వ విధానం అవసరం. మూడు నాలుగు రకాల ప్రత్యామ్నాయ వ్యూహాలుండే విధంగా ప్రాజెక్టుల రూపకల్పన జరగాలి. సాంకేతిక, ఆర్థిక, పర్యావరణ కోణాలతో ముడిపడిన అధ్యయన ఫలితాలతో కూడిన ప్రాజెక్టు రిపోర్టులతో మొదలు కాకుండా రాజకీయ నాయకులు, వారికి అనుకూలంగా వ్యవహరించే ఇరిగేషన్ ఇంజినీర్ల సంకుచిత ఆలోచనలు పునాదులుగా సాగునీటి ప్రాజెక్టులు కట్టడంతో కోట్ల రూపాయల పెట్టుబడులు మృగ్యమవుతున్నాయి. తొందరపాటు నిర్ణయాల వల్ల విపరీత ఆర్థిక, పర్యావరణ నష్టం వస్తున్నది. అప్పుల భారం మిగులుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ తరహ వ్యవహారాల నుంచి ఉట్టిపడినదే. ఆర్థిక ఒత్తిళ్లు, నీటిపారుదల అభివృద్ధికి మూలధన వ్యయాలు పెరగడం, కాలువల వ్యవస్థ గురించి ఆలోచించకపోవడం, నీటిపారుదల నిర్మాణాల నిర్వహణ లేకపోవడం, పర్యవసానంగా నీరందకపోవడం వంటి కారణాల వల్ల నీటిపారుదల ప్రాజెక్టుల స్థిరత్వం ప్రశ్నార్థకమతున్నది.



దొంతిరెడ్డి నరసింహారెడ్డి
9010205742

తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు పరిపాలనా ఆమోదం ఇవ్వలేదని కాగ్ తేల్చింది. ప్రాజెక్ట్ మొత్తం బదులుగా


> నీటి స్వావలంబన కోసం తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తు లేచింది. తెలంగాణా వచ్చింది. పదేండ్ల తరువాత వేల కోట్ల రూపాయల పెట్టుబడి తరువాత నీటి వనరుల స్వావలంబన కలగానే మిగిలింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో వివిధ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతలలో నీటిపారుదల లేదు అంటూ, నీటిపారుదల రంగంలో "అస్థిర" ప్రణాళికల గురించి ఏరులుగా పారించిన విమర్శలు ఇప్పుడు కొత్త రూపం తీసుకున్నాయి. అప్పుడు చేసిన తప్పులను సరిదిద్ది సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి ఒక పారదర్శక నిర్ణయ వ్యవస్థ నిర్మాణం చేయకుండా అంతకంటే ఘోరంగా ప్రాజెక్ట్‌ను చేపట్టిన ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్ట్. నీళ్లకోసం రాజ్యం వచ్చింది. పాలకులను ప్రజలు మార్చారు. నీళ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది అనే కంటే దిగజారింది అని చెప్పవచ్చు.

విడిగా 73 పరిపాలనా అనుమతులు రూ.1,10,248.48 కోట్ల వ్యయానికి జారీ చేసింది. ఇట్లా ఎందుకు చేయవలసి వచ్చింది?ప్రాజెక్ట్ నిధుల గురించి ప్రభుత్వంలో ఒక ఉత్తర్వు లేదు, రిపోర్ట్ లేదు. మరి ప్రాజెక్టు సంబంధించిన కూడికలు, తీసివేతలు ఎక్కడ జరిగాయి, ప్రభుత్వంలో కాకుండా ప్రాజెక్టులు కట్టాలని ముందు నిర్ణయించి తరువాత ప్రాజెక్టులు అనుమతులు తీసుకునే ఆనవాయితీ వేళ్లూనుకునిపోయింది. భారీ ప్రాజెక్టుల వల్ల భౌగోళికంగా, ఆర్థికంగా, పర్యావరణానికి, సమాజంలో మార్పు లుంటాయి గనుక అనేక అనుమతుల ప్రక్రియలు ఏర్పాటు చేశారు.అయితే, రాజకీయ నాయకులు ఏ అనుమతి తీసుకోకుండా స్వార్థ రాజకీయ లక్ష్యం కోసం, ముందు నిర్మాణాలు మొదలు పెట్టి ఆనక అనుమతులు తీసుకుంటున్నారు. కోర్టుకు పోతే ఫలితాలు రావడం లేదు. 'ప్రాజెక్టులు ముందు, అనుమతులు తరువాత' ఒక సూత్రంగా పెట్టుకుని గత తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. పర్యవసానంగా కోట్ల రూపాయల పెట్టుబడి నీటిపాలైంది. రాజ్యాంగంలో నీరు రాష్ట్రాలకు సంబంధించిన అంశం కాబట్టి రాష్ట్రాధినేతలు తమ సొంత పద్ధతిన పోతున్నారు. కేంద్రం పారదర్శకంగా వ్యవహరించడం లేదు. మొత్తానికి పార్టీలకతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధినేతల మధ్య వర్గ ప్రయోజనాల సారూప్యం ఉన్నది. రాజ్యాంగ ప్రక్రియలు తుంగలో తొక్కడం, ప్రజా ప్రయోజనాలకు మసి పూయడం, స్వార్థపర లక్ష్యాలకు బహుంలార్థసాధక లేపనం పూసి ఒక స్వప్నంగా మార్చి, ప్రజాధనం దండుకోవడం.

బాహ్య చర్చ అంతా నీటి లభ్యత (ఎక్కడ, ఎంత) చుట్టూ ఉంటున్నది. నల్లాలలో నీళ్లు ఎన్ని పారుతున్నాయో ఇదమిత్తంగా చెప్పలేని రాజకీయ, అధికార, న్యాయవ్యవస్థ నదులలో ప్రవహించే నీటికి 'కచ్చితమైన' లెక్కలు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తుంది. విస్తృత చర్చ జరగడం లేదు. నీటి లభ్యత గురించిన అంకెలున్నా, తమ లక్ష్యాన్ని బట్టి వాటిని మారుస్తున్నారు. అధికార ప్రతిపక్ష పార్టీలు ఒక రకంగా మాట్లాడితే, ఇంజినీర్లు తమ రాజకీయ సానుభూతి ప్రకారం మాట్లాడుతున్నారు. ప్రభుత్వ అధికార్లు అయితే సమాచారం ఇవ్వడానికే ఇష్టపడరు. ఇస్తే కాంట్రాక్టరుకు నష్టం అని భావిస్తారు. ప్రామాణికంగా సెంట్రల్ వాటర్ కమిషన్ లెక్కలు వాడకుండా అవసరమైన మేరకు అంకెలు మారుస్తూ, వాదనలు చేస్తున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా నీటి ప్రవాహ లెక్కలను సమీక్ష చేస్తున్న దాఖలాలు లేవు. కేంద్రం ఇస్తున్న నదులలో నీటి లభ్యత లెక్కలలో విశ్వసనీయత ఎంత?

వర్షం పడితేనే నదిలో నీళ్ళు వస్తాయి. వర్షం ప్రకృతి పరిస్థితులను బట్టి పడతాయి. నది పరివాహక ప్రాంతం విస్తృతంగా ఉంటుంది కనుక ఎక్కడ, ఎంత పడుతుంది అనేది ఎప్పుడైనా అంచనాలు మాత్రమే. పడిన వర్షం పిల్ల కాలువల నుంచి వాగుల ద్వార నదికి చేరతాయి. ఈ పిల్ల కాలువలు, వాగు నీటిని లెక్కగట్టే యంత్రాంగం లేదు. నదిలో అక్కడక్కడ పెట్టిన సెన్సార్లను బట్టి CWC నీటి ప్రవాహం అంచనా వేస్తారు. ఒక సంవత్సరం తీసుకుంటే అంచనా పరిపూర్ణం కాదు అని భావించి దాదాపు వందేండ్లు లెక్క అని చెబుతారు. వంద సంవత్సరాల క్రితం నది ప్రవాహాన్ని ఎవరు లెక్కగట్టారు? అప్పటికి నది ప్రవాహం పరిమాణం చెప్పడానికి పరికరాలు ఉన్నాయా? ఇటువంటి అనుమానాలకు సరైన సమాధానం రాదు. ఈ 100 సంవత్సరాల లెక్కలు కూడా 75 శాతం విశ్వసనీయతతో తీసుకుంటారు. అంటే వంద లీటర్లు అని లెక్క వస్తే, దానిలో 75 శాతం మాత్రమే నది ప్రవాహంగా ప్రామాణికం చేస్తారు. అంటే 25 శాతం error కింద పరిగణించి తీసివేస్తారు. ఇంత మొత్తంలో errorని శాస్త్రీయంగా ఆమోదించవచ్చా?

నీటిపారుదలని బహుళ-రంగాల అభివృద్ధితో అనుసంధానించకుండా విడిగా చూడలేము. వాతావరణ మార్పుల నేపథ్యంలో, పుడమి వేడి పెరుగుతున్న తరుణంలో నీటి కొరత పెరుగుతున్న ఆందోళన అర్థవంతమైన ప్రభుత్వ పెట్టుబడులకు దారి తీస్తే బాగుండేది. కాని, రాజకీయ నాయకుల స్వార్థంతో ప్రజలతో సంప్రదింపులు జరిపి తీసుకోవాల్సిన నిర్ణయాలు ఒక గదిలో కొందరు తీసుకున్నారు. కాళేశ్వరంలో జరిగింది అదే. CAG



నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ.1,47,427.41 కోట్లు దాటే అవకాశం ఉంది. అప్పట్లో CWCకి ఇచ్చిన అంచనా రూ.81,911.01 కోట్లు. ఇంకా పని పూర్తి కాలేదు. లక్షన్నర కోట్ల పైన పెట్టుబడి విస్తృత సంప్రదింపులు లేకుండా చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య. దానిని ఫలితంగానే దు:ఖం, నష్టం, అవినీతి, గుదిబండలు ప్రజలకు మిగిలాయి. రైతులకు, వ్యవసాయానికి తీరని నష్టం తెలంగాణాలో జరిగింది.

నీటి స్వావలంబన కోసం తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. తెలంగాణా వచ్చింది. పదేండ్ల తరువాత వేల కోట్ల రూపాయల పెట్టుబడి తరువాత నీటి వనరుల స్వావలంబన కలగానే మిగిలింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో వివిధ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతలలో నీటిపారుదల లేదు అంటూ, నీటిపారుదల రంగంలో "అస్థిర" ప్రణాళికల గురించి ఏరులుగా పారించిన విమర్శలు ఇప్పుడు కొత్త రూపం తీసుకున్నాయి.అప్పుడు చేసిన తప్పులను సరిదిద్ది సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి ఒక పారదర్శక నిర్ణయ వ్యవస్థ నిర్మాణం చేయకుండా అంతకంటే ఘోరంగా ప్రాజెక్ట్‌ను చేపట్టిన ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్ట్. నీళ్లకోసం రాజ్యం వచ్చింది. పాలకులను ప్రజలు మార్చారు. నీళ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది అనే కంటే దిగజారింది అని చెప్పవచ్చు.

పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో దాదాపు నీటిపారుదల ప్రాజెక్టులు వాటి ప్రణాళికలు, అందులో లోటుపాట్లు లోతుగా అధ్యయనం చేయలేదు. ప్రాజెక్టుల వలన కలిగే నిర్వాసిత సమస్యతో సహా పర్యావరణ, సామాజిక, భౌగోళిక, సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి సరైన సమాచారం సేకరించకుండా, ప్రభావిత అంశాల మీద అధ్యయనం లేకుండా చేపట్టడం ఘోర తప్పిదం. అందుకే అంచనాలు తప్పి, దుష్ఫలితాలు మిగులుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిదేండ్లలో రిడిజైనింగ్, పునరుద్ధరణ, సంస్కరణలు, అద్భుతాలు అంటూ మొదలు పెట్టిన సాగునీటి ప్రాజెక్టులలో అధ్యయనం, లోతైన పరిశీలన, పారదర్శకత, జవాబుదారీతనం లేవు. గోదావరి ప్రాజెక్ట్‌కి నివేదికలు తయారు ఒక తంతుగా మారాయి అనడానికి ప్రధాన నిదర్శనం వాటి నిర్మాణ సమయంలో తరచూ చేసిన మార్పులు. 2016-17 బడ్జెట్‌లో నీటిపారుదల కోసం రూ.25వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ధైర్యంగా ప్రకటించినప్పటికీ, అప్పటి బడ్జెట్లో దాదాపు 25 శాతం ఉన్న ఈ ముఖ్యమైన అంశంపై రాష్ట్ర శాసనసభ ఒక్కనిమిషం కూడా చర్చించలేదు. ఆ తరువాత కాలంలో కూడా శాసనసభ బంగారు తెలంగాణకు నాందిగా చూపెట్టిన ప్రాజెక్ట్ గురించి చర్చించకపోవడం, ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడం వలన ప్రస్తుత దుస్థితి దాపురించింది.

అప్పటికే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై అయిన రూ.9వేల కోట్ల వ్యయం నిర్లక్ష్యం చేశారు. భారీపెట్టుబడులు ప్రజాధనంతో పెడుతున్నప్పుడు అటువంటి మౌలికసదుపాయాల సమగ్రత, సుస్థిరత, భవితవ్యానికి సంబంధించి సంపూర్ణ చర్చ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అప్పటి ముఖ్యమంత్రి ప్రాజెక్టుల మీద ఇచ్చిన ప్రజెంటేషన్ అనేక విషయాలు ప్రస్తావించలేదు. విద్యుత్ అవసరాలు, నిర్వహణ వ్యయం, పంటల విధానం మొదలైనవాటి గురించి ఆలోచించలేదు. ఆ ప్రెజెంటేషన్ కేవలం డిజైన్, కొన్ని సాంకేతిక అంశాలపై మాత్రమే కేంద్రీకఅతమైంది.ప్రజల భాగస్వామ్యంతో కూడిన సంపూర్ణ ప్రణాళిక రచనకు ప్రజాస్వామిక ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం అనేకులు ఆనాడే ఎత్తిచూపారు.

నీటిపారుదల ప్రాజెక్టులలో రైతుల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకం. ప్రణాళికా దశనుండి అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు, అందుబాటులోకి వచ్చే నీరు, విద్యుత్ ఉపయోగం సమర్థంగా ఉండడానికి తగిన పంటల విధానం ఉద్భవించడానికి రైతులతో సంప్రదింపులు చేసి ఉండాల్సింది. అది చేయలేదు. ప్రాజెక్టులు కొంత మేర పూర్తి కాగానే ఒకసారి వరి వేసుకోమని, ఇంకొకసారి వద్దని కేసీఆర్ పరస్పర విరుద్ధ పిలుపు ఇవ్వడంతో రైతులలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటి వినియోగం గురించి సమగ్ర ప్రణాళికలు తయారుచేయలేదు. రైతులకు అసంపూర్ణ సమాచారం, అసందర్భంగా ఇచ్చి మోసం చేసింది. ముఖ్యమంత్రి పిలుపు మేరకు భారి ఎత్తున వరి వేసిన రైతులకు నిరాశే మిగిలింది.

ఇప్పటికైనా, ప్రస్తుత తెలంగాణా ప్రభుత్వం రైతులు, గుర్తించిన ఇతర ప్రాజెక్టు లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి, పారదర్శకంగా పరిస్థితి వివరించి, ఉన్న నీటిపారుదల వ్యవస్థను గరిష్ఠంగా ఉపయోగించే లక్ష్యంతో బహుళ-రంగాల అభివఅద్ధి విధాన ప్రణాళికను తయారు చేయాలి. విస్తృతమైన సంప్రదింపులు జరపాలి.కరువు, వరదల వల్ల నీటిలభ్యత తగ్గి తీవ్రమైన నీటిసంక్షోభానికి దారితీయవచ్చు. గ్లోబల్‌వార్మింగ్, వాతావరణ మార్పు వివిధ రూపాలలో వ్యక్తమవుతున్నందున, నీటిభద్రత సాధించడం అత్యవసరంగా మారింది. ఇది ఆహార భద్రతతో ముడిపడి ఉంటుంది. సమానత్వం, సామాజిక న్యాయం ఆదేశిక సూత్రాలుగా భావించే నీరు, ఆహార ఉపయోగ వ్యవస్థ చాలా కీలకంగా మారుతున్నది.జలవనరుల నిర్వహణలో అనేక సవాళ్లున్నాయి. విభిన్నమైన సంక్లిష్టమైన సమస్యలున్నాయి. మానవ వనరుల కొరత ఉన్నది. నిర్వహణ ఖర్చుల భారం ఉండనున్నది. చేపడుతున్న అభివృద్ధి వల్ల జల వనరులు మాయమవ్వడం, కలుషితం అవ్వడం చూస్తున్నాము. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకునేందుకు ఒక విధానం లేకపోవడంతో ఇష్టానుసారం ప్రభుత్వం చర్యలుంటున్నాయి.

రాజకీయ, పర్యావరణ, ఆర్థిక, సామాజిక, సాంకేతిక అంశాలను మిళితంచేసే నీటి(నదులు, వాగులు, చెరువులు, ప్రాజెక్టులు) నిర్వహణ వ్యవస్థ నిర్మాణానికి వినూత్న ఆలోచనలను ప్రేరేపించే సుపరిపాలన పద్ధతులు అవలంబించాలి. ప్రస్తుతం ఉపయోగిస్తున్న నీటివనరుల సంభావ్య అంచనాలు చాల పాతవి. భూవినియోగం, భూవిస్తీర్ణం, భూవినియోగ విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. నీటి కొరత పెరుగుతున్నదని అధ్యయనాలు చెబుతున్నాయి. క్లైమేట్ చేంజ్ ప్రభావాన్ని తట్టుకునే నీటి వనరులను పెంపొందించాలి.ప్రస్తుత నీటివిధానాలను మూల్యాంకనం చేయాలి. ■

బరువు తగ్గనున్న బడి పుస్తకాలు

బడులకు వెళ్తున్న విద్యార్థుల స్కూల్ బ్యాగులు చూస్తుంటే తల్లిదండ్రులుగా మనకు చాలా బాధేస్తుంది. ప్రతిరోజు ఇన్ని పుస్తకాలు మోసుకుంటూ బడికి వెళ్లాలా, ఇవన్నీ ప్రతిరోజు వాడుతారా, కొన్ని పుస్తకాలు తగ్గించుకోండి అని తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలను, విద్యార్థులను కోరుతున్న సందర్భాలను మనం చూస్తుంటాం.బ్యాగులో పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు పెట్టుకొని ప్రతి విద్యార్థి ఉదయం బడికి వెళ్తారు. ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులతో పోల్చుకుంటే ప్రయివేటు బడులకి వెళ్లే విద్యార్థుల స్కూల్ బ్యాగుల బరువు ఎక్కువగా ఉంటుంది. బరువు గల పుస్తకాలను మోస్తూ విద్యార్థులు రెండు, మూడంతస్తులు ప్రతిరోజు ఎక్కాల్సి వస్తుంది. అధిక బరువు గల పుస్తకాలను మోస్తూ విద్యార్థులు శారీరక , మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటు న్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠ్య



పుస్తకాలు, నోట్‌బుక్‌లతో కూడిన స్కూల్ బ్యాగ్ గరిష్ఠ బరువు 1,2 తరగతులకు 1.5 కిలోలకు మించ కూడదు. 3 నుండి 5 తరగతులకు 2-3 కిలోలు, 6, 7 తరగతులకు 4 కిలోలు, 8, 9 తరగతులకు 4.50 కిలోలు, పదో తరగతి విద్యార్థులకు 5 కిలోలు మాత్రమే ఉండాలి. కాని ప్రాథమిక స్థాయిలో 7 కిలోల నుంచి 15 కిలోల వరకు, హైస్కూల్ స్థాయిలో 19 కిలోల వరకు బరువున్న బ్యాగులను బడి పిల్లలు ప్రతిరోజు బడికి మోసుకెళ్తున్నారని సమాచారం. పుస్తకాల బరువు పెరగడంపై తల్లిదండ్రులు, డాక్టర్లు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావి వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన పభుత్వం పుస్తకాల బరువును తగ్గించే చర్యలు చేపట్టింది. లోపలి పేజీలకి 70 జీఎస్ఎం కాగితం, కవర్ పేజీలకి 200 జీఎస్ఎం మందం ఉండే కాగితం వాడి పాఠ్యపుస్తకాలు ప్రింట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల రాబోయే విద్యా సంవత్సరంలో పుస్తకాల బరువు తగ్గనుంది.

రాష్ట్రంలో ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు 58,98,686 మంది విద్యార్థులు చదువు తున్నారు. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుంది, ప్రయివేటు బడుల్లో చదివేవారు మాత్రం మార్కెట్లో పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలే వాడాలి, ప్రయివేటు బడుల్లో ప్రభుత్వం రూపొందించిన పాఠ్యపుస్తకాలు కాకుండా ప్రయివేటుగా రూపొందించిన పాఠ్యపుస్తకాలు వాడుతున్నారు.ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ప్రభుత్వ ప్రయివేటు బడుల్లో ప్రభుత్వం ఇచ్చిన సిలబస్‌ని తప్పనిసరిగా చదవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలే వాడాల్సి ఉంటుంది. రాబోయే విద్యా సంవత్సరం 1.90 కోట్ల పాఠ్య పుస్త కాలు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయ నుందని అంచ నా. పాఠ్య పుస్తకాల బరువు పెరగడా నికి ప్రధాన కారణం పుస్తకాలు తయారీలో మందం కాగితం వాడడమే.లోపలి పేజీల్లో 90 జీఎస్ఎం (గ్రామ్ ఫర్ స్క్వేర్ మీటర్), కవర్ పేజీలకు 220 జీఎస్ఎం కాగితాన్ని ఇప్పటి వరకు వాడుతు న్నారు. ఇలా కాగితం అందం పెంచడం వల్ల సుమారుగా ఒక్కొక్క తరగతికి ఒక కిలోగ్రామ్ వరకు బరువు పెరిగింది. పైగా ప్రభుత్వానికి రూ.50 కోట్ల అదనపు భారం.

ప్రస్తుతం ఒకటో తరగతి విద్యార్థి పాఠ్య పుస్తకాలు బరువు 1.991 కి.గ్రా ,5 వ తరగతి పాఠ్య పుస్తకాల బరువు 2.253 కి.గ్రా,10 వ తరగతి 5.373 కి.గ్రాలుండగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల వచ్చే విద్యా సంవత్సరంలో నూతన పాఠ్యపుస్తకాల బరువు ఒకటవ తర గతికి 1.408 కి.గ్రా, ఐదో తరగతి కి 1.759 కి.గ్రా, పదవ తరగతి కి 4.19 కి.గ్రా లుగా ఉండనున్నాయి.ప్రభుత్వ నిర్ణయం వల్ల విద్యా ర్థులకు పుస్తకాల బరువు 25శాతం నుంచి 30శాతానికి తగ్గనుంది. 3వేల మెట్రిక్ టన్నుల పేపర్ వినియోగం కూడా ఆదా అవనుంది. గతేడాది11వేల మెట్రిక్ టన్నుల పేపర్ వాడగా, ఈసారి 8వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వాడనున్నారు. తక్కువ పేపర్ వాడడం వల్ల పర్యావరణానికి కూడా మేలు. ప్రభుత్వం ఇంకా ప్రతిరోజు అన్ని పాఠ్యపుస్తకాలు కాకుండా రోజువారిగా కొన్ని పాఠ్య పుస్తకాలు ఉండేలా ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలి. ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ బడుల్లో మాదిరిగా ప్రయివేటు బడుల్లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలే ఉపయోగించేలా చర్యలు తీసుకుంటే ప్రయివేటు బడుల్లో చదివే విద్యార్థుల స్కూల్ బ్యాగుల బరువు మరింత తగ్గే అవకాశం ఉంటుంది.

- పాకాల శంకర్ గౌడ్,
9848377734.

దేశానికి ప్రత్యామ్నాయ విద్య ఎందుకు?

నూతన జాతీయ విద్యా విధానం భారతదేశ భవిష్యత్ నిర్మాణానికి తొలి అడుగు అని ప్రధాని మోడీ అంటున్నారు. ఇప్పటివరకు 'ఏం ఆలోచించాలి?' అనే విషయంపైననే దృష్టి పెట్టారని, తాజా ఎన్ఈపీ 'ఎలా ఆలోచించాలి? అనే విషయానికి ప్రాధాన్యత ఇస్తుందని మోడీ ఎన్ఈపీ గురించి గొప్పగా చెపుతున్నారు. ఇంత గొప్ప విద్యా విధానంపై పార్లమెంటులో ఎందుకు చర్చించలేదనేది ప్రశ్నకు సమాధానం లేదు? అయితే ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఎన్ఈపిని అసలు అమలు చేయమని బహిరంగంగానే ప్రకటించాయి. తమిళనాడు ప్రభుత్వం ఏకంగా అసెంబ్లీలో తీర్మానం కూడా చేసింది. బీజేపీయేతర రాష్ట్రాలు కర్నాటక, కేరళ, బెంగాల్ ఎన్ఈపిని వ్యతిరేకిస్తున్నాయి. వీటికి గల కారణాలు తెలిస్తే ఎన్ఈపి వెనుకున్న అసలు ఎజెండా మనకు అర్థమవుతుంది..



ఆర్‌ఎల్ మూర్తి
8247672658


ఈ విద్యా విధానం ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కస్తూరి రంగాన్ కమిటీ సిపార్స్ చేసింది.2020 జూలై 29 నుండి ఈ విద్య విధానం అమలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి మండలి ప్రకటించింది. అప్పటి నుంచి కేంద్ర విద్యశాఖ నుండి ఎన్ఈపి నీ అమలు చేయాలని అన్ని రాష్ట్రాల మీద ఒత్తిడి తెస్తోంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణతో విద్య కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అయితే ఈ విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమలు చేయాలని రాష్ట్రాల మీద బలవంతంగా రుద్దుతున్నారు. ఈ విధానంలో ప్రధానమంత్రి నేతృత్వంలో గల రాష్ట్రీయ శిక్ష అయోగ్ (ఆర్ఎస్ఎ) కింద స్థానిక యూనిట్స్‌గా రాష్ట్రాలు పని చేయాల్సి ఉంటుంది.దీంతో రాష్ట్రాలకు తమ అనుకూలంగా నిర్ణయించుకునే వెసులుబాటు, స్వతంత్రత ఉండదు. వైవిధ్య భరితమైన దేశంలో సిలబస్ నిర్వహణలో, పరీక్షల తయారీలో వివిధ సాంస్కృతిక జీవన విధానం ప్రతిబింబించేటట్లు విద్య ఉండాలి. కానీ అది ఇందులో కొరవడుతోంది.ఈ విద్యా విధానం అమలు చేయని రాష్ట్రాలకు నిధుల కోత పెడుతామంటోంది. స్వయం ప్రతిపత్తి కలిగిన యూజీసీ లాంటి సంస్థలు రేపు ఉండవు గనుక బీజేపీ పాలిత రాష్ట్రాల పట్ల చూపే ప్రేమ ఇతర రాష్ట్రాలపై ఉండదనేది సుస్పష్టం. రాజ్యాంగం ప్రీయంబుల్‌లో పేర్కొన్న లౌకిక, సామ్యవాద అంశాలకు ఈ విద్యావిధానంలో ఎక్కడ తావులేదు. దీన్ని బట్టి ఈ విద్యావిధానం రాజ్యాంగ స్ఫూర్తి తేటతెల్లమవుతుంది.

సామాజిక న్యాయానికి చోటేది?

మొత్తం ఎన్ఇపిలో సామాజిక న్యాయాన్ని గురించి ఎటువంటి ప్రస్తావన చేయలేదు.సమాజంలో అట్టడుగున ఉన్నవారు చదువు నేర్చుకుని, నైపుణ్యాన్ని సాధించి ఆర్థికంగా, సామాజికంగా పైస్థాయికి చేరుకోడానికి కుల వ్యవస్థలోని ఆధిపత్య స్వభావం, పితృస్వామ్య భావజాలంలోని ఆంక్షలు కారణాలుగా ఉన్నాయి. ఇవి ఏవిధంగా ఆటంకంగా వ్యవహరించాయో ఎన్ఇపి వీటిని పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైందని చెప్పవచ్చు.. ఈ వివక్షతను, అణచివేతను నిర్మూలించాలన్న అంశం కానీ రిజర్వేషన్ల విధానం గురించి ఎక్కడ పేర్కొనలేదు. సమాజంలో శతాబ్దాల తరబడి వివక్షతను ఎదుర్కొంటూ అవకాశాలకు దూరంగా నెట్టి వేయబడిన వర్గాలు, మహిళలు, మైనార్టీలు గిరిజన తెగల విద్యార్థులు ఇతరులతో సమాన స్థాయికి ఎదగాలంటే వీరికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం వలన సాధ్యమవుతుందనేది వాస్తవం.ఇది మన రాజ్యాంగం కల్పించిన హక్కు.ఇంత కీలకమైన అంశాన్ని ఎన్ఈపి పట్టించుకోలేదంటేనే ఆ వర్గాల పట్ల ప్రభుత్వ నైజాన్ని అర్థం చేసుకోవచ్చు.ఈ విద్యావిధానం అమలుతో సామజిక వెనకబాటు గురైన వర్గాల విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమే?

కులవృత్తులకే పరిమితమా?

వృత్తి విద్యా పేరుతో కుల వృత్తులను పాఠశాల విద్యలో ప్రవేశపెట్టనున్నారు. ఈ కులవృత్తుల్ని ప్రోత్సహించడం అంటే తిరిగి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడమే అవుతుంది. ఆరోవతరగతి నుంచి వృత్తి విద్యా కోర్సులు అమలు చేయనున్నారు.శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక దృష్టి, సృజనాత్మకత వంటి ధోరణులను పెంపొందించే బదులు తక్కువ వేతనాలకే పనిచేసే కార్మికులను తయారు చేయడానికి రేపు ఒకేషనల్ కోర్సుల పేర వృత్తి విద్యలను నేర్పుతారు. మన దేశంలో పేదరికం, సామజిక వివక్షత వలన విద్యను కింది వర్గాలు దూరమయ్యారు.



> ఈ విద్యా విధానం అమల్లో జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయిస్తామని చెప్తున్నారు.ఇది మంచి నిర్ణయమే కానీ ఈ పదేండ్లలో నాలుగు శాతం కూడా నిధులు కేటాయించలేనివారు రేపు ఆరు శాతం కేటాయించడం సాధ్యమా? దీనిలో పిలంత్రపిక్ సంస్థల పేరిట నిధులు కేటాయించి ప్రభుత్వ అనుకూల భావజాలాన్నీ, మూఢవిశ్వాసాలు విద్యలో పెంచి పోషించనున్నారు. ముఖ్యంగా సామ్రాజ్యవాద దేశాలకు మన మేదస్సును తాకట్టుపెట్టే లాగా ఉంది. విదేశీ విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యను వ్యాపారం చేసుకునేలా రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలకనున్నది ఎన్ఈపి. అందుకే ఈ దేశానికి ఆధునిక ప్రత్యామ్నాయ విద్య కావాలి. తిరోగమన, సనాతన,మనుధర్మ విద్యా విధానం పోవాలి. అందుకు మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలి.

ఇప్పుడిప్పుడే ఉన్నతవిద్య వైపు అడుగులు వేస్తున్నారు. దేశంలో ఉన్నత విద్యా చదువుతున్నా వారు కేవలం 36శాతం మాత్రమే.స్కూల్ ఎడ్యుకేషన్‌లో వృత్తి విద్యా అమలు చేస్తే ఉన్నత విద్యను చదివే వారి సంఖ్య మరింత తగ్గనున్నది. కులవృత్తులు నేర్పి సర్టిఫికెట్ ఇస్తామని చెబుతుంది.వృత్తి నేర్చుకొన్న విద్యార్థులు ఉపాధి కోసం మార్కెట్‌బాట పడతరనేది వాస్తవం. బాల కార్మికుల చట్టాలు అమలులో ఉన్నా కూడా బాలలు కార్మికులుగా మగ్గుతున్నారు.రేపు ఇది అమలైతే వారి బంగారు భవిష్యత్తు మరింత బుగ్గిపాలు కానున్నది.

పరిశోధనకు సంకెళ్లు

ఈ నూతన జాతీయ విద్యా విధానంలో (ఎన్.ఆర్.ఎఫ్) నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ పేరుతో పరిశోధనలను నియంత్రించనున్నది. పరిశోధనలు చేయాలంటే ఎన్.ఆర్.ఎఫ్ సూచనలకు అనుగుణంగా చేయాల్సిందే. వాటికి మాత్రమే గుర్తింపు ఇస్తుంది ఫెలోషిప్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఈ ఎన్ఆర్ఎఫ్ కూడా (రాష్ట్రీయ శిక్ష అయోగ్)ఆర్ఎస్ఏకు జాతీయ సంస్థగా పనిచేస్తుంది. ఇది సామాజిక పరిశోధనల కన్నా వాణిజ్యపరమైన పరిశోధనకు ప్రాధాన్యతను ఇస్తుంది. ఇప్పటికే దేశంలో పరిశోధన విద్య ప్రోత్సాహకాన్ని తగ్గించింది. దీని వలన మన రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో పాటు ఎన్ఈపిలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంఫిల్ కోర్స్ రద్దు చేశారు.శాస్త్రీయ దృక్పథం లేని కోర్సులులో పరిశోధనకు పెద్దపీట వేయనున్నారు.ఇప్పటికే యోగా, జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, కర్మశాస్త్రం, భూత వైద్యశాస్త్రాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు.

ఈ విద్యా విధానం మాతృభాషలో విద్యాబోధన ప్రాధాన్యత గురించి తెలపలేదు. అంతేకాక అదనంగా ఒక ప్రాచీన భాషను అంటే సంస్కృతంను ఉన్నత విద్య దశతో సహా అన్ని స్థాయిలలోనూ నేర్చుకోవాలని నిర్దేశించింది. సంస్కృతానికి పెద్దపీట వేసి ఇతర ప్రాచీన భాషలైన తమిళం, పాళీ, పర్షియన్ భాషలను చిన్న చూపు చూసింది. ఇతర దేశాల భాషలను సైతం నేర్చుకోవాలని చెప్పి ఫ్రెంచి, జపనీస్, కొరియన్, వంటి భాషలను ప్రస్తావించిన ఎన్ఇపి ఈ దేశ భాష ఉర్దూను, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్ గురించి పక్కనబెట్టింది.

దీంతోపాటు ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పేరుతో జాతీయస్థాయి అర్హత పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థకు హేతుబద్ధత లేదనేది వాస్తవం. దీని నిర్వహణ, పరీక్ష పాత్రల తయారీలో జవాబుదారీతనం లేదనేది కనపడింది. ఈ విద్యా విధానం అమల్లో జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయిస్తామని చెప్తున్నారు.ఇది మంచి నిర్ణయమే కానీ ఈ పదేండ్లలో నాలుగు శాతం కూడా నిధులు కేటాయించలేనివారు రేపు ఆరు శాతం కేటాయించడం సాధ్యమా? దీనిలో పిలంత్రపిక్ సంస్థల పేరిట నిధులు కేటాయించి ప్రభుత్వ అనుకూల భావజాలాన్నీ, మూఢవిశ్వాసాలు విద్యలో పెంచి పోషించనున్నారు. ముఖ్యంగా సామ్రాజ్య వాద దేశాలకు మన మేదస్సును తాకట్టుపెట్టే లాగా ఉంది. విదేశీ విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యను వ్యాపారం చేసుకునేలా రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలకనున్నది ఎన్ఈపి. అందుకే ఈ దేశానికి ఆధు నిక ప్రత్యామ్నాయ విద్య కావాలి. తిరోగమన, సనాతన, మనుధర్మ విద్యా విధానం పోవాలి. అందుకు మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలి. ■

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
గురువారం మార్చి 14, 2024 www.navatelangana.com

సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీని జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట

గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకొనుటకు ఈ నెల 29, 30, 31 తేదీల్లో కరీంనగర్‌లోని ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కోరారు. బుధవారం జమ్మికుంట జోన్ కమిటీ సమావేశం దండిగారి సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలపై వాటి ప్రభావాలు, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకునేందుకు ఈ ప్లీనరీ సమావేశాలు తోడ్పడుతాయన్నారు. ఈ ప్లీనరీ సమావేశానికి రాష్ట్ర నాయకు లు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో పార్టీ జోన్ కార్యదర్శి శీలం అశోక్, కొప్పుల శంకర్, చల్ పూరి రాములు, జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన మగ్గం.. ఆందోళనలో నేతన్నలు

- 3నెలలుగా నిలిచిన వస్త్ర ఉత్పత్తులు
- కరువైన సర్కారు చేయూత
- చితికిపోతున్న 'చేనేత' బతుకులు
- పనుల లేక తల్లడిల్లుతున్న కార్మికులు


అటకెక్కిన మగ్గం


పనులు లేక విప్పేసిన మగ్గం విడిభాగాలు

నవతెలంగాణ - గంగాధర

చటుక్కు.. చిటుక్కుమంటూ నాడె ఆగకుండా మగ్గం నేచే 'చేనేత' బతుకులు చితికిపోతున్నాయి. పల్లెల్లో మగ్గం సవ్వడి లేక 3 నెలలు గడుస్తుంటే, చేనేత గుడ్డ ఉత్పత్తులు నిలిచి నేతన్న కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. సర్కారు చేయూత కరువై నాడే ఆడక మగ్గం ఆగి నేతకార్మికులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఇది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, కొత్తపల్లి, జగిత్యాల జిల్లా పూడూరు, మెట్‌పల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడతోపాటు పలు ప్రాంతాల్లో ఖాదీ వస్త్ర ఉత్పత్తి సంఘాలు, చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటి ఆధ్వర్యంలో గంగాధర మండలం గర్శకుర్తి, ఉప్పరమల్యాల, గంగాధర, బూర్గుపల్లి, గట్టుభూత్కూర్, బోయినపల్లి మండలం తడగొండ, బోయినపల్లి, రామడుగు మండలం వెదిర, రామడుగు, గోపాల్‌రావు పేట, కొడిమ్యాల మండలం పూడూరుతోపాటు అనేక గ్రామాల్లోని చేనేత మగ్గాలపై గుడ్డ ఉత్పత్తులు జరుగుతుంటాయి. ఈ మగ్గాలకు కాటన్ ముడి సరుకును ఆయా సహకార సంఘాలు అందిస్తుండగా, చేనేత కార్మికులు ఖాదీ, కాటన్ వస్త్రాలు విరివిగా తయారు చేయడానికి అవసరమైన గుడ్డ ఉత్పత్తులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కాటన్ ముడి సరుకును వస్త్రాలు, గుడ్డగా మార్చే నేత కార్మికులకు మీటర్ల లెక్కన కూలీ చెల్లింపు జరుగుతుంది. ఒక్కో కార్మికుడు, కార్మికురాలు పొద్దంత పని చేసిన 300రూపాయలకు మించి కూలి గిట్టుబాటు అయ్యే పరిస్థితులు లేవు. కాని తరతరాలుగా చేనేత వృత్తినే నమ్ముకుని జీవనోపాధి పొందే చేనేత కుటుంబాలు చేసేది లేక, మరో పని రాక నేత పనిపైనే దృష్టి సారించి బతుకుతున్నారు. చేనేత కుటుంబాల్లోని యువకులు ఎక్కువ శాతం పవర్‌లూమ్స్‌పై పని చేస్తుంటే, వయసు మీరిన పెద్దలు మగ్గంను ఆశ్రయించి బతుకు జట్కాను నెట్టుకొస్తుంటారు. మగ్గంలో నాడె ఆగకుండా కాళ్లు, చేతులు ఆడిస్తూ పొద్దంత పని చేస్తూ గుడ్డ ఉత్పత్తితో ఊరట చెందుతున్న నేతకార్మికులు గత 3 నెలలుగా మగ్గం వస్త్ర పరిశ్రమ స్తంభించిపోవడానికి కారణమేంటో తెలియక ఆందోళన చెందుతున్నారు.

మన్నికకు, ధర్పానికి మారుపేరు చేనేత వస్త్రాలు..

రాజకీయ నేతలు, ఉన్నత ఉద్యోగాలు చేసే అధికారులు, ఉన్నతంగా కనిపించాలని ఆశించే వ్యక్తులు ఇప్పటికి చేనేత వస్త్రాలే ధరించి కనిపిస్తుంటారు. మన్నికకు, హుందాగా ధర్పం ప్రదర్శించడానికి చేనేత వస్త్రాలకు పెట్టింది పేరని చెప్పొచ్చు. చేనేత వస్త్రోత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండే ఉంది. నిష్ణాతులైన నేతన్నలు లుంగీలు, లంగాలు, టవాల్స్, దస్తీలు, కుర్తాలు, చందర్లు, చీరలు, దొవతులు, బాల,బాలికలు, మహిళలు ధరించే షెర్టు వంటి అనేక రకాల చేనేత ఉత్పత్తులు మగ్గాలపై తయారు చేసిన గుడ్డతోనే డైయింగ్ చేసి అవసరమైన దుస్తులను తయారు చేయిస్తారు. వీటిని ప్రస్తుతం ఖాదీ భండార్‌లలో ప్రత్యేకంగా అమ్మకాలు సాగిస్తుండగా, ప్రతి బట్టల దుకాణాల్లోనూ విక్రయిస్తుంటారు. ఖాదీ, కాటన్ వస్త్రాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండగా, అమ్మకాలు లేవంటూ సంఘాల బాధ్యులు మగ్గంపై తయారు చేసే గుడ్డ ఉత్పత్తులు నిలిపివేయడం చేనేత కార్మికులను కలవరపరుస్తుంది.

చేనేతలో సంక్షోభమా.. చేయూత లేక సమస్యలా..

చేనేత మగ్గం వస్త్ర పరిశ్రమ చతికిల పడడానికి ఆ పరిశ్రమ నిపుణులు రెండే రెండు కారణాలు చెపుతుంటారు. ముడి సరుకు ధరలు పెరగడం, తయారు చేసిన వస్త్రోత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం, సర్కారు చేయూత లేక దివాల తీయడం వంటి కారణాలే చేనేత వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి దారి తీస్తాయి. కాని ఇవేవి కారణం కాదంటున్న ఖాదీ సంఘాలు, వస్త్ర పరిశ్రమ సహకార సంఘాల బాధ్యులు మగ్గంపై గుడ్డ ఉత్పత్తులు నిలిపివేసి చేనేత కార్మికులను ఎందుకు అయోమయానికి గురి చేస్తున్నట్లో అంతు చిక్కని అంశమే. మగ్గాలనే నమ్ముకుని పొట్ట పోసుకుంటున్న చేనేత కార్మికుల జీవనోపాధిపై దెబ్బతీసేలా సాగుతున్న రహస్యానికి పాలకులు, అధికారులు తెర దించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నేతన్న గోటిచుట్టుపై రోకటి పోటే..

ఓ వైపు పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోగా, మరోవైపు మగ్గం వస్త్రోత్పత్తులు నిలిచి గోటి చుట్టుపై రోకటి పోటు చందంగా చేనేత బతుకులు మారాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారగా, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామం ఆకలి చావులు, ఆత్మహత్యలకు నిలయంగా మారింది. సిరిసిల్ల, గర్శకుర్తిలో అత్యధికంగా చేనేత కుటుంబాలే జీవిస్తుండగా, పనులు లేక పస్తులతో ఉండలేక బలవన్మరణాలకు పాల్పడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్పించిన బతుకమ్మ చీరల ఆర్డర్లు, సహకార సంఘాలు, ఖాదీ సంఘాలకు చేయూతను కల్పించారు. ప్రభుత్వ మార్పుతో మళ్లీ సంక్షోభంలో చిక్కి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పనులు కల్పిస్తేనే బతుకుదెరువు



- దీకొండ విఠల్, చేనేత కార్మికుడు, గర్శకుర్తి

మగ్గంపై నేచే గుడ్డ ఉత్పత్తి పనులు వెంటనే అందించాలి. 3నెలలుగా మగ్గంపై గుడ్డ ఉత్పత్తి చేయడానికి బీములు, ముడి సరుకు ఇవ్వడం లేదు. పనులు లేక అవస్థ పడుతున్నం. మందం ఉందని బీములు ఇవ్వడం లేదు. ఏడాది నుండి రావల్సిన యారన్ సబ్సిడీ నేటి అందలేదు. ప్రభుత్వం వెంటనే యారన్ సబ్సిడీని ఇవ్వాలే.

మందం ఉందని మా పొట్టగొడుతుర్రు..



- గజ్జల శంకరయ్య, చేనేత కార్మికుడు, గర్శకుర్తి

తయారైన బట్టలు అమ్ముతలేవని, మందం ఉందని మా పొట్టగొడుతుర్రు. చేసుకుంటే బతికెటోళ్లం. 3 నెల్లుగా మగ్గంపై బట్ట తయారు చేసుటానికి నూలు ఇత్తలేరు. తయారు చేసిన బట్ట తీసుకెళ్లక, పైసలియ్యక ఇబ్బంది పడుతున్నం. ప్రభుత్వం చర్యలు తీసుకుని మగ్గం బతుకులు బాగుపడే తట్టు చూడాలే.

జమ్మికుంట తహసీల్దార్ రజని ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు



నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రజని ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించడం సంచలనం రేకెత్తిస్తుంది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేసినట్టు తెలుస్తుంది. హనుమకొండలోని కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్న తహసీల్దార్ ఇంట్లో, ఆమె బంధువుల ఇండ్లలో ఏకకాలంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహించారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేసిన ఆమె ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంటలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు తహసీల్దార్ ఇంట్లో, ఆమె బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేసి సేకరించిన సమాచారం ఇలా ఉంది.

హన్మకొండలో రెండు అంతస్థుల బిల్డింగ్ ప్రభుత్వ లెక్కల ప్రకారం 3కోట్లా 50లక్షలు, 7ఎకరాల వ్యవసాయ భూమి, రెండు కార్లు, మూడు బైక్‌లు, 25లక్షలు బ్యాంకు బ్యాలెన్స్, కిలోన్నర బంగారం, ప్రయివేట్ విలువ ప్రకారం రూ.12కోట్లకు పైగా ఉండే అవకాశం ఉంది. కూతురుకు కోటి రూపాయలతో ఎంబీబీఎస్ సీటుకు, వరంగల్ చుట్టు పక్కల భూములు భారీగా కొనుగోలు చేసినట్టు గుర్తించారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలో ఎల్ఎండీ కాలనీ క్యాంపు కార్యాలయం (ప్రజాభవన్)లో కళ్యాణలక్ష్మి చెక్కులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం పంపిణీ చేశారు. శంకరపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో శంకరపట్నం తహసీల్దార్ అనుపమ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అరుణ పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



నవతెలంగాణ - జమ్మికుంట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో తమ కల నెరవేరిందని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొనగంటి మల్లయ్య అన్నారు. బుధవారం స్థానిక మోత్కులగూడెం చౌరస్తాలో మున్నూరు కాపు జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏబూసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణాసంచాలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పొన్నగంటి మల్లయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు పొన్నగంటి సంపత్, మున్నూరు కాపు జిల్లా నాయకుడు ఆకుల రాజేందర్ మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, పోరాటం చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యకు, మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్‌కు, సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొనుగంటి విజయలక్ష్మి, పొన్నగంటి సారంగం, నాయకులు పొనగంటి రవి కుమార్, ఆకుల నారాయణ, పొనగంటి శ్రీధర్, సతీష్, ఏబూసి ఓదెలు, రంజిత్, సంపత్, విష్ణు, మేడిపల్లి మొగిలి పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

-ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్

కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ - కరీంనగర్

హమాలీ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బుధవారం జిల్లా హమాలీ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ కార్మికులందరిని, అసంఘటిత రంగ కార్మికులను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి సమగ్ర చట్టం చేయాలన్నారు. హమాలీ కార్మికులందరికీ పెన్షన్, బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఐకేపీ కేంద్రాల్లో పని చేస్తున్న ప్రతి కార్మికునికి క్వింటాల్‌కు రూ.60ల చొప్పున జిల్లా వ్యాప్తంగా ఒకే పద్ధతిగా రేటు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే హమాలీలుగా పని చేస్తున్న కార్మికులకు రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇస్తూ వారికి ఐడీ కార్డులు మంజూరు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విశ్రాంతి భవనం మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం, ప్రాథమిక చికిత్స కేంద్రం ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీ కార్మికునికి రూ.5000లు ప్రతి నెలా పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కాసెట్టి లక్ష్మయ్య, గాండ్ల రమేష్, పిట్టల శ్రీనివాస్, జిల్లా హమాలీ ఫెడరేషన్ నాయకులు జక్కుల ఆగయ్య, పరుశరాములు, శ్రీనివాస్, నరసయ్య, ఓరుసు కొమురయ్య, రాజయ్య, అంజయ్య, ఎం.శంకరయ్య, రాములు, కే.ఎల్లయ్య, పెంచాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువకు వెంటనే నీరు వదలాలి

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - గంగాధర

వరద కాలువకు వెంటనే కాళేశ్వరం జలాలను వదిలి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. గంగాధర మధురానగర్ చౌరస్తాలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. పొట్ట దశకు చేరిన వరి పొలాలను కాపాడుకోవడానికి నీళ్ల కోసం రైతులు చేస్తున్న భగీరథ ప్రయత్నాలు ప్రభుత్వానికి, పాలకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జీవనదిగా ఉన్న వరద కాలువను కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు నీరివ్వక ఎండబెట్టాల్సిన అవసరం ఏంటని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ మీదనో, పార్టీ అధినేత కేసీఆర్ మీదో కోపం ఉంటే మీరు మీరు చూసుకోవాలే కాని, పంటలకు నీరివ్వక రైతులను కష్టపెట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ వస్తే బాగుపడతమని ప్రజలు, రైతులు ఓట్లేస్తే గెలిచిన పాలకులు రైతుల కళ్లలో కన్నీళ్లు తెప్పిస్తున్నరని, చేనేత, పవర్ లూమ్స్ కార్మికుల ఆత్మహత్యలు పునరావృతం అయ్యేలా చేస్తున్నరని ఆరోపించారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సత్వరం చర్యలు చేపట్టి వరద కాలువకు నీరు విడుదల చేయకపోతే రైతులతో కలిసి వరద కాలువ బ్రిడ్జిపై ధర్నా, రాస్తారోకో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, ఎంపీటీసీ ద్యావ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, సముద్రాల అజయ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు సామంతుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దోమకొండ మల్లయ్య, అబ్బాస్, తూం మల్లారెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధికంగా పోషకాలు

నవతెలంగాణ - మానకొండూర్

చిరుధాన్యాల్లో అధికంగా పోషకాలు ఉంటాయని కరీంనగర్ రూరల్ సీడీపీఓ సబితా అన్నారు. బుధవారం మండలంలోని గంగిపల్లి గ్రామంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పిల్లలకు పోషక విలువలు ఉండే ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. పిల్లలకు అన్న ప్రసాన, అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సిబ్బంది పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం పోషణ పక్వాడ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ రాజు నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిడిపిఓ సబిత

పీఎఫ్ డబ్బులు జమచేసి కార్మికులకు న్యాయం చేయాలి

రీజనల్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి


13 ఫోటో 3 : వినతిపత్రం అందిస్తున్న జనగాం రాజమల్లు

నవతెలంగాణ - కరీంనగర్

కార్మికుల పీఎఫ్ డబ్బులను వారి వ్యక్తిగత ఖాతాలో జమ చేయకుండా జాప్యం చేస్తున్నారని, విచారణ చేసి కార్మికులందరికి న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధ ఆదిలాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో పీఎఫ్ రీజినల్ కమిషనర్ తానయ్యకి వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగం రాజమల్లు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 540 మంది కార్మికుల పీఎఫ్ డబ్బులను వారి వ్యక్తిగత ఖాతాలో జమ చేయకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. ఇందులో సానిటేషన్, వాటర్ వర్క్స్, డ్రైవర్లు, హరితహారం, వివిధ విభాగాల కార్మికుల 16నెలల పీఎఫ్ డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ చేయకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, దీన్ని నిరసిస్తూ పీఎఫ్ రీజినల్ కమిషనర్‌ని కలిసినట్టు తెలిపారు. విచారణ చేసి కార్మికులందరికీ న్యాయం చేయాలన్నారు. అలాగే ఇప్పటికీ కొంతమంది కార్మికులకు పీఎఫ్ డబ్బులు కట్ చేస్తున్నప్పటికి డబ్బులను కార్మికుల పీఎఫ్ ఖాతాల్లో వేయడం లేదని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విచారణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం పీఎఫ్ రీజినల్ కమిషనర్ తానయ్య మాట్లాడుతూ.. ఈ విషయంలో ఎంక్వాయిరీ చేసి కార్మికులందరికీ న్యాయం చేస్తానని తెలిపారు. 11 సంవత్సరాలుగా కార్మికుల ఖాతాల నుంచి ఈఎస్ఐ డబ్బులు కట్ చేస్తున్నప్పటికీ వారికి ఇప్పటికీ ఈఎస్ఐ నెంబర్ అలాట్మెంట్ చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం పడుతుందన్నారు. ఈ విషయమై రాష్ట్ర ఈఎస్ఐ కార్పొరేషన్‌కి త్వరలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పీఎఫ్ కమిషనర్‌ని కలిసిన వారిలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, ఆదిలాబాద్ సీఐటీయూ అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, దర్శనాల మల్లేష్, ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, దర్శనాల నగేష్, జనార్దన్, ఆత్మరాం, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు సన్మానం


సన్మానిస్తున్న ఉద్యోగులు, నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్

టీఎన్జీవోల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై మొదటిసారిగా కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన మారం జగదీశ్వర్‌కి టీఎన్జీవోల కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం తెలిపి పూలమాల, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా ఉద్యోగులకు, నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ జిల్లా ఎంప్లాయి జేఏసీ చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మారం జగదీశ్వర్ తాలూకా స్థాయి నుంచి జిల్లా కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షుడిగా అంచెలంచెలుగా ఎదిగారని, టీఎన్జీవో సంఘానికి వారు చేసిన సేవలు శ్లాఘనీయమని గుర్తు చేశారు. టీఎన్జీవోల సంఘ భవనం ఎదురుగా బాణా సంచాలు, టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచుతూ సందడి చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, రాగి శ్రీనివాస్, కిరణ్ కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మీందర్‌సింగ్, మారుపాక రాజేష్ భరద్వాజ్, ఇరుమల శారద, సబిత, సునిత, విజయ లక్ష్మి, కోట రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి అధికారుల ఇండ్లల్లో సోదాలు చేయాలి'

నవతెలంగాణ - జమ్మికుంట


అవినీతికి పాల్పడుతున్న అధికారుల ఇండ్లల్లో సోదాలు చేస్తే వారి అవినీతి బయటకు వస్తుందని, సామాన్యులకు డబ్బులు లేకుండా పనులు అవుతాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో అమాయక రైతులు రిజిస్ట్రేషన్‌ల కోసం తహసీల్దార్ల వద్దకు పోతే పట్టాదారు పాస్ బుక్‌కు, ఆధార్ కార్డ్‌కు ఒక అక్షరం తేడా ఉన్నా వేలాది రూపాయలు డిమాండ్ చేస్తూ, డబ్బులు ఇస్తేనే రిజిస్ట్రేషన్ అయితది లేకపోతే కాదు అనే రీతిలో డబ్బే ప్రధానంగా భావించి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. ఈ అవినీతి అధికారులు లంచాలు తీసుకుంటే వణుకు పుట్టే విధంగా ఏసీబీ అధికారుల దాడులు నిర్వహించాలని కోరారు. జమ్మికుంట తహసీల్దార్ రజనీ ఇంట్లో ఏసీబీ సోదాలు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రంలో అవినీతి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ అధికారులను గుర్తించి వారి ఇండ్లు, వారి బంధువుల ఇండ్లపై కూడా దాడులు చేయాలని, ఎలాంటి నాయకుల ఒత్తిళ్లకు బెదిరకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాగంపేటలో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ - చొప్పదండి

మండలంలోని రాగంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం పద్మపాణి సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో గ్రామానికి చెందిన ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ ఆదాన్, మెడికల్ ఆఫీసర్, పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, పద్మ పాణి సూపర్వైజర్ లక్ష్మి రాజం, అనూజ,శ్యామల, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్లు స్నేహ, శారదా, లలిత పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జి ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా కలికోట భాస్కరాచారి, సుమలత పెండ్లిరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ టవర్ ప్రభుత్వ ఆస్పత్రి మాతా శిశు ప్రాంగణంలో 200మందికిపైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో కలికోట భాస్కరాచారి, శ్రీనివాసాచార్యులు, వెంకట రమణారెడ్డి, రావికంటి కృష్ణ, కిషోర్‌చ గుండె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కలను చెరిపేస్తున్న కాంగ్రెస్

నవతెలంగాణ-మంథని:రూపాయి రూపాయి కూడబెట్టి అనేక కష్టాలతో ఇళ్లు నిర్మించుకునే పేదోడి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం చెరిపేస్తుందని బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లికుమార్ అన్నారు. బుధవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంథని పట్టణంలోని పలువురి ఇంటి నిర్మాణాలను మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చివేయడం బాధాకరమన్నారు. మూడేళ్ల క్రితం పాలకవర్గం, అధికారుల అనుమతులతో ఇంటి నిర్మాణాలు చేసుకున్నారని, ఆనాడు తప్పు కానిది ఈనాడు ఎలా అక్రమ నిర్మాణాలు అవుతాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మార్పు వస్తుందని ప్రచారం చేశారని, మార్పు అంటే పేదోడి ఇండ్లను కూల్చివేయడమేనా అని ప్రశ్నించారు. కోర్టు అదేశాల మేరకు కూల్చి వేస్తున్నామని అధికారులు చెబుతున్నారని,అసలు కోర్టులో కేసు వేసిన వ్యక్తి ఎవరని, ఇంటి యజమానికి పక్కోడు, పాలోడు కాదని ఆయన అన్నారు.ఈ ప్రాంతానికి నాయకత్వం వహిస్తున్న నాయకుడి కార్యకర్త ఇలా పేదోళ్ల ఇండ్లను కూల్చి వేయిస్తున్న తీరును పాలకులు తప్పు పట్టరా అని ఆయన అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క పేదోడి ఇంటి జోలికి వెళ్లలేదన్నారు. కౌన్సిలర్‌లు గర్రెపల్లి సత్యం,కాయితి సమ్మయ్య, నాయకులు మంథని లక్ష్మణ్,వేల్పులగట్టయ్య,సుల్తాన్ ఆసిఫ్‌ఖాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

నవతెలంగాణ-మేడిపల్లి

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలుపడం పట్ల రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు కొప్పెర లింగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన పేదలకు భరోసా ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ భీమారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, ఎస్ ఎన్‌రెడ్డి, అన్నాడి జలపతి రెడ్డి, డిష్ రాజారెడ్డి, నోముల నరసింహారెడ్డి, కాటిపల్లి దశరథ రెడ్డి, సురకంటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-బుగ్గారం

మండలంలోని గోపులాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ ప్రారంభించారు. అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు గోవిందుల రమణ, మండల యూత్ ప్రెసిడెంట్ బిర్సార్ తిరుపతి, కండ్లే మదన్, రాజేశ్వర్ రెడ్డి, గైని శ్రీను, గైని రమేష్, ఐలయ్య, శేఖర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, లచ్చన్న కొమ్మినేని తిరుపతి,గోవిందుల నారాయణ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నవతెలంగాణ-సుల్తానాబాద్



పరిశీలిస్తున్న కౌన్సిలర్

పట్టణంలోని సుగులంపల్లెలో నీటి ఎద్దడి నివారణకు కౌన్సిలర్ పసిడ్ల మమత సంపత్ చర్యలు చేపట్టారు. పాత గ్రామపంచాయతీ భవనం వద్దనున్న బోర్వెల్ నుండి నీటి సరఫరా చేయడానికి నూతన పైపు లైను ఏర్పాటుకు పరిశీలన చేశారు. వేసవిలో తాగునీటి కొరత లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని మమత సంపత్ తెలిపారు. కౌన్సిలర్ వెంట పాపని సురేశ్, చెట్టి రవి, అదిచేర్ల రాయమల్లు, జనగామ శేంకర్, అదిచెర్ల సదయ్య ఉన్నారు.

పలు వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-సుల్తానాబాద్

సుల్తానాబాద్ మున్సిపల్‌లోని పూసాల రోడ్డు చౌరస్తా వద్ద పద్మపాని సొసైటీ ఆధ్వర్యంలో క్రాంతి కళాబృందం కళాకారులు హెచ్ఐవి, క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు పద్మపాని సొసైటీ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ లోకిని రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్రాంతి కళాబృందం కళాకారులు వెంకటాచారి, నల్ల ఆంజనేయులు, మాధవి ప్రకాష్, పద్మపాని సొసైటీ లింక్ వర్కర్లు శ్రీలత, సంపత్ పాల్గొన్నారు.

జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయి గుర్తింపు

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ గుర్తింపు వచ్చింది. గత ఏడాది డిసెంబర్ 29 ,30 తేదీల్లో నేషనల్ క్వాలిటీ టీం మెంబర్ జూలపల్లిని సందర్శించి ఇక్కడ ఉన్న రిజిస్టర్‌లను, ఇక్కడ అందు తున్న సర్వీసులను , వైద్య సిబ్బంది స్కిల్స్, అడ్మినిస్ట్రేషన్ వివిధ డిపార్ట్మెంట్లలో అందుతున్న సేవలను పరిశీలించి ఎన్‌హెచ్ఎస్ఆర్‌సి ఇండియాకి పంపిం చారు. బుధవారం ఎన్‌క్యూ ఏఎస్ విడుదల చేసిన ర్యాంక్‌లో జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థానం దక్కింది. సిబ్బంది, వైద్యుల సమిష్టి కృషితోనే గుర్తింపు వచ్చిందని డాక్టర్ సంపత్‌రెడ్డి తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్సికోత్సవం

నవతెలంగాణ-కోరుట్ల



పూజలు చేస్తున్న నాయకులు

మండలంలోని అయిలాపూర్ గ్రామంలో బుధవారం రేణుక ఎల్లమ్మ ఆలయ 21 వార్సికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం చేసి పంచపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పొడేటి ప్రసాద్, దీకొండ రాజనర్సయ్య, బొల్లపెల్లి శ్రీనివాస్, నారాయణగౌడ్, రాజేందర్, చంద్రమౌళి, సురేష్, రాజలింగం, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నదానం

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని 22వార్డు కౌన్సిలర్ మాడవేని నరేష్ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష పరులకు గురువారం నుంచి 41 రోజులు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నిముషాలకు అన్నదానం మొదలవుతుందని హనుమాన్ దీక్ష తీసుకున్న ప్రతి వ్యక్తి అన్నదానంతో పాల్గొనాలని కోరారు.

మండలంలో జిల్లా పంచాయతీ అధికారి సందర్శన

నవతెలంగాణ-ఓదెల



సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత

ఓదెల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పంచాయతీ అధికారి ఆశాలత బుధవారం సందర్శించారు. కొమిరె, లంబాడితండా గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్, శ్మశాన వాటికలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అబ్దుల్ వాజిద్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ -మెట్ పల్లి

గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ క్యాబినేట్ నిర్ణయం తీసుకోవడం పట్ల మెట్ పల్లి మత్స్య పారిశ్రామిక జిల్లా కార్యవర్గ సభ్యులు మత్స్య పారిశ్రామిక పట్టణ అధ్యక్షుడు పర్రె శంకర్ హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-బుగ్గారం



చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

బుగ్గారం మండల కేంద్రంలో 80 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో 4 ఇప్పటికే అమలు చేశామని, మరో రెండు అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదినేని రాజమణి-రాజేందర్, తహసీల్దార్ మాజీద్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వేముల సుభాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్ పాల్గొన్నారు.

కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలి

సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఎరవెల్లి మ్యతంరావు

నవతెలంగాణ-సుల్తానాబాద్



వినతి ప్రతం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రైస్ మిల్లు కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా వేతనం నిర్ణయించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు సిఐటియు ఆధ్వర్యంలో రైస్ మిల్లు ఆపరేటర్లు కలిసి ఎమ్మెల్యే నివాసంలో విన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ.. రైస్ మిల్ పరిశ్రమలో పని చేస్తున్న ఆపరేటర్స్, గుమస్తాలు, లేబర్ కార్మికుల వేతనాలు గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా పెంచకుండా నిర్లక్ష్యం చేసిందని, అందుకే ఆ ప్రభుత్వాన్ని కార్మిక వర్గం ఓడించడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి 29న వేతనాలు సారిస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ నెంబర్ 86 ఇచ్చిందని, ఇందులో ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు కేవలం 268 రూపాయలు మాత్రమే పెంచారని అంటే రోజుకు 10 రూపాయల వేతనం కూడా పెంచకపోవడం అన్యాయమని అన్నారు. పది సంవత్సరాల నుండి నిత్యవసర సరుకుల, వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, పెరిగిన ధరలను బేరేజ్ వేసుకుంటే నెలకు కనీస వేతనం రూ.26వేలు ఉంటే తప్ప కార్మికుల కుటుంబాలు బతకలేవని, రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలు రాష్ట్ర ముఖ్యమంత్రికి, కార్మిక శాఖ అధికారులకు విన్నవించారని, కానీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా కంటి తుడుపు చర్యగా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సవరించి, నెలకు 26,000 కనీస వేతనం ఇచ్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రైస్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోరైస్ మిల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు తాండ్ర అంజయ్య, రైస్ మిల్ గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, పూసాల సంపత్, హరికిషన్, జాకీర్, బండారి స్వామి, ప్రసాద్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

లోక్ సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

నవతెలంగాణ-మంథని :



ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ

మంథని నియోజకవర్గ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీ నేతలతో బుధవారం మంథని ఆర్డీవో కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డిఓ హనుమ నాయక్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, తెలంగాణ ఆదేశాల మేరకు రానున్న లోక్ సభ ఎన్నికల కోసం మంథని నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల కోసం మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని తహసిల్దార్లను ఆదేశించారు.మంథని నియోజకవర్గంలో ఎలక్షన్ ఖర్చుల వివరాలను పర్యవేక్షించడానికి, జిల్లా ఎన్నికల అధికారి, పెద్దపల్లి ద్వారా 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలను, చెక్ పోస్టుల వద్ద 24 గంటలు పర్యవేక్షించే విధంగా (3) స్టాటిక్ సర్వేలన్స్ టీంలను, వీడియో వీవింగ్ టీం, వీడియో సర్విలన్స్ టీం, ప్రతీ మండలానికి ఒక మాడల్ కోడ్ అఫ్ కండక్ట్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ స్టేషన్ల పర్యవేక్షన కోసం 37మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేయాలని,ప్రతీ బి.ఎల్.ఓ ద్వారా ఓటరు లిస్టులో అర్హులైన ప్రతీ పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలని తెలిపారు.8 ఫిబ్రవరి 2024 నాటికి తుది ఓటర్ల జాబితా ప్రకారం మంథని నియోజకవర్గములో మొత్తం ఓటర్లు 2,39,108ఉండగా,ఇందులో మహిళలు 1,21,820 పురుషులు :1,17,271,ట్రాన్స్ జెండర్ 17 మంది ఓటర్లుగా నమోదు అయినట్లుగా ఆయన తెలిపారు. అంతేకాకుండా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల కోసం ఎలక్షన్ కమీషన్ ద్వారా సూచించిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉండే విధంగా ప్రతీ తహసిల్దారు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోలేరమ్మ ఆలయంలో స్వర్ణకారుల పూజలు

నవతెలంగాణ -మెట్‌పల్లి



పూజలు నిర్వహిస్తున్న స్వర్ణకారులు

మెట్‌పల్లి పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో స్వర్ణకార సంఘ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణం అనంతరం సంఘ సభ్యులందరం పోలేరమ్మకు పూజలు నిర్వహించడం అనవయితీగా వస్తుందని స్వర్ణకార సంఘ అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి తెలిపారు. ఈ కార్యాక్రమంలో సంఘ సభ్యులు, స్వర్ణకార కుటుంబాలు పాల్గొన్నాయి.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -మెట్ పల్లి



ప్యాడ్స్ అందిస్తున్న పుల్ల జగన్

మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుల్ల జగన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె పేరు మీద పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు డాకూరి వెంకటేష్, బద్దం రాజేష్, బొల్లె గంగ నర్సయ్య, బొల్లె సాగర్, అధ్యాపకుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ల తనిఖీ

నవతెలంగాణ -మెట్ పల్లి



తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి పట్టణంలో నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై బుధవారం మున్సిపాలిటీ సానిటరీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఐఎస్ఐ నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్స్ నిర్వహిం చాలన్నారు. లైసెన్స్ లేకుండా వాటర్ ప్లాంట్ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మెట్ పల్లి పట్టణంలో ఒకే ఒక్క వాటర్ ప్లాంట్‌కి ఐఎస్ఐ సర్టిఫికెట్ ఉందని మిగిలిన వారు వెంటనే నిబంధనల ప్రకారం ఐఎస్ఐ సర్టిఫికెట్, లైసెన్సు తీసుకోవాలన్నారు.లేనిచో మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్లాంట్ క్లోజ్ చేయడమే కాకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ఇన్‌చార్జి సారిటరి ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, ముజీబ్, నాయక్, నిజాం, పాల్గొన్నారు.

అనుమతులున్నా.. అక్రమంగా కూల్చారు

నవతెలంగాణ-మంథని



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇంటి నిర్మాణానికి అన్ని అనుమతులున్నా.. అక్రమంగా మున్సిపల్ అధికారులు కూల్చివేశారని వ్యాపారి వొల్లాల సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట మున్సిపల్ అనుమతులతో బిల్డింగ్ నిర్మాణం చేశానని, ఆ సమయంలో రెండు అంతస్తులకు పర్మిషన్ తీసుకోవడం జరిగిందన్నారు. మూడో అంతస్తుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఇంకా అనుమతులు ఇవ్వలేదన్నారు. అయితే బిల్డింగ్ నిర్మాణం పూర్తయిన మూడేళ్ల తర్వాత అనుమతులు లేవంటూ, నోటీసులు ఇచ్చామంటూ మున్సిపల్ అధికారులు వచ్చి బిల్డింగ్‌ను ధ్వంసం చేశాని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డింగ్ నిర్మాణ సమయంలో ఆర్అండ్‌బీ అధికారుల ఆదేశాల మేరకు సెట్ బ్యాక్‌తో నిర్మాణం చేశామని తెలిపారు. బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు తన వద్ద ఉన్నాయని, అయినా అధికారులు తనకు అన్యాయం చేశారని వాపోయారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

యాదవ,కుర్మ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ-మంథని

యాదవ, కుర్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల యాదవ సంఘం నాయకులు మాదరబోయిన కిషన్ హర్షం వ్యక్తం చేశారు. యాదవ, కుర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల వెనకబడిన యాదవ కుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందు తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబుకు యాదవ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

నవతెలంగాణ-సుల్తానాబాద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బీసీ సమాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ముద్రించిన మొల్ల మాంబ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి రాష్ట్రం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు నల్లవెల్లి ప్రభాకర్ , ప్రధాన కార్యదర్శి టి.కె. రమేష్, కుమ్మర సంఘం నాయకులు టి.కే. సత్యనారాయణ, టి.కే .సాయిలు, టి.కే లచ్చయ్య నాంపల్లి రవీందర్, నాంపల్లి విజయ్‌కుమార్, విజ్జగిరి సంజువ్,టి కే. అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల కేంద్రం,వేములకుర్తి గ్రామాల్లో తెలుగు తొలి మహిళ కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను కుమ్మరి సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం రాధరపు దేవదాస్, నాంపల్లి రమేష్,రాధరపు ప్రభాకర్,అన్నరపు రాజరెడ్డి, రాధరపు ప్రకాష్, మారుపాక రమేష్, రాధరపు లింగం, ప్రవిణ్ పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



జీరో బిల్లును అందజేస్తున్న నాయకులు

ఇబ్రహింపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా జీరో బిల్లు కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ జీరో బిల్లు సద్వినియోగం చేసుకోవాలని, ఎవరికైనా సాంకేతిక లోపంతో జీరో బిల్లు రాకపోతే తమ దృష్టికి తెస్తె సంబంధిత అధికారులతో మాట్లాడి వర్తించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌లైన్ మెన్ కోళిపాక రాజు, మీటర్ రిడింగ్ సిబ్బంది కిషోర్, కాంగ్రెస్ పార్టీ మండల సేవదల్ అధ్యక్షుడు నాంపెల్లి వెంకటాద్రి, నాయకులు గుమ్మల రమేష్, బుర్రి ముత్యం, గుమ్మల నరేష్,బస సోమన్నతరి రామనుజం,మాట్ల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా యూత్ అధ్యక్షుడిగా రాజశేఖర్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అయిలబోయిన రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన రెబ్బటి రాజశేఖర్ యాదవ్ ను జగిత్యాల జిల్లా యూత్ అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పలువురు సన్మానించారు. మద్దతు తెలిపి ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన రాష్ట్ర కార్యవర్గానికి జగిత్యాల జిల్లా అధ్యక్షులు పలుమార్ మల్లేష్ యాదవ్‌కు మండల అధ్యక్షులకు రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బినావేని ముఖేష్ యాదవ్, బండ మల్లేష్ యాదవ్, నాగరాజ్ యాదవ్, నర్సయ్య యాదవులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా సాధికారిత కోఆర్డినేటర్ డాక్టర్ దయా అరుణ

నవతెలంగాణ-మంథని



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సాధికారిత కోఆర్డినేటర్ డాక్టర్ దయా అరుణ అన్నారు. బుధవారం జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మంథని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా సాధికారిత కోఆర్డినేటర్ డాక్టర్ దయా అరుణ మాట్లాడుతూ.. బాలికల ఉన్నత విద్య, చైల్డ్ మ్యారేజెస్,టోల్ ఫ్రీ నెంబర్స్ మొదలైన వాటిపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత, మంథని ఎస్సై వెంకట కృష్ణ, షీటీమ్, ఎస్సైరాజేంద్రప్రసాద్, డాక్టర్ శివాని, ఆశావర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం

టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల కులవృత్తులకు ఆర్థికంగా అండగా నిలవడం కోసం 16 కార్పొరేషన్లు, ఈ బీసీల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డ్, ఆర్యవైశ్య కార్పొరేషన్, రెడ్డి కార్పొరేషన్, మాదిగ ఉప కులాల ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు మూడు ప్రత్యేక కొమురం భీం ఆదివాసీ, సంత్ సేవాలాల్ లంబాడీ, ఏకలవ్య కార్పొరేషన్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయం అని టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిల చిత్ర పటాలకు టీ బీసీ జేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ప్రతినిధులు పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి విజయ్, ఉపాధ్యక్షుడు సింగం భాస్కర్, ఆకునూరి శంకరయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండ లక్ష్మణ్, ములస్తం శివ ప్రసాద్, మున్నూరు కాపు సంఘ మహిళా కార్యదర్శి గంగం జలజ, టీ బీసీ జేఏసి ప్రతినిధులు పాల్గొన్నారు.

సజ్జ పంటలలో సస్యరక్షణ చర్యలు

వ్యవసాయ అధికారి దీపిక

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

సజ్జ పంటల సస్యరక్షణపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ గ్రామంలో సజ్జ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి దీపిక మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిస్థితుల్లో సజ్జ పంట సుమారు 15-20 రోజులలో మోగి పురుగు కత్తెర పురుగు సజ్జ పంటకు విస్తృతంగా వ్యాపిస్తుందన్నారు. వీటి నివారణకు ఇమా మోక్షన్ బెంజ్మిటట్ మూడు గ్రాములు ఒక లీటర్ నీటికి. వేప నూనె ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కత్తెర పురుగు తీవ్రంగా ఉన్నట్లయితే క్లోరంతా నీలిపోల్స్ 60 మిల్లీలీటర్ ఒక ఎకరాకు స్పిన టోరం 100 మిల్లీలీటర్ ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఏఈఓ ప్రవళిక రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలో 8 మంది విద్యార్థులు డిబార్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులకు జరిగిన రసాయన శాస్త్రం, వాణిజ్య శాస్త్రం పరీక్షలో 6144 మంది విద్యార్థులకు 5966 మంది హాజరు కాగా 178 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 664 విద్యార్థులకు గాను 576 మంది విద్యార్థులు హాజరు, 88 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 96.09 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనారు. బుధవారం ఇంటర్ బోర్డ్ స్పెషల్ అబ్జర్వర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ, పరీక్షల కన్వీనర్ కలిసి మొత్తం 21 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. స్టేట్ అబ్జర్వర్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కొడిమ్యాలలో ఒకరిని, ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్యాల కేంద్రంలో ఐదుగురిని, శ్రీ వైష్ణవి ఒకేషనల్ జూనియర్ కళాశాల జగిత్యాల పరీక్షా కేంద్రంలో ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టిస్ కేసులు బుక్ చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8:45 నిమిషముల కంటే ముందుగానే చేరుకుని వారికి కేటాయించిన సీట్లో కూర్చోవాలని పరీక్షల కన్వీనర్ బి.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం

నవతెలంగాణ జూలపల్లి /ఎలిగేడు



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

40 సంవత్సరాలుగా గత పాలకులు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి తప్పుకున్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలకే ఆర్యవైశ్య ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు ఎల్లంకి రాజేశం, తాటిపల్లి సతీష్ బాబు, సింగిల్ విండో డైరెక్టర్ తాటి పెల్లి రమేష్ బాబు, భరోసా స్వచ్చంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

మంథని::మంథని పట్టణంలోని గాంధీచౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్ర పటాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు.ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం రాష్ట్ర నాయకుడు నల్మాచు ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎల్లంకి వంశీ,ఓల్లాల సత్యనారాయణ, కొమురవెల్లి విజయ్ కుమార్,రేపాల నాగన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహింపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో యునిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో బుధవారం ప్రాథమికోన్నత పాఠశాలలో 2 నుంచి 4వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మాలేపు శ్రీనివాస్, శక్తి కేంద్రల ఇన్‌చార్జిలు కోటగిరి వెంకటస్వామి, దోనికెన మహేందర్, పొన్నం గణేష్, సున్నం రాజేష్ ఉపాధ్యాయులు నవిన్ పాల్గొన్నారు.

కోరుట్ల: మండలంలోని యూసుఫ్‌నగర్, మాదాపూర్, జోగిన్‌పల్లి, అయిలాపూర్, చిన్నమెటుపల్లి, సర్పరాజ్‌పూర్ గ్రామాలలో 1నుండి 5వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రస్తుత మాజీ సర్పంచ్ స్కూల్ బ్యాగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎంపి అరవింద్ చిన్నపిల్లలంటే ఇష్టంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు అందజేశారని తెలిపారు.

కాల్వల పరిశీలన

నవతెలంగాణ-మంథని



పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి

కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్ లోని కాల్వలను పెద్దపల్లి జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. గుండారం రిజర్వాయర్‌లోని కాల్వ డి-83లోని 29ఎల్,30 ఎల్,31ఎల్ సాగు కాలువలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశ, గింజ పాలు పోసుకునే దశను ఉన్నందున, ప్రస్తుతం ఎస్సారెస్పీ ద్వారా డి-83 విడుదల చేస్తున్న 6వ తడి నీటిని సమర్థవంతంగా, సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఏఈలు వెల్దండి ప్రసాద్,పాక రమేష్ ఉన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



అల్పాహారం అందజేస్తున్న ఫోరమ్ అధ్యక్షులు

ప్రభుత్వం విద్యార్థులకు ప్రవేశపెట్టిన అల్పాహారంను విద్యార్థులు భుజించాలని ఇబ్రహీంపట్నం ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోనకంటి వెంకట్ అన్నారు. మండలంలోని వర్షకొండ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని అందజేశారు. ఈ కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం శ్రీదేవి, కృష్ణం రాజు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి

- పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ
- నేడు 24 గంటల నిరాహార దీక్షకు పిలుపు


కోడం రమణ

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :
వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభాన్ని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు.కొన్ని రోజుల నుండి వస్త్ర పరిశ్రమ బంధుతో పవర్లూమ్ కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు లేక ఉపాధి పోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాలు సీఐటీయూ ఆధ్వర్యంలో 24గంటల నిరాహార దీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరాహార దీక్షలో పవర్లూమ్ కార్మికులు, వార్పిన్, వైపని కార్మికులు, ఆసాములు, గుమాస్తాలు, జాపర్లు, వస్త్ర పరిశ్రమ అనుబంధ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓపెన్ జిమ్, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న జడ్పిటిసి కాంగ్రెస్ నాయకులు.

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని పోతుగల్ గ్రామంలో స్పెషల్ డెవలప్మెంట్ కింద రూ.10లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పెద్దమ్మల కాలనీలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, యువకులు పెద్దలు ఆరోగ్యంగా ఉండడానికి రూ.3లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మాణానికి, రెండు హైమాస్ లైట్ల నిర్మాణానికి జెడ్పీటీసీ గుండం నరసయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. అనంతరం తెర్లు మద్ది గ్రామంలో రూ.3లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండం నరసయ్య, జిల్లా కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, ముస్తాబాద్ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, ముస్తాబాద్ పట్టణశాఖ అధ్యక్షులు గజ్జలరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజన్ రావ్, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కలకొండ కిషన్‌రావు, జిల్లా నాయకులు కొండం రాజి రెడ్డి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నర్సింలు, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి పాలాభిషేకం


పాలాభిషేకం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు రెడ్డి సంఘం నాయకులు.

నవతెలంగాణ - ముస్తాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకుగాను ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూర సంతోష్, మండల అధ్యక్షులు పడమటింటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులంతా కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైశ్యులలో కూడా చాలా పేద కుటుంబాలు ఉన్నాయని ప్రభుత్వం వారికి ఇందిరమ్మ ఇండ్లతోపాటు వారి పిల్లలకు కార్పొరేట్ విద్యా వైద్య సదుపాయాలను కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు గందెచంద్రం, పట్టణ అధ్యక్షులు కూర బిక్షపతి, యువసేన అధ్యక్షులు మొరం శెట్టి అమర్, గోపిశెట్టి సంతోష్, బొందుగుల రాజు శ్రీనివాస్, పప్పుల శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, గంప సుధాకర్, చేపూరి శ్రీనివాస్, రాధాకృష్ణ, గంపకృష్ణమూర్తి, గంపరవీందర్, కూరనగేష్, కాసన కొట్టు అంజయ్య, ఉప్పల చంద్రం, కృష్ణమూర్తి, రాజూరి రాజేశం పాల్గొన్నారు.

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని ప్రకటించడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ముదిరాజ్ సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల ముదిరాజ్ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కీసరి నాగరాజ్, జిల్లా కోర్ కమిటీ సభ్యులు చొక్కాల రాము బొజ్జ కనకయ్య రేగుల మల్లికార్జున్, చొప్పరి రామచంద్రం, రాణవేణి లక్ష్మణ్, గొడుగు నరసయ్య ఉత్తమ అంజయ్య, జజ్జరి నాగరాజ్ పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్ సంక్షేమ సంఘం సభ్యులు

మూగ జీవాలకు టీకాలు

నవతెలంగాణ - బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని మరలపేట గ్రామానికి గ్రామంలో మూగజీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశు వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రైతులు తమ ఎద్దులకు బర్రెలకు ఎలాంటి వ్యాధులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. చుట్టుపక్క రైతులు కూడా మూగజీవాలకు టీకాలు వేపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ - బోయినపల్లి : మండల కేంద్రంలో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి 10వ తరగతి పరీక్ష ఫలితాలలో జిల్లా స్థాయిలో టాప్ వన్ ర్యాంకు సాధించాలని విద్యార్థులను కోరారు. పరీక్ష రాసి సమయంలో వారికి సమస్య ఉన్న తమ దష్టికి తీసుకువస్తే ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడ్ మానేరు నుంచి నీటి విడుదల

నవతెలంగాణ - బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని మాన్వాడ గ్రామం వద్ద నిర్మించిన మిడ్ మానేరు జలాశయం నుండి దిగువ మానేరుకు 10గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి జగన్ మాట్లాడుతూ.. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రైతుల అవసరాలకు మిడ్ మానేరు జలాశయంలో 11. 37 టీఎంసీ నీరు నిలువ ఉండగా, ఎల్ఎండీ జలాశయానికి 3500క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని జగన్ తెలిపారు.

అంబేద్కర్ సంఘ భవన నిర్మాణ భూమి పూజ..

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ అంబేద్కర్ కాలనీలో ఆదర్శ అంబేద్కర్ సంఘా భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక భవనాలు చర్చ వేదికలుగా, సమస్యలు పరిష్కరించుకోవడానికి వేదికలుగా, ఆత్మ గౌరవ ప్రతి కలగా నిలుస్తాయన్నారు. వేములవాడ పట్టణ పరిధిలో ఇప్పటివరకు సుమారుగా 33కుల సంఘాలకు సామాజిక భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం రాబోవు రోజుల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ వర్గాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. నేటి కమ్యూనిటీ హాల్ భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు సంఘ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిలో ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, గుర్రం అశోక్, చంటి అంజిబాబు, తిరుపతి తోపాటు కుల సంఘం నాయకులతోపాటు తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్‌తో కలిసి భూమి పూజ నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ ఆదరించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్‌లో చేరిన కొండాపూర్ వెంకట్రావుపేట ఎంపీటీసీ పల్లె మంజుల
- పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - వేములవాడ :
పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. బుధవారం వేములవాడ పట్టణంలోని తన నివాసంలో కొనరావుపేట మండలం కొండాపూర్ వెంకట్రావుపేట ఎంపీటీసీ పల్లె మంజుల - రవీందర్ రెడ్డి, వెంకట్రావుపేట బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు చెరుకుపల్లి నరసింహారెడ్డి, మాజీ వార్డు సభ్యులు చెరుకుపల్లి సుజాత- భీమ్ రెడ్డి లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ప్రభుత్వ విప్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరిన పల్లె మంజుల రవీందర్ రెడ్డి లను సాధారణంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల్లో ఉన్న 16కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఒక చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని తీసుకుందన్నారు. వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రివర్గ సభ్యులకు మంగళవారం రోజున స్వయాన కలిసి ఒక బలహీన వర్గాల బిడ్డగా ఒక బీసీ బిడ్డగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలు,500 కే సిలిండర్, గహా జ్యోతి కింద 200 వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు ఇలాంటి పేద ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలని చూసి ఓర్వలేకే, అధికారం కోల్పోయిన బాధలో బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్న తీరును ప్రజలు గమనించాలనీ రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. మతాన్ని, సిబిఐ, ఈడిని నమ్ముకొని వస్తున్న, బిజెపి పార్టీ ఒకవైపు ఉంటే, మరోవైపు టిఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకొని తెలంగాణ పదాన్ని పక్కన పెట్టి తెలంగాణ ప్రజల నుండి పేగుబంధాన్ని తెంపుకున్న బీఆర్ఎస్‌ను పక్కన పెట్టాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పేద, బడుగు, బలహీన వర్గాలకు, రైతు వర్గాలకు మేలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీనీ ఆదరించాలని ప్రజలకు, యువకులకు, మేధావులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ జిల్లా కార్యదర్శి నాలుక సత్యం, యూత్ అధ్యక్షులు నాలుక వేణు, శ్రీకాంత్, మల్లయ్య ఉన్నారు.


ఎంపీటీసీ దంపతులను పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆది..

రెడ్డి బిడ్డల అభ్యున్నతికి రెడ్డి కార్పొరేషన్

నవతెలంగాణ - సిరిసిల్ల :
రెడ్డి బిడ్డల అభ్యున్నతికి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తున్నామని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కూర అంజిరెడ్డి అన్నారు సిరిసిల్లలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఆనాడు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన రేవంత్ రెడ్డి మూడు నెలల్లోనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు వారి మంత్రివర్గ బృందానికి కూడా ప్రత్యేక ఉద్యమ అభినందనలు తెలిపారు. రెడ్లకు కార్పొరేషన్ ఏంటి? రిజర్వేషన్లు ఏంటి? అంటూ వెటకారంగా మాట్లాడిన రోజు నుండి రెడ్లలో కూడా పేదలు ఉన్నారు అని గుర్తించిన సంబంధ రెడ్డి బిడ్డలు అవి సాధించే రోజు వరకు పలు రకాలుగా కార్యక్రమాలు నిర్వహించి పేద రెడ్ల పక్షాన చేసిన నిరంతర పోరాటాల ఫలితమే ప్రస్తుత రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు బీజాలు పడ్డాయన్నారు. వేలాదిమంది రెడ్డి ప్రతినిధులు అరెస్టులు, కేసులు ఇబ్బందులు నిర్బంధాలు ఎదుర్కొనగా 2019లో అగ్రవర్ణ పేదలకు పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఏర్పాటు కావడానికి, నేడు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం కావడానికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యమంలో పాల్గొన్న రెడ్డి ప్రతినిధులకు, రెడ్డి బంధువులకు జిల్లా సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాబోయే కాలంలో రెడ్ల హక్కుల సాధనలో మిగతా సమస్యలను పరిష్కారంలో అందరి సహకారంతో సాధించుకుందాం అని కూర అంజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి అధ్యక్షులు కనిమెని చక్రధర్ రెడ్డి, నేవూరి వెంకట్ రెడ్డి, మద్దూరి రాము రెడ్డి, ఎడుమల భూపాల్ రెడ్డి, ఎడుమల హన్మంత రెడ్డి, కనిమేనీ శ్రీనివాస్ రెడ్డి, ఎగుమమిడి కష్టా రెడ్డి, బానపురం రంగారెడ్డి, బొందుగుల దేవి రెడ్డి, నల్ల నాగి రెడ్డి,బిచ్చాల ,రాజి రెడ్డి, కుంబాల మల్లా రెడ్డి, గూడ విజయ్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, సంజీవ రెడ్డి, తిరుపతి రెడ్డి, పన్నా రెడ్డి, చల్ల రవిందర్ రెడ్డి, లక్ష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కూర అంజిరెడ్డి

బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించాలి

- పవర్లూమ్ కార్మికులను ఆదుకోవాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి
- ఆత్మహత్యకి పాల్పడ్డ కార్మికుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :
బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించి, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న పవర్లూమ్ కార్మికుడి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేలు సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభంతో గత కొన్ని రోజుల నుండి పవర్లూమ్ కార్మికులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీవై నగర్‌కు చెందిన తడుక శ్రీనివాస్ అనే పవర్లూమ్ కార్మికుడు ఉపాధి కోల్పోయి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. గతంలో మాదిరిగా ఆకలి చావులు, ఆత్మహత్యలు జరగకుండా పవర్ లూం పరిశ్రమ, చేనేత కార్మిక సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. వెంటనే చేనేత కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని, బతుకమ్మ చీరల, రంగు, రసాయనాలు బకాయిలు చెల్లించి, వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఆదుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వస్త్ర పరిశ్రమకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ ఇచ్చారని పేర్కొన్నారు. కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం దీనిని ఎత్తివేసే ప్రయత్నాలు చేసిందని అందుకు నిదర్శనమే ప్రస్తుత విద్యుత్ సంక్షోభానికి కారణమన్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డ మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయనతోపాటు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కార్యవర్గ సభ్యులు పంతం రవి, కడారి రాములు, కౌన్సిల్ సభ్యులు అజ్జ వేణు, మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు, రాజు, నల్ల చంద్రమౌళి ఉన్నారు.


పరామర్శిస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

నవతెలంగాణ - వీర్నపల్లి : రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో ఈ నెల 8న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు మూడు రోజులలో చెందించారు. మహిళను అత్యంత కిరాతకంగా గొంతు కోసం హత్య చేసిన దుండగులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ వెల్లడించారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 8న శివరాత్రి మల్లవ్వ(44) అనే మహిళను వరుసకు మైనల్లుడైన రవీందర్, తన స్నేహితులు భూక్య మహేష్‌లు సిరిసిల్ల లేబర్ అడ్డాలో కూలి పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారని తెలిపారు. రవీందర్‌కు వరుసకు అన్నా దేవరాజుకు మృతు రాలు మల్లవ్వ నిశ్చయమైన వివాహాన్ని చెడగొట్టిందని, మనసులో పెట్టుకొని మల్లవ్వపై కక్షతో రవీందర్ మహేష్‌ను కలిసి ఈనెల 8వ తారీఖున రాత్రి ద్విచక్ర వాహనంపై వన్‌పల్లి గ్రామానికి వెళ్లి మల్లవ్వను పలకరించిన క్రమంలో మేనల్లుడు కావడంతో ఇంట్లోకి రమ్మని ఆహ్వానించిందన్నారు. ప్లాన్ ప్రకారం వెళ్లిన ఇద్దరు దుండగులు నిద్రిస్తున్న మల్లవ్వను కత్తితో గొంతు కోసి హతమార్చారు. అనంతరం ఆమె ఒంటిపైన ఉన్న వెండి పట్టగొలుసులు, మెట్టెలు కొంత నగదు, ఏటీఎం కార్డులను దోచుకుని మృతదేహం చుట్టూ కారంపొడి చల్లారు. మృతురాలు అక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీర్నపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తులో భాగంగా ఐదు బృందాలుగా ఏర్పడిన పోలీసులు నెట్వర్క్ ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం వంటి అధునాతన టెక్నాలజీతో హత్య చేసిన దుండగులను గుర్తుపట్టి అదుపులోకి తీసుకొని, విచారించగా నిజం ఒప్పుకున్నారు. ఆ ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును అత్యంత కీలకంగా చాకచక్యంగా ఐదు రోజుల్లో చేదించిన సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్‌ను, ఎస్సై రమేష్, గంభరావుపేట ఎస్సై రామ్మోహన్, ఎల్లారెడ్డిపేట ఎస్సై రమకాంత్, టెక్నికల్ టీం ఎస్సై జునైద్, ఫింగర్ ప్రింట్ ఏఎస్ఐ శరత్, క్లూస్ టీమ్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్


హత్యకు ఉపయోగించిన సామగ్రి

సమాజ సేవలో తనదైన ముద్ర వేసిన ఎస్ఐ సుధాకర్

- వయోవృద్ధులకు అండగా నిలిచిన ఎస్ఐ దంపతులు
- రిఫ్రిజిరేటర్ అందజేత..

నవతెలంగాణ - తంగళ్ళపల్లి :
సమాజ సేవలో తనదైన ముద్ర వేశాడు తంగళ్ళపల్లి ఎస్సై సుధాకర్. సమాజ సేవలో భాగస్వామ్యం అవుతూ అనాథలకు అండగా నిలుస్తున్నారు ఎస్సై దంపతులు. తంగళ్ళపల్లి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దాస సుధాకర్ దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా నలుగురికి ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో వివాహ వార్షికోత్సవ వేడుకలను మండలంలోని ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలో జరుపుకున్నారు. అనంతరం వృద్ధుల కోసం ఆశ్రమానికి రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. తనతోపాటు తన కుటుంబం మాత్రమే సంతోషంగా ఉండడం కాదని నలుగురు సంతోషంగా ఉండాలని ఉద్దేశంతోనే వివాహ వార్షికోత్సవ సంబరాలను వయోవృద్ధులతో కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక సేవలో తనకంటూ ఓ విలక్షణ అక్షరాలను లిఖిస్తున్నారు ఎస్సై సుధాకర్. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానాన్ని కూడా చేశారు. సమాజంలో ఎక్కడ ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ భరోసాగా నిలుస్తున్న సుధాకర్ దంపతులకు ప్రజల నుంచి అభినందలు వెల్లువెత్తుతున్నాయి.


వయోవృద్ధులకు రిఫ్రిజిరేటర్ అందజేస్తున్న ఎస్సై దంపతులు



రక్తదానం చేస్తున్న ఎస్ఐ సుధాకర్, కుటుంబ సభ్యులు

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను సాధించాలి

విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ లతీఫ్



వీడ్కోలు నిర్వహిస్తున్న తొమ్మిదవ తరగతి విద్యార్థులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ లతీఫ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిది తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ లతీఫ్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని పదవ తరగతిలో చదువుకున్నట్లు ఇంటర్మీడియట్‌లో ఇష్టంగా, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్, డైరెక్టర్లు నయిమా, అషు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6గ్యారంటీలలో భాగంగా ఐదు గ్యారంటీలు పూర్తి చేసినందు కు, రెడ్డి కార్పొరేషన్ అమలు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు.

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం

లబ్దిదారులకు రుణాలు పంపిణీ చేసిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

నవతెలంగాణ - సిరిసిల్ల : పీఎం సూరజ్ పోర్టల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆన్లైన్ ద్వారా బుధవారం ప్రారంభించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని పలువురు లబ్దిదారులు, వివిధ శాఖల అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి పలువురు లబ్ధిదారులతో ఆన్లైన్లో మాట్లాడారు. వారు తాము ఎంచుకున్న రంగంలో ఎదిగిన తీరును అడిగారు. పలువురిని అభినందించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తన ఛాంబర్‌లో పలువురు సఫాయి కార్మికులకు పీపీఈ, వ్యక్తిగత సంరక్షణ కిట్లు, రూ. ఐదు లక్షల విలువైన ఆరోగ్య బీమా పత్రాలను పంపిణీ చేశారు. అలాగే పలువురు లబ్దిదారులకు బ్యాంకు రుణాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ మోహన్ రెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య, ఎల్డిఎం మల్లికార్జునరావు, పలు బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి


జిల్లా అధికారుల సంఘం క్యాలెండర్ లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అధికారులు

నవతెలంగాణ - సిరిసిల్ల : అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (జిల్లా అధికారుల సంఘం) ఆధ్వర్యంలో నిర్వహించిన 2024నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖిమ్యా నాయక్ , లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ పి. గౌతమి ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారుల సంఘం కార్యదర్శి డా.వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వీడిన ప్రణీత్ రావు అరెస్టు మిస్టరీ

- సిరిసిల్లలో ప్రణీత్ రావు అరెస్ట్
- ఫోన్‌తోపాటు ఇతర వస్తువుల స్వాధీనం

నవతెలంగాణ - సిరిసిల్ల : వారం రోజులుగా సంచలనం సృష్టిస్తున్న మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టు మిస్టరీకి తెరపడింది. ఫోన్ టాపింగ్ కేసులో సస్పెండ్ అయిన డీఎస్పీ ప్రణీత్ రావును మంగళవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో సిరిసిల్లలో తాను అద్దెకు ఉంటున్న నివాసంలో పంజాగుట్ట పోలీసులు అదుపు అదుపులోకి తీసుకున్నారు. ప్రణీత్ రావు ఫోన్‌తోపాటు ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిరిసిల్లలోని డిసి ఆర్‌బి విభాగంకు ఆయన బదిలీ కాగా జిల్లాలో బాధ్యతలు స్వీకరించారు. అదే రోజు అతన్ని సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ విషయం సిరిసిల్ల జిల్లా ఎస్పీకి రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు సమాచారం అందజేసినట్లు తెలిసింది. కానీ ముందస్తుగానే విషయం తెలుసుకున్న ప్రణీత్‌రావు సిరిసిల్లలో తలదాచుకోవడంతో అతని కోసం పోలీసులు ఎక్కడున్నాడని వాకాబు చేసి పట్టుకున్నట్లు సమాచారం. హైదరాబాదులోని విధులు నిర్వర్తిస్తూ ఫోన్ టాపింగ్ కేసులో సస్పెండ్ కాగా అతనిపై కేసు నమోదు కావడంతో ప్రణీత్ రావును అదుపులోకి తీసుకొని హైదరాబాదు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల సమయంలో ముఖ్య నాయకుల ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్‌రావును ఎస్ ఐ బి అధికారుల ఫిర్యాదుతో అరెస్టు చేశారు.


మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ను సిరిసిల్లలో అరెస్ట్ చేస్తున్న హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు


అరెస్ట్ అయిన మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు

శాంతి భద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి
- సరైన పత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలు, 01 ఆటో స్వాధీనం

నవతెలంగాణ - సిరిసిల్ల : శాంతి భద్రతల పరిరక్షణ కోరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సిరిసిల్ల డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య నగర్ బుధవారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరియైన పత్రాలు లేని, సరైన నంబర్ ప్లేట్స్ లేని 52 ద్విచక్ర వాహనాలు,01 ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మట్లాడుతూ ప్రజల రక్షణ, ప్రజలలో భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం, ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని అందుకే కార్యక్రమాన్ని నిర్వహిస్తూన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ రఘుపతి, సదన్ కుమార్, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి


పోలీసులు పట్టుకున్న పత్రాలు లేని వాహనాలు

హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు

నవతెలంగాణ - చందుర్తి :
హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడినట్టు విధించినట్లుగా ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. చందుర్తి మండల కేంద్రానికి చెందిన బుర్ర నాంపెల్లి అతని తమ్ముడు రాజారాం 2016లో ఆస్తుల విషయంపై గొడవ జరుగగా అన్న నాంపెల్లి అతని తమ్ముడు రాజారాంపై కమ్మ కత్తితో దాడి చేశాడు. బాధితుడు రాజారాం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ నాంపెల్లిపైపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ చేసాడు. తదుపరి వచ్చిన ఎస్సై శివ కేశవులు చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో హాజరు పరచగా జడ్జి నాంపెల్లికి ఏడాది జైలు, రూ.2వేల జరిమానా విధించినట్టు ఎస్‌స శ్రీకాంత్ తెలిపారు.

రైతులు నువ్వు పంటలో యజమాన్య పద్ధతులను పాటించాలి

కోరుట్ల ఏడిఏ రమేష్

నవతెలంగాణ-మల్లాపూర్

రైతులు నువ్వు పంటలో యజమాన్య పద్ధతులను పాటించాలని కోరుట్ల ఏడీఈ రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్యంపేట గ్రామంలో నువ్వు పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నువ్వు పంటలలో ఎక్కువగా పచ్చ దోమ, ఆకు తినే పురుగులను అధికంగా ఉన్నాయని అన్నారు. కావున రైతులు వెంటనే గుర్తించి ఎకరానికి మోనోక్రోటోఫాస్ 320 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలని తెలిపారు. దీని ద్వారా వెంటనే పురుగుమందు నశించి నువ్వు పంటకు దిగుబడి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సంధ్య, గజానంద్ రైతులు మల్లయ్య, అశోక్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఏడీఏ రమేష్

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు

- ప్రతి తెలంగాణ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన
- నిరుపేద ఆటో కార్మికులందరికీ ఇండ్ల స్థలాల కేటాయింపు
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ గ్యారెంటీ పథకాల అమలు
- రామగుండంలో 355 అదనపు పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

నవతెలంగాణ-గోదావరిఖని

రాష్ట్రంలోని ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను ప్రభుత్వం ఉచితంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రామగుండంలోని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో సింగరేణి నిధులు రూ.142 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించే 355 అదనపు పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి భూమి పూజ చేసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా ఈ భవన నిర్మాణాన్ని సకాలంలో నిర్మిస్తామని అన్నారు. రామగుండం ప్రాంతంలో మెడికల్ కళాశాలకు అనుసంధానంగా నర్సింగ్ కళాశాలను సైతం ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలలో మన తెలంగాణ విద్య, వైద్యం రంగంలో అగ్ర భాగాన ఉండేవిధంగా ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. భావితరాలకు మానవ వనరులను అందించే విద్యను గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేసిందన్నారు. ప్రతి తెలంగాణ పౌరుడి హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి జిల్లాలో దాదాపు 2000 మంది లబ్ధిదారులు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. ప్రాథమిక వైద్యం అందించే దిశగా కార్పొరేషన్‌లో అవసరమైన చోట బస్తీ దవాఖానాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొం దించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆర్ఎంపి వైద్యులకు శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.వైద్య విద్యార్థులు ఎంబిబిఎస్‌తో ఆపకుండా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలని, స్పెషలైజేషన్ చేయాలని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు బోధన అందించే సమయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, దానికి అవసరమైన మేర నిధులు సమకూర్చడం జరుగు తుందని మంత్రి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ మెషిన్ లెర్నింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశంలోని ఎయిమ్స్ మొదలగు ప్రముఖ వైద్య కళాశాల స్థాయిలో మన ప్రభుత్వ వైద్య కళాశాలలో సైతం విద్యార్థులకు సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులలో గ్యారంటీ పథకాల అమలు ప్రారంభించామని, 23 కోట్ల జీరో టికెట్స్ ఉచిత బస్సు ప్రయాణం క్రింద అందించామన్నారు. మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణాన్ని జిల్లా కలెక్టర్ స్వతహాగా బస్సులో ప్రయాణించి పరిశీలించారని అన్నారు. మార్చి నెల నుంచి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకం ప్రారంభించామని, తెల్ల రేషన్ కార్డు దారులందరికీ జీరో కరెంట్ బిల్లు వస్తుందని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. 24 గంటల వ్యవధిలో గ్యాస్ సబ్సిడీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేరుస్తున్నామని అన్నారు. ఇండ్లు లేని నిరు పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించామని, రామగుండం ప్రాంతంలో నిరుపేద ఆటో కార్మికులందరికీ ఇండ్ల స్థలాలు అందిస్తామని అన్నారు. గోదావరిఖని పట్టణంలోని రోడ్లు డ్రైనేజీల అభివృద్ధిపై దృష్టి సారించాలని, సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ లో స్థానిక యువతకు 80 శాతం మేర ఉపాధి కల్పించడంలో సింగరేణి సంస్థ సహకరించాలని ఆయన సూచించారు. ఆర్.ఎఫ్.సి.ఎల్, ఎన్టిపిసి సంస్థలు సైతం స్థానిక యువతకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సదుపాయాలను రామగుండంలో అందే విధంగా ఆసుపత్రి నిర్మాణం ఉంటుందని అన్నారు. అనంతరం రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. రామగుండంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని తాము చేసిన పోరాటాలు, ఒత్తడి ఫలితంగా గత ప్రభుత్వం సింగరేణి సంస్థ ద్వారా రామగుండంలో వైద్య కళాశాల పనులు చేపట్టిందని అన్నారు. రామ గుండం కార్పొరేషన్ అభివృద్ధి కోసం మంత్రి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు, అదేవిధంగా గ్రామీణ ప్రాంత అభివృద్ధి కోసం 30 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. స్కిల్ సెంటర్ నిర్మాణ పనులు జరుగుతు న్నాయని తెలిపారు. రామగుండం ఎత్తిపోతల పథకం చివరి పనులు పూర్తిచేస్తే 12 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని , అదేవిధంగా పాలకుర్తి ఎత్తిపోతల పథకాన్ని సైతం ప్రభుత్వం మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్, రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు, సింగరేణి ఆర్జీవన్ జీఎం శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పొత్కపల్లి పోలీసు స్టేషన్‌ను తనిఖీ

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం పెద్దపెల్లి ఏసీపీ కృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్ పరిధిలోగల గ్రామాల వివరాలు, కేసుల వివరాలను అడిగి తెలుసుకొని సిబ్బందికి తగు సూచనలు చేశారు.

శ్రీ మల్లికార్జున స్వామికి ప్రభుత్వ విప్ పూజలు

నవతెలంగాణ-ధర్మారం

మండలంలోని చావనపల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి కళ్యాణ నాగవెల్లి పట్నాల మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా గొర్ల కాపర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగరాజు యాదవ్, కొమ్ము లచ్చయ్య పాల్గొన్నారు.

తైబజారు వేలం రూ.9.9 లక్షలు

నవతెలంగాణ -మెట్ పల్లి

మెట్‌పల్లి మున్సిపాలిటీ తై బజారుకు బుధవారం నిర్వహించిన వేలం పాటలో పట్టణానికి చెందిన ఐదుగురు వ్యక్తులు పాల్గొనగా రూ.9.90 లక్షలకు వేలం పాడిన అల్గొట్ నరేందర్‌కు 2024-25 సంవత్సరంకు తైబజారు నిర్వహణకు లైసెన్స్ జారీ చేసినట్టు కమిషనర్ తెలిపారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ

నవతెలంగాణ-మల్లాపూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని ముత్యంపేట అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఎత్తు, బరువులను కొలిచారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య, బాల్య సందర్శన, పుస్తక ప్రదర్శన కార్య క్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆమెటి శ్రీలత, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీలు

అదుపు తప్పి లిక్కర్ వ్యాన్ బోల్తా

నవతెలంగాణ-మల్యాల

లిక్కర్ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది .కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం కరీంనగర్ నుంచి లిక్కర్ లోడుతో కోరుట్ల వెళ్తున్న డీసీఎం వ్యాన్ లోకపల్లి శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. స్వల్ప గాయాలతో డ్రైవర్, ఇతరులు బయటపడగా, సుమారుగా రూ.50లక్షల విలువ గల మద్యం తరలిస్తున్నట్లు అంచనా. సంఘటన జరిగిన వెంటనే మల్యాల ఎస్ఐ కుమార స్వామి సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



బోల్తా పడిన లిక్కర్ వ్యాన్

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంతో పటు ఆయా గ్రామాలలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరతో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులను బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మహిళా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, బిజెపి సీనియర్ నాయకులు ముత్యాల చంద్రశేఖర్, తొట్ల నరేష్, బీజేపీ ఉపాధ్యక్షులు లవంగ శివ, గుయ్య మల్లేష్, పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ మందిర నిర్మాణానికి నిధుల మంజూరు

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ 4 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రేణుక ఎల్లమ్మ కమిటీ సభ్యులకు నాలుగు లక్షల రూపాయల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు ముద్దం శరత్ గౌడ్, సంఘము అధ్యక్షులు బండారి శేఖర్, రేణుక ఎల్లమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రొసిడింగ్ అందజేస్తున్న నాయకులు

కనుక సోమేశ్వర హుండీ ఆదాయం లెక్కింపు

నవతెలంగాణ-మల్లాపూం

మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన కనక సోమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సంఘ గంగా రాజం యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రి ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా హుండీ ఆదాయం రూ .5,72, 721 నగదు, పదిన్నర మాసాల బంగారం రూపంలో ఆదాయం వచ్చిందని అన్నారు.

పది విద్యార్థులకు ప్యాడు పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-మల్లాపూర్:

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్, పెన్నులను కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర రాజ శేఖర్ రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుధాకర్, శంకర్, వెంకటరమణ, మోహన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్ తో లాండ్రీ షాప్ దగ్ధం

నవతెలంగాణ-మల్లాపూర్

షార్ట్ సర్క్యూట్ ప్రమాదవశాత్తు లాండ్రీ షాప్ దగ్ధమన ఘటన మండలంలోని సంఘం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆరేపల్లి శ్రీనివాస్ వృత్తిరీత్యా లాండ్రి షాపును నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. మంగళవారం రాత్రి విద్యుత్ సర్క్యూట్ జరగడంతో అకస్మాత్తుగా మంటలు చెల్లరేగాయి. బాధితుడు గమనించే లోపే షాప్‌లో ఉన్న బట్టలు, ఫర్నిచర్,మిషనరీ పూర్తిగా కాలి బూడిదయాయి. తన జీవనోపాధి అయిన షాప్ కాలిపోవడంతో సుమారుగా నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని , ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు. బాధితులని బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం స్పందించే ఆదుకోవాలని కోరారు.



దగ్ధమైన లాండ్రీ షాప్

విచారణకు హాజరైన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-పెద్దపల్లి

మహారాష్ట్రలోని 'బిలోలి సేషన్' కోర్టులో గతంలో అయినా 'బాబ్లీ కేసు' విషయంపై విచారణకి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, కరీం నగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు షిండే, రత్నంలు హాజరయ్యారు.



చిరు వ్యాపారులకు న్యాయం చేయండి

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ- గోదావరిఖని

చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. బుధవారం గోదావరిఖని లోని సీఐటీయూ ఆఫీసులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోదావరిఖని డెవలప్మెంట్ పేరుతో రోడ్డు విస్తరణలో భాగంగా అర్జున్ స్వీట్ హౌస్, మేదరి బస్తీ వరకు అలాగే ఓల్డ్ అశోక్ ఏరియాలోని కార్మిక కుటుంబాలు నివసిస్తున్న 72 క్వటర్లు, పోతున్నాయన్నారు. సెక్టార్ 2లోని క్వాటర్లకు మీరు 15 రోజులలో వెళ్లిపోవాలని యజమాన్యం నోటీసులు జారీ చేసిందన్నారు. గత 25 సంవత్సరాల నుంచి సింగల్ బెడ్ రూమ్ కోటర్లు సరిపోక లక్ష నుంచి మూడు లక్షల వరకు ఖర్చుపెట్టి అటుపక్క ఇటుపక్క షెడ్లు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. పైగా సెక్టరు వన్‌లో నివసిస్తున్న కార్మిక కుటుం బాలను సెక్టార్ 2 వెళ్లిపొమ్మని లెటర్ ఇవ్వడం ఏంటని యజమాన్యాన్ని ప్రశ్నించారు, సెక్టార్ వన్‌లో పోతున్న కోటర్ల ప్లేస్‌లో సెక్టర్ వన్‌లోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఏ రకంగా కార్మికులు షెడ్యూల్ వేసుకొని నిర్మించుకున్నారో అదే రకంగా యజమాన్యం ప్రభుత్వం కలిసి మరోసారి కార్మిక కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా, సేమ్ టు సేమ్ క్వార్టర్లు నిర్మించి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్జీ1, కార్యదర్శి మెండె శ్రీనివాస్, సానం రవి, జి సాయికృష్ణ, విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, బీమా నాయక్, సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

బెస్ట్ సర్వీస్ సొసైటీ అవార్డుకు వెంకటస్వామి ఎంపిక

నవతెలంగాణ-పెద్దపల్లి

బెస్ట్ సర్వీస్ సొసైటీ అవార్డుకు లిటరసీ అవేర్నెస్ జిల్లా కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. జాతీయ అవార్డుకు ఎంపికకావడం పట్ల పలువురు వెంకటస్వామికి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో వెంకటస్వామి ప్రజలకు మెరుగైన సేవలందించాలని రాధాకృష్ణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతం తదితరులు పాల్గొన్నారు.

గడ్డం వంశీకే బీసీ పోరాట సమితి మద్దతు

నవతెలంగాణ-పెద్దపల్లి

యువనేత గడ్డం వంశీకే బీసీ పోరాట సమితి మద్దతి స్తుందని తెలంగాణ బీసీ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ యువనేత గడ్డం వంశీకి కాంగ్రెస్ టిక్కెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరామన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని గడ్డం వంశీకృష్ణకు ఇచ్చినట్లయితే పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. వంశీకృష్ణ తన తాత ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాడని అన్నారు. వంశీకృష్ణకు టికెట్ ఇచ్చినట్లయితే భారీ మెజార్టీతో గెలిపించు కుంటామని తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపెల్లి మాజీ మున్సిపల్ చైర్మెన్ ఎల్.రాజయ్య, నాయకులు భూషణవేని సురేష్ గౌడ్, దొడ్డుపల్లి జగదీష్, తూముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్

సహకార సంఘాల అభివృద్ధికి చర్యలు

అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లాలో ఉన్న వివిధ సహకార సంఘాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ..జిల్లాలోని వివిధ సహకార రంగాలలో అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డైరీ, మత్స్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో ప్రభుత్వం ద్వారా చేపడుతున్న వివిధ పథకాలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను వినియోగిస్తూ సహకార సంఘాలను ఆర్థిక సంస్థలుగా శక్తివంతం చేయాలని అన్నారు. పంచాయతీ స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సంఘాలలో అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని, 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని సాధారణ సేవా కేంద్రం ద్వారా రైతులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తేవడం కోసం సహకార సంఘాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్, జిల్లా మత్స్యశాఖ అధికారి, కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

నవతెలంగాణ-పెద్దపల్లి

గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని మూడో రోజు మారేడు గుండాలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మారేడు గుండలో గ్రామ సర్వే నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఏ.మధుసూదన్, డీపీఎం కే.ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంఏ.సమద్, ఉపాధ్యక్షురాలు ఆమని, ఎన్ఎస్ఎస్ వాలంటరీస్ పాల్గొన్నారు.



గ్రామ సర్వే చేస్తున్న విద్యార్థులు

ప్రయివేట్ ఆస్పత్రులకు అవగాహన

నవతెలంగాణ-పెద్దపల్లి

స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రయివేట్ ఆస్పత్రులకు, సింగరేణి, ధన్వంతరి ఎన్టీపీసీ ఆస్పత్రులకు గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994, క్లినికల్ ఎస్టాబ్లిషిమెంట్ యాక్ట్ 2010, ఎంటీపీ యాక్ట్, బర్త్ మానిటరింగ్ సిస్టమ్ గురించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ లేదా పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం 3సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10,000 లు జరిమానా విధించబడునని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ద్వారా స్కానింగ్ చేసిన ప్రతి గర్భవతి వివరాలు ఫామ్-ఎఫ్‌లో నింపి ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే జిల్లా ఐటీ మేనేజర్ సీహెచ్.మహేందర్ మాట్లాడుతూ..హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ ఫర్మేషన్ సిస్టం, బర్త్ మానిటరింగ్ సిస్టమ్ వెబ్‌సైట్స్ గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో డిప్యూటి డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పి.కృపాబాయి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ రాజమౌళి, ప్రోగ్రామ్ అధికారులు, డిప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాకు సీఐటీయూ నాయకుల వినతి

నవతెలంగాణ- గోదావరిఖని

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఆర్జీ1, బ్రాంచి కార్యదర్శి మెండె శ్రీనివాస్‌లు కలిసి కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేశారు. సింగరేణి కార్మికులు అనేక సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్నారని తెలిపారు. ఈ సందర్భంలో కార్మికులకు సొంత ఇల్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవన పరిస్థితిలు కొనసాగిస్తున్నారన్నారు. సంస్థ రాష్ట్ర అభివృద్ధిలో ముందు భాగన నిలబడుతున్న కార్మికులందరికీ సొంతిల్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇన్కమ్ టాక్స్ కొలిండియాలో అధికారులకు కార్మికులకు అలవెన్సుపై ఇన్కమ్ టాక్స్ తిరిగి చెల్లిస్తున్న పరిస్థితి ఉందని, మన సింగరేణిలో అధికారులకు మాత్రమే తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు. కార్మికులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కారుణ్య నియామకల్లో అనేకమంది యువత సింగరేణిలో పనిచేస్తున్నారని వారి పిల్లల చదువుల కోసం సిబిఎస్ఈ సెలబస్ సింగరేణి విద్యాలయాలను ఆదునీకరించాలన్నారు. అలాగే మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, కొత్త గనుల తవ్వకాలు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని తదితర 11 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తెలంగాణ సంస్కృతి సంప్రదాయలను ప్రపంచానికి చాటిన ఘనత ఎమ్మెల్సీ కవితదే

నవతెలంగాణ-గోదావరిఖని

తెలంగాణ సంస్కృతి సంప్రదాయలను ప్రపంచానికి చాటిన ఘనత ఎమ్మెల్సీ కవితదే అని రామగుండం మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఎమ్మెల్సీ కవితక్క జన్మదినం సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు పెంట రాజేష్ అందే సదానందం, తోకల రమేష్, కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి హరికరావు, బుగ్గ సాయికృష్ణ, నిట్టూరి రాజు వెయుగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి

భూ సేకరణ పనులు పూర్తి చేయాలి

జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

నవతెలంగాణ-జగిత్యాల

భూ సేకరణ పనులు త్వరిత గతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. బుధవారం కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో జాతీయ రహదారి నెంబర్ 63, రాష్ట్ర రహదారి 563 నిర్మాణ పనులకు భూసేకరణ పనులు నిర్దిష్ట సమయానికి సేకరణ జరగాలని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో సేకరించవలసిన భూములతో పాటు కొత్తగా ప్రతిపాదించిన భూముల సేకరణ కూడా తొందరగా చేపట్టాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ మధుసూదన్, భూ కొలతల సహాయ సంచాలకులు వెంకటరెడ్డి, తహశీల్దార్లు, సంభందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ -గోదావరిఖని

పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి పరీక్ష సన్నద్ధత అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ అవ్వాలని విద్యార్థులు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అందించే సూచనలు పాటిస్తే తప్పనిసరిగా 100 శాతం ఉత్తీర్ణత సాధ్య మవుతుందన్నారు. 10వ తరగతిలో విద్యార్థులు పాసయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకో వాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం వేకప్ కాల్స్ చేయాలని, విద్యార్థులు ఉదయం రెండు గంటల పాటు చదువుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యమైన పాఠ్యాంశాలతో కూడిన వర్క్ బుక్‌లను విద్యార్థులకు పంపిణీ చేశామని, వాటిపై విద్యార్థులు సంపూర్ణ ప్రావీణ్యం కలిగి ఉండేలా ఉపాధ్యాయులు శిక్షణ అందించాలని ఆయన సూచించారు.



అదనపు కలెక్టర్ శ్రీ పర్స రాంబాబుకు టీఎన్జీవోల ఘన స్వాగతం

నవతెలంగాణ-జగిత్యాల జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ పర్సరాంబాబును టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి స్వాగతం తెలిపారు. ఈ కార్య క్రమంలో టీఎన్జీవో నాయకులు సాహెద్ బాబు, రవీందర్, రాజేశం, మమత, శైలజ, శ్రావణి, ఇంద్రజ, నర్సయ్య, అయూబ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆవులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



నవతెలంగాణాణ-ఇబ్రహీంపట్నం

ఎలాంటి అనుమతులు లేకుండా ఆవులను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గండి హనుమాన్ చెక్ పోస్ట్ వద్ద ఎస్సై తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎంలో జగిత్యాల నుండి నిజామాబాద్‌కు తరలిస్తున్న 39 ఆవులను పట్టుకుని గోవుల సంరక్షణ నిమిత్తం జగిత్యాల జిల్లా తాటిపల్లి గ్రామంలో గల సురభి గోసాలకు పంపించి ఆవులను తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన యజమాని షేక్ సల్మాన్. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వ్యాన్ డ్రైవర్ పటాన్ సమీర్ ఖాన్ పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

నవతెలంగాణ - హుజూరాబాద్


నివాళ్లర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తొలి కవయిత్రిగా పేరుపొందిన మొల్లమాంబ జయంతి వేడుకలు హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్ పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మక్కపల్లి కుమార్ యాదవ్, కుమ్మరి సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి నాంపల్లి ప్రభాకర్, కార్యదర్శి ఇజ్జగిరి కుమార్, పట్టణ అధ్యక్షులు మోతె రవి, సముద్రాల సదానందం, మోతే రాజు, చెల్పూర్ శ్రీనివాస్, నాంపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7800

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు విడి పత్తి 575 క్వింటాళ్లు 51 వాహనాలను బుధవారం రైతులు తీసుకువచ్చారు. గరిష్ట ధర రూ.7,800, మోడల్ - 7,700, కనిష్ట - 7వేలు పలికిందని మార్కెట్ సెక్రటరీ గుగులోతు రెడ్డి ఒక ప్రకటన పేర్కొన్నారు. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 9క్వింటాళ్లు ఐదుగురు రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట - 6800, మోడల్ - 6,500, కనిష్ట - 6400 పలికింది.

జెడ్పీహెచ్ఎస్‌లో వీడ్కోలు హంగామా..



నవతెలంగాణ - గన్నేరువరం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామయ్య మాట్లాడుతూ విద్యార్థులు 10 జీపీఏ సాధించి ఉన్నత చదువులు చదివి, మంచి స్థాయిలో నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బుర్ర మల్లేశంగౌడ్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది లేక ఇబ్బందులు

మాజీ సర్పంచ్ పంతంగి ప్రభాకర్ గౌడ్

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండలంలోని వెదురుగట్ట గ్రామంలో విద్యుత్ సిబ్బంది స్థానికంగా లేకపోవడం వల్ల రాత్రి కరెంటు సమస్యలతో పరీక్షలు ఉన్న సందర్భంలో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ సర్పంచ్ పంతంగి ప్రభాకర్ బుధవారం కరీంనగర్‌లోని టీఎస్ ఎన్‌పిడిసిఎల్ సూపరింటెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి 7 గంటల నుండి 7.45 వరకు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వైర్ పోయినందున కాలనీ విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఆరు నెలల క్రితం ఏఈకి ఈ సమస్యపై పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని అన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, జేఎల్‌ఎం గ్రామంలో స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

గాలికుంటు నివారణా టీకాలు

నవతెలంగాణ - శంకరపట్నం

శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. 230 పాడి పశువులకు పశువైద్యులు డాక్టర్ మాధవరావు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోతె భాగ్యలక్ష్మిఎల్లారెడ్డి, సిబ్బంది ఆరిఫ్ అహ్మద్, అమీర్ ఖాన్, గోపాలమిత్ర మొండయ్య ,పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

నవతెలంగాణ - గంగాధర

పోషకాహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక సూచించారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుక మాట్లాడుతూ ఆకు కూరలు, మొలకెత్తిన విత్తనాలు, కూరగాయలు, పండ్లలో తగినన్ని పోషకాలు ఉన్నాయని, పిల్ల తల్లులు, బాలింతలు, గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు విజయ, సరోజన, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

నవతెలంగాణ - గంగాధర


పెన్నులు, బుక్కులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షలు రాస్తేనే మంచి మార్కులు, ఏ గ్రేడ్ వస్తుందనే విషయం గ్రహించాలని హమ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ధనపురి సాగర్ సూచించారు. గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పెన్నులు, బుక్కులను ఆ సంస్థ పక్షాన అందించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నవని, ప్రశ్నాపత్రం క్షుణ్ణంగా పరిశీలించి జవాబులు రాయాలని సూచించారు. 9.8 ఆ పైన జీపీఏ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.2016 నగదు పారితోషికం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీరో బిల్లులు అందజేత

నవతెలంగాణ - ఇల్లందకుంట



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తికాముందే ఆరు గ్యారంటీలను అమలు చేస్తు హామీలు నెరవేరుస్తున్న ఏకైక ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ జిల్లా చైర్మన్ బండి మల్లేష్ అన్నారు. ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామంలో గృహజ్యోతి పథకంలో లబ్దిదారులకు జీరో బిల్లులను మల్లేష్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉప్పుల జనార్ధన్‌రెడ్డి, రామిడి వీరారెడ్డి, ముద్రబోయిన స్వామి, మిట్ట మోహనరావు, ఆకినాపల్లి వెంకటేష్, సామాను అరుణ్ పాల్గొన్నారు.

బూతులకు కేరాఫ్ అడ్రస్ కేసీఆర్

- వినోద్ కుమార్ వలస పక్షి..

-బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్

రాజకీయాల్లో బూతులకు కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. 10ఏండ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ పెద్ద అవినీతిపరుడని, కేంద్ర మంత్రిగా ఉంటూ సహారా, ఈఎస్ఐ కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బుధవారం కరీంనగర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి బండి సంజయ్ మాట్లాడుతూ.. కేసీఆర్‌ను తెలంగాణ సమాజం ఛీత్కరించినా బుద్ధిరాలేదన్నారు. పచ్చి అబద్దాలు, అభూత కల్పనలతో మళ్లీ ప్రజలను నమ్మించే యత్నం చేస్తున్నారని, బీఆర్ఎస్‌కు అభ్యర్థులే కరువయ్యారని, ఆ పార్టీలోని నేతలంతా ఇతర పార్టీల వైపు చూస్తున్నారు అని అన్నారు. వినోద్ కుమార్ నిజాయితీపరుడైతే రూ.500 కోట్ల విలువైన భూదాన్ భూముల స్వాధీనంపై కేసీఆర్ నోరెందుకు మెదపలేదన్నారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నేతలు చేసిన అరాచకాలు, భూకబ్జాల భాగోతం తెలియదా, ఇప్పుడు వారి భూభాగోతాలు వెలుగులోకి రావడంతో ఆరుగురు కార్పొరేటర్లను జైలుకు పంపింది నిజం కాదా అన్నారు. బండి సంజయ్ పక్కా లోకల్, నాకే మాట్లాడే హక్కుంది, పోటీ చేసే హక్కుందన్నారు. అపర మేధావి (వినోద్ కుమార్) వలస పక్షి కేసీఆర్ కుటుంబానికి దోచిపెట్టడం, దోచుకోవడమే ఆయన పని అని ఆరోపించారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. రసమయి బాలకిషన్ వ్యాఖ్యలపై మాట్లాడి నా స్థాయిని తగ్గించుకోలేను అన్నారు.

విప్లవయోధుడు అనభేరి ప్రభాకర్‌రావు

సాయుధపోరాటమే మార్గమన్న వీరుడు

- రజాకార్లతో పోరులో అమరుడు
- తొలి ఎన్‌కౌంటర్ కూడా ఆయనదే
- నేడు వర్ధంతి





నవతెలంగాణ - తిమ్మాపూర్

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టారు. ప్రజల బానిస విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనపై రణభేరి మోగించిన విప్లవ యోధుడు.. పొలంపల్లి పులిబిడ్డ అనభేరి ప్రభాకర్‌రావు. నిజాం పోలీసులైన రజాకార్లతో జరిగిన హెూరాహెూరీ పోరులో అసువులు బాసిన అనభేరి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామంలోని జమీందారీ కుటుంబంలో జన్మించారు అనభేరి ప్రభాకర్‌రావు. గ్రామాల్లో పెత్తందార్ల దోపిడీ, దొరల అరాచకాలు, వెట్టిచాకిరీ, బానిస విధానానికి వ్యతిరేకంగా ఆయన పోరుబాట పట్టారు. గ్రామగ్రామాన సాయుధ దళాలను ఏర్పాటు చేసి ప్రజలకు అండగా నిలిచారు. ఈ సమయంలోనే 1948 మార్చి 14న హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్లో ఓ ఇంట్లో ప్రభాకర్‌రావు దళం భోజనం చేసి గుట్టల ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్నది. అదేరోజు మిట్ట మధ్యాహ్న సమయంలో మహ్మదాపూర్ గుట్టలను రజాకార్లు ఒక్కసారిగా చుట్టుముట్టి తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ప్రభాకర్‌రావు దళానికి నిజాం పోలీసులకు గంటల తరబడి భీకర పోరు కొనసాగింది. తుపా కుల మోతలతో గుట్టలు దద్దరిల్లాయి. రష్యాకు చెందిన మిషన్ గన్ ప్రభాకర్ రావు రజాకార్ల పోలీసులపైకి ఎదురు దాడికి దిగారు. ఈ హెూరాహెూరీ పోరులో ప్రభాకర్‌రావు, ఆయన సహచరుడు భూపతిరెడ్డి మరో 12 మంది నేలకొరిగారు. తెలంగాణ ప్రాంతంలో ఇదే తొలి ఎన్‌కౌంటర్. ఈ ఘటన జరిగి నేటికి 74 సంవత్సరాలు గడిచింది. ఇప్పటికి ఆయన జ్ఞాపకాలను స్మరిస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గుట్టల ప్రాంతంలోని అమరుల ఘాట్ వద్ద మార్చి 14న చుట్టు పక్కల గ్రామాల నుంచి ఆయన అభిమానులు వేలాదిగా తరలి వచ్చి నివాళులర్పిస్తారు.

ప్రతిఏటా నివాళి

ఎన్‌కౌంటర్ జరిగిన మహ్మదాపూర్ గుట్టల్లో వీరి స్మారకార్థం సమాధి, గ్రామంలోని చౌరస్తా వద్ద స్తూపం నిర్మించారు. హుస్నాబాద్‌లో నిర్మించిన సీపీఐ కార్యాలయ భవనానికి అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి పేరు పెట్టారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం ఏర్పాటు చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రతి ఏటా మార్చి 14, సెప్టెంబరు 17న స్తూపం, సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్నారు..

వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

- సీపీఐ తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి



తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైె అనభేరి ప్రభాకర్‌రావు జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. తెలంగాణలోని పల్లెలను తన ప్రాణాలను తెగించి కాపాడిన వీరు అనభేరి ప్రభాకర్‌రావు. అంతేకాకుండా ఈ ప్రాంతాన్ని సందర్శక ప్రదేశంగా గుర్తించి ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. నేటి యువతకు అనభేరి పోరాట స్ఫూర్తి కావాలి.

బాబ్లీ కేసులో బిలోలి సెషన్ కోర్టుకు హాజరైన ఎమ్మెల్యేలు

-న్యాయస్థానం తీర్పును గౌరవిస్తాం

-ఎమ్మెల్యే గంగుల కమలాకర్

నవతెలంగాణ-కరీంనగర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తెలంగాణ ప్రాంత రైతుల భూములు ఎడారిగా మారుతుంటే చూస్తూ ఉండలేక ఆనాడు బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టి, ఆందోళనలు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం మహారాష్ట్రలోని 'బిలోలి 'సెషన్' కోర్టులో 'బాబ్లీ కేసు' విషయంపై విచారణకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణరావు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంతు షిండే, కేఎస్ రత్నం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని వివాదాస్పద బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆనాడు ధర్నా చేసేందుకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత చంద్రబాబుతో పాటు మరో 14 మంది ఆందోళనలో పాల్గొనడం జరిగిందని, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం తమపై లాఠీ చార్జి చేయడంతో పాటు నాన్ బెయిలేబుల్ కేసులు పెట్టిందని అన్నారు. తెలంగాణకు వర ప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండా బాబ్లీపై నిర్మిస్తున్నా అక్రమ ప్రాజెక్టులకు నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడం జరిగిందని అన్నారు. ఆనాడు అక్రమంగా లాఠీఛార్జ్ చేసి తీవ్రంగా గాయపరిచారని, శ్రీరాంసాగర్‌పై ఆధారపడి ఉన్న లోయర్ మానేర్ డ్యాం మిడ్ మానేర్ ప్రాజెక్టులకు నీరు రాకుండా అప్పటి సమైక్య పాలకులు అడ్డుపడ్డారని అన్నారు. తమకు న్యాయస్థానాల మీద పూర్తిగా గౌరవం ఉందని, బిలోలి సెషన్ కోర్టుకు హాజరు కావడం జరిగిందని తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



మానకొండూర్ : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తాలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి బండారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారి రాజ్ కుమార్, దీటి అంజయ్య పటేల్, వొడ్నాల రాజశేఖర్, హరిఅశోక్‌కుమార్, చిట్ల అంజన్న, ఆడప గంగన్న, సంఘ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో మున్నూరు కాపు సోదరులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కాస సంజీవ్ కుమార్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ-పెద్దపల్లి

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఇచ్చినందుకు, మాట నిలబెట్టుకున్నందుకు తెలం గాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మున్నూరుకాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ ఆధ్వర్యంలో పెద్దపల్లితో పాటు జిల్లా మున్నూరుకాపు నాయకులు, యువకులు బాణా సంచా కాల్చి పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇమ్మడిశెట్టి మోహన్ పటేల్, పుదరి కిషన్ పటేల్, దాసరి రాజేశం, చింతపండు స్వామి, గుంటుకు సత్తయ్య మల్కా శంకరయ్య, గోస్కుల రాజేశం, గుంటూరు రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముదిరాజ్ సంఘం తరపున పెద్దపెల్లి జిల్లా నియోజకవర్గం ముదిరాజ్ ఐక్యత సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ ముదిరాజ్ సబ్బితమ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

నవతెలంగాణ - శంకరపట్నం

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయుటకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ముదిరాజ్ కులస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నామని ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప అన్నారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ముదిరాజుల ఎన్నో దశాబ్దాల కలలను సహకారం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ - మానకొండూర్

పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్‌లో ఆమోదం తెలిపిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు మానకొండూర్ మండల పెరిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెరిక సంఘం మండల అధ్యక్షుడు కానిగంటి మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోళ్ల మురళిదర్, నాయకులు సాయిరి దేవయ్య, బెడద సుధాకర్, తమ్మిశెట్టి రాజేష్, పెట్టం సంపత్, మీస సత్యనారాయణ, కానిగంటి కుమార్, మీస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్వర్యంలో

మున్నూరు కాపు సంఘం కార్పొరేషన్ ఏర్పాటును హర్షిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రామిడి తిరుపతి, గొశెట్టి సత్యనారాయణ, దొగ్గలి శ్రీనివాస్, మాదాసు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో

నవతెలంగాణ - జమ్మికుంట

ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జమ్మికుంటలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు చందా రాజు ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బచ్చు భాస్కర్, గుండా తిరుపతి, అయిత మహేష్, గాందె ప్రవీణ్ కుమార్, వ్యాంసాని రమేష్, మంచాల రాంబాబు, దొడ్డ శ్యామ్, ఆకుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కదనభేరి కాదు.. కపట భేరి..

ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్

నవతెలంగాణ - కరీంనగర్

కేసీఆర్ కరీంనగర్‌లో నిర్వహించింది కదనభేరి కాదు కపటభేరి అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో కేసీఆర్ ప్రజలను పీడించారని, ఆయనను ప్రజలు ఎట్లా నమ్ముతారని అన్నారు. ప్రజాస్వామ్య పాలన కొనసాగించకుండా కుటుంబ పాలన కొనసాగించారని విమర్శించారు. కరీంనగర్ జిల్లాకు కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీ అన్నప్పుడు దేశంలో ఎందుకు ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తలేవు అని ఆయన ప్రశ్నించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు ఓట్లు వేయద్దు అని కోరారు.

ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించాలి

ఎస్సీ 57 ఉపకులాల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సిరిపాటి వేణు



నవతెలంగాణ - హుజూరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించాలని ఎస్సీ 57 ఉపకులాల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సిరిపాటి వేణు అన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన నాయకులతో కలసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 22 లక్షల జనాభా కలిగి ఉన్న ఎస్సీ 57 ఉపకులాలకు పోరాట సమితి జాతీయ అధ్యక్షుడైన బైరి వెంకటేశంను ఉపకులాల కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గడ్డం సమ్మయ్య, తూర్పాటి లింగయ్య, చింతల అంజి, వానరాశి జాన్, తదితరులు పాల్గొన్నారు.

దానాపూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌తో ప్రయాణికులకు మేలు

నవతెలంగాణ - జమ్మికుంట

దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు జమ్మికుంటలో హాల్టింగ్‌తో ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ నుండి దానాపూర్ వెళ్లే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కావడంతో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. ప్రధాని మోడీ, రైల్వే మంత్రి అశ్విన్ కుమార్, ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-కరీంనగర్

హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా హైదరాబాద్‌లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో 2 నెలల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రెనింగ్ ఇవ్వనున్నట్లు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబద్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ట్రెనింగ్ ప్రోగ్రాం పూర్తయిన తర్వాత ప్రయివేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్, 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమానికి కేవలం బీసీ అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టును ఈనెల 31న ఉమ్మడి జిల్లా కరీంనగర్‌లో నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎస్‌బీసీస్టడీసర్కిల్. సీజీజీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, సమాచారం కోసం 040-29303130ని సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

నవతెలంగాణ-కరీంనగర్

ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారంతో ముగిసాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇంటర్ పరీక్షల్లో భాగంగా బుధవారం మొదటి సంవత్సర విద్యార్థులకు జరిగిన పరీక్షలు ముగిసాయి. గురువారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు ముగియనున్నాయి. కరీంనగర్ జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ అధికారి జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. జనరల్‌లో 16525 మంది విద్యార్థులకు 16082 మంది, ఒకేషనల్‌లో 1277మందికి 1125 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 17802 మందికి 17207మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 1 మాల్ ప్రాక్టీస్ కేసు బుక్ అయినట్లు చెప్పారు. ఇండ్లకు దూరంగా హాస్టల్‌లో ఉంటూ చదివిన విద్యార్థులందరూ ఈ పరీక్షలు ముగియడంతో ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు హాస్టళ్లకు చేరుకొని తమ పిల్లలను స్వగృహాలకు తీసుకెళ్లారు.

సీఈసీల నియామకంపై అత్యవసర విచారణ

15న విచారించేందుకు సీజేఐ డివై చంద్రచూడ్ నిర్ణయం

ఈసీల నియామకానికి సెలక్షన్ కమిటీ సమావేశంపై అధిర్ రంజన్ చౌదరి లేఖ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఈసీ, ఈసీల నియామకాల అంశం మరోసారి వివాదానికి దారితీసింది. ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (సీఈ) నియామకాల కోసం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్ల అత్యవసర విచారణ చేపట్టాలని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) తాజాగా అభ్యర్థించింది. ఇందుకు అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. శుక్రవారం (మార్చి 15న) విచారణ జరుపుతామని వెల్లడించింది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో ఖాళీ అయిన కమిషనర్ల పోస్టులను ఈ నెల 15వ తేదీలోగా భర్తీ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్న వేళ.. ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెల ఒక కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. ఈ క్రమంలోనే ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది. ప్రధాని మోడీ, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి, కేంద్ర మంత్రి సభ్యులుగా ఉన్నా ఎంపిక కమిటీ మార్చి 15లోగా కొత్త కమిషనర్ల పేర్లను ఖరారు చేయనుంది. తాజా నియామకాలను సవాల్ చేస్తూ ఇటీవల కాంగ్రెస్ నేత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని కూడా శుక్రవారం విచారించనుంది.

కొత్త చట్టం

ఎన్నికల కమిషనర్ల నియామకాలపై పార్లమెంటులో చట్టం చేసేవరకు.. ప్రధానమంత్రి నేతృత్వంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కలిసి సీఈసీ, ఈసీ నియామకాలు చేపట్టాలని 2023 మార్చిలో అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకం, వారి సర్వీసు నిబంధనలకు సంబంధించి గతేడాది డిసెంబర్‌లో కేంద్రం కొత్త చట్టం అమల్లోకి తెచ్చింది. దాని ప్రకారం ఈసీల నియామక బాధ్యతలను సెర్చ్, ఎంపిక కమిటీలు నిర్వహించనున్నాయి. ఈ ఎంపిక కమిటీలో సీజేఐ స్థానంలో ప్రధాని సూచించిన కేంద్రమంత్రిని చేర్చింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

ఈసీల నియామకానికి సెలక్షన్ కమిటీ సమావేశంపై అధిర్ రంజన్ చౌదరి లేఖ

త్వరలో ఎన్నికల కమిషన్‌లో ఇద్దరు కొత్త కమిషనర్లు నియామకమయ్యే అవకాశం ఉన్నది. ఈనెల 15న ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సెలక్షన్ కమిటీ సమావేశం జరుగనున్నది. కమిషనర్ల నియామకం తరువాత సార్వత్రిక ఎన్నికల నగారా మోగనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో ఐదారు రోజులు పడుతుందని పేర్కొన్నాయి. సెలక్షన్ కమిటీ సమావేశానికి ముందు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదర్ న్యాయశాఖ మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఎలక్షన్ కమిషనర్ పదవికి ఎంపిక చేసిన అభ్యర్థుల బయోడేటాతో వివరాలను పంపాలని మంత్రిత్వ శాఖను కోరారు.

ఈ నెల 14న మధ్యాహ్నం 12 గంటలకు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసేందుకు హైపవర్ ప్యానెల్ సమావేశం జరుగుతుందని సమాచారం.

ఇదెక్కడి న్యాయం..?

- న్యాయమూర్తి పదవి ఇవ్వొద్దనడానికి రాజకీయ నేపథ్యం తగిన కారణం కాదు
- మనోజ్ పులంబి మాధవన్ సీపీఐ(ఎం) సానుభూతిపరుడనే కేంద్రం అభ్యంతరం
- తిరస్కరించిన సుప్రీంకోర్టు కొలీజియం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ హైకోర్టు న్యాయమూర్తి నియామకంపై కేంద్ర ప్రభుత్వ అభ్యంతరాన్ని సుప్రీంకోర్టు కొలీజియం తిరస్కరించింది. న్యాయమూర్తి పదవి ఇవ్వొద్దనడానికి రాజకీయ నేపథ్యం తగిన కారణం కాదని పేర్కొంది. న్యాయవాది మనోజ్ పులంబి మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదించింది. అయితే కొలీజియం ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. "మాధవన్ సీపీఐ(ఎం) సానుభూతిపరుడు. ఆయన ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం హయాంలో 2010, 2016-2021లో గవర్నమెంట్ ప్లీడర్‌గా కూడా పని చేశారు" అనే కారణంతో ఆయన అభ్యర్థిత్వాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు కొలీజియం "మాధవన్ సీపీఐ(ఎం) సానుభూతి పరుడిగా పరిగణిస్తారనే వాదన చాలా అస్పష్టంగా ఉంటుంది. ఆయనకు రాజకీయ నేపథ్యం ఉందనే వాస్తవం అన్ని సందర్భాల్లోనూ తగిన కారణం కాకపోవచ్చు" అని కేంద్రం సూచనను తిరస్కరిస్తూ కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. వాస్తవానికి, మాధవన్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేయడం వల్ల ఆయన వివిధ న్యాయ శాఖలలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉన్న కేసులను వాదించడంతో తగినంత అనుభవం సంపాదించి ఉంటాడని కొలీజియం తీర్మానం నొక్కి చెప్పింది. "ఉదాహరణకు ఇటీవల కాలంలో ఒక న్యాయవాది హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అయితే ఆమె ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ముందు ఆమె ఒక రాజకీయ పార్టీకి ఆఫీస్ బేరర్‌గా ఉన్నారు" అని తీర్మానంలో పేర్కొంది.

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఎల్ విక్టోరియా గౌరీ నియామకాన్ని కొలీజియం గుర్తు చేసింది. జస్టిస్ గౌరీ మద్రాసు హైకోర్టుకు న్యాయమూర్తిగా నియామకం కాక ముందు న్యాయవాదిగా ఉన్నప్పుడు బీజేపీలో ఉన్నారు. న్యాయమూర్తి పదవికి అనర్హులంటూ చేసే రాజకీయ నేపథ్యం ఆధారిత వాదనలను కొలీజియం తిరస్కరించింది. కేరళ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించేందుకు మాధవన్‌తో పాటు ఆరుగురు న్యాయవాదుల పేర్లను మార్చి 12న కొలీజియం సిఫారసు చేసింది. మాధవన్ షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆయన 35 తీర్పులను నివేదించారు. అయితే, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఆయన నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం అభ్యంతరాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. న్యాయమూర్తులలో కొందరికి ఆయన పనితీరును నేరుగా అంచనా వేయడానికి అవకాశం లేదని, కానీ మొత్తం అభిప్రాయం సానుకూలంగా ఉందని కొలీజియం పేర్కొంది.

ఆదివాసులకు వసతులు కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట బైటాయింపు



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురం భీం కాలనీలో నివాసముంటున్న ఆదివాసులకు పట్టాలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. బుధవారం ఆదివాసులు నోటికి నల్లగుడ్డలు కట్టుకొని ర్యాలీగా కలెక్టరేట్ వరకు వచ్చారు. ప్రధాన గేటు ఎదుట బైటాయించి నినాదాలు చేశారు. వీరి ఆందోళనకు బీజేపీ రాష్ట్ర నాయకులు చిట్యాల సుహాసినిరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ.. ఏండ్లుగా కుమురం భీం కాలనీ ఆదివాసులు పట్టాలు, మౌలిక వసతుల కోసం ఉద్యమాలు చేస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రావడం లేదన్నారు. ఇలానే నిర్లక్ష్యం చేస్తే ఆదివాసులు మరో మిలిటెంట్ ఉద్యమం చేయాల్సి వస్తుందన్నారు. కాలనీలో నివాసం ఉంటున్న వారికి జీవో 58 ప్రకారం పట్టాలు జారీ చేయడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు చిట్యాల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదివాసుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్పందించి ఆదివాసులకు మౌలిక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గోడం నగేష్‌కు బీజేపీ టికెట్..!

- సిట్టింగ్ ఎంపీ సోయంకు తప్పని నిరాశ
- త్వరలోనే నా నిర్ణయం వెల్లడిస్తా : బాపురావు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో బీజేపీ నుంచి గోడం నగేష్ బరిలో దిగనున్నారు. బీఆర్ఎస్ నుంచి ఇటీవల కమలం పార్టీ తీర్థం పుచ్చుకున్న ఆయనకు ఆ పార్టీ అధిష్టానం బుధవారం టికెట్ ఖరారు చేసింది. దీంతో ఆ పార్టీ తరపున ప్రస్తుతం ఎంపీగా ఉన్న సోయం బాపురావుకు నిరాశ ఎదురైంది. ఒకటి, రెండ్రోజుల్లో ఆయన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది. ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది. "నా వ్యూహం నాకుంది. ప్రస్తుతం బీజేపీలో ఉన్నాను. త్వరలోనే నా నిర్ణయాన్ని వెల్లడిస్తాను" అని సోయం బాపురావు తెలిపారు.

ఉద్యోగ సంఘాలతో నేడు మంత్రివర్గ ఉపసంఘం భేటీ

- 317 జీవో సమస్యలపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలతో గురువారం సాయంత్రం ఐదు గంటలకు హైదరాబాద్‌లోని సచివాలయంలో 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కానుంది. ఉపసంఘం చైర్మెన్ దామోదర రాజనర్సింహ,సభ్యులు మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొంటారు. 317, 46 జీవోల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఇదే విషయంపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి వర్గ ఉపసంఘం మంగళవారం సమావేశమై పలు అంశాలను చర్చించిన విషయం తెలిసిందే. 317 జీవోలోని లోటుపాట్లు, పలు అంశాలపై లోతుగా అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఫిర్యాదులను స్వీకరించడానికి గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలనీ, రాష్ట్ర సర్వీసెస్ శాఖ సెక్రెటరీ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ప్రకటించారు.

తాగునీటి కోసం కర్నాటక సీఎంని కలుస్తాం

అధికారులు, కౌన్సిలర్లు బాధ్యతగా పనిచేయాలి

తాగునీటి, విద్యుత్ అధికారుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ -నల్లగొండ టౌన్



రాష్ట్రానికి తాగునీటి కోసం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో త్వరలోనే కర్నాటక ముఖ్యమంత్రిని కలుస్తామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని బుధవారం నల్లగొండ మున్సిపాలిటీలో తాగునీరు, విద్యుత్ సరఫరాలపై కౌన్సిలర్లు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా 3 నెలల పాటు మున్సిపల్, మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో అధికారులు, కౌన్సిలర్లు బాధ్యతగా పని చేయాలని సూచించారు. వర్షాలు లేక ఈ సంవత్సరం బోర్లన్నీ ఎండిపోయాయని, ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

25 ఏండ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదని, అందువల్ల నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని అందరూ బాధ్యతగా పని చేయా లని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నచోట తక్షణమే పరిష్కరించాలని, విద్యుత్ లైన్లు మార్చాల్సిన చోట, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర మెటీరియల్ అవస రమైతే బడ్జెట్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. కొన్ని వార్డులలో తాగునీటికి ఇబ్బందిగా ఉందని, పట్టణంలో రోజు విడిచి రోజు 20 నుంచి 30 నిమిషాలు తాగు నీరు సరఫరా అవుతోందని, కొన్నిచోట్ల లీకేజీలు అవుతున్నాయని, వాటిని అరికట్టాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన మాట్లాడుతూ.. తాగునీటి సమస్యలు ఉంటే అవసరమైతే అదనపు ట్యాంకర్లను పంపించి సరఫరా చేస్తామని, అయితే నీటిని పొదుపుగా.. జాగ్రత్తగా వినియోగించుకోవాలని అన్నారు. అంతకుముందు మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు జిల్లాలో ప్రస్తుతం తాగునీటి సరఫరాపై వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ డి.రాజ్యలక్ష్మి, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, ఆర్డీఓ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ రంగాల్లో 250 స్టార్టప్‌లు

- 2029 కల్లా 50 వేల కొత్త ఉద్యోగాల కల్పన
- ఎవిజిసి-ఎక్స్ఆర్ విధానాన్ని ఆమోదించిన కేరళ క్యాబినెట్

తిరువనంతపురం : యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెండ్ రియాల్టీ (ఎవిజిసి-ఎక్స్ఆర్) విధానాన్ని కేరళ కాబినెట్ బుధవారం ఆమోదించింది. ఈ విధానం కింద ఇటువంటి 250 కంపెనీలను నెలకొల్పి, విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా వుంది. 2029 నాటికల్లా ఈ రంగంలో కొత్తగా 50వేల ఉద్యోగాలను సృష్టించాలని భావిస్తున్నారు. దీని ద్వారా ఎవిజిసి-ఎక్స్ఆర్ పరిశ్రమలో భారతదేశ ఎగుమతి ఆదాయాల్లో 10శాతం వాటా రాష్ట్రానికి వుండాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ రంగంలో అభివృద్ధి సాధించేందుకు కేరళ స్టార్టప్ మిషన్, కేరళ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్, కేరళ డిజిటల్ యూనివర్శిటీ, కేరళ రాష్ట్ర చలనచిత్రాభివృద్ధి సంస్థ, కేరళ టెక్నికల్ యూనివర్శిటీ, కేరళ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇమేజింగ్ టెక్నాలజీ, కేరళ డెవలప్‌మెంట్ ఇన్నొవేషన్ స్ట్రాటజీ కౌన్సిల్, కేరళ నాలెడ్జ్ ఎకనామీ మిషన్‌లు సంయుక్తంగా కృషి చేయనున్నాయి. స్టార్టప్ మిషన్ ప్రారంభిస్తున్న టెక్నాలజీ హబ్‌ను కూడా విస్తరించనున్నారు. ఈ రంగానికి సంబంధించిన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (సీఓఈ)ని కూడా తిరువనంతపురంలో ప్రారంభిస్తారు. నైపుణ్యాల అభివృద్ధికి, కొత్త కొత్త ఆవిష్కరణలు, వినూత్న పరిశోధనలు, అభివృద్ధికి ఈ సెంటర్ ఒక చుక్కానిలా వ్యవహరిస్తుంది.

ఎవిజిసి-ఎక్స్ఆర్ ల్యాబ్‌ల డిజిటల్ పోస్ట్ ప్రొడక్షన్‌కు ఈ సిఓఇ అవసరమైన మౌలిక సదుపాయాలను అందచేస్తుంఇ. మోషన్ కేప్చర్, 2డి, 3డి యానిమేషన్ వంటి పోస్ట్ ప్రొడక్షన్ సాంకేతికతలను, హై స్పీడ్ రెండరింగ్‌తో పాటూ ఇతర సదుపాయాలను అందచేస్తుంది. కొత్తగా తలెత్తే ధోరణులపై దృష్టి పెడుతూ పరిశ్రమలోని నిపుణులతో భాగస్వామ్యం కలిగి పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు చేపడుతుంది. ఈ రంగంలో పారిశ్రామికా భివృద్ధికి రూ.200కోట్ల నిధులు కేటాయిస్తారు. పరిశోధనకు రూ.50కోట్లను అందచేయనుంది. ఈ రంగంలోని కళాకారులతో సహకార సంస్థలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

బేర్ పంజా

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ భారీ పతనాన్ని చవి చూసింది. అమ్మకాల ఒత్తిడితో 906 పాయింట్లు లేదా 1.23 శాతం క్షీణించి.. 72,762కు దిగజారింది. ఇంట్రాడేలో 1300 పాయింట్లు మేర పతనమయ్యింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 338 పాయింట్లు లేదా 1.5 శాతం కోల్పోయి 21,998 వద్ద ముగిసింది. ఒక్క పూటలోనే రూ.14 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరయ్యింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. 11 గంటల తర్వాత ఒక్క సారిగా నష్టాల వైపు జారుకున్నాయి. ఆ తర్వాత ఏ స్థాయిలోనూ కోలుకోలేకపోయాయి. గడిచిన మూడు సెషన్లలో బీఎస్ఈ మార్కెట్ కాపిటలైజేషన్ రూ. 20.69 లక్షల కోట్లు హరించుకుపోయి.. రూ.372 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. అంటే దాదాపు రూ.21 లక్షల కోట్లు మదుపర్లు నష్టపోయారు.

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటి నుంచి దలాల్ స్ట్రీట్‌లో సెగలు మొదలయ్యాయి. ఏఏ కార్పొరేట్ కంపెనీలు ఏ ప్రధాన పార్టీకి కొమ్ముగాశాయనే వివరాలు వెల్లడి కానున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా అమ్మకాలకు దిగుతున్నారు. కాగా.. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ పరిణామం చోటు చేసుకోవడం బీజేపీ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోన్నాయని విమర్శకులు అభిప్రాయ పడుతున్నారు. అదానీ షేర్లు భారీ పతనాన్ని చవి చూస్తున్నాయి. పేటీఎం, అదానీ పవర్ సహా 1,010 స్టాక్స్ లోహర సర్క్యూట్‌ను తాకడం గమనార్హం.

బుధవారం సెషన్‌లో బీఎస్ఈలో 290 షేర్లు మాత్రమే రాణించగా.. 3,202 స్టాక్స్ పతనాన్ని చవి చూశాయి. మరో 38 సూచీలు యథాతథంగా నమోదయ్యాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఏకంగా 6.81 శాతం క్షీణించి రూ.2,909.80కి దిగజారింది. గడిచిన ఐదు సెషన్లలో ఈ సూచీ 11.52 శాతం నష్టాన్ని చవి చూసింది. ఒక్క పూటలోనే అదాని గ్రీన్ ఎనర్జీ సూచీ 8.33 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 9.14 శాతం, అదానీ పవర్ 5 శాతం, అదానీ పోర్ట్స్ 6.47 శాతం చొప్పున పతనమయ్యాయి. సెన్సెక్స్ 30లో ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, కొటాక్ మహీంద్రా బ్యాంక్, నెస్లే ఇండియా ఇండియా షేర్లు లాభపడ్డాయి. మరోవైపు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, టాటా మోటార్స్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్ నష్టాలను చవి చూశాయి. అన్ని రంగాల సూచీలు నేల చూపులు చూశాయి. రియాల్టీ, మీడియా, పిఎస్‌యు బ్యాంక్, టెలికాం, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్ రంగాలు 4-6 శాతం పతనమయ్యాయి. సెబీ చీఫ్ వ్యాఖ్యల నేపథ్యంలో స్మాల్, మిడ్ క్యాప్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు 5 శాతం, 4 శాతం చొప్పున పడిపోయాయి. మార్కెట్ల వరుస పతనం నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

15న ఎల్బీ స్టేడియంలో సీఎం ఇఫ్తార్ విందు

ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పవిత్ర రంజాన్ మాసంలో తొలి శుక్రవారమైన ఈ నెల15న ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ బుధవారం సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇఫ్తార్ విందులో ముస్లీం సోదరుల నమాజ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరికీ భోజన ఇతర సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.



రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే కమ్యూనిస్టుల కర్తవ్యం

- సమస్యలపై పోరాటాల ద్వారానే ప్రజా మద్దతును పొందగలుగుతాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం

మతోన్మాద శక్తుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే నేడు కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యంగా ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొమ్ము శ్రీను అధ్యక్షతన జరిగిన పాలేరు నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. దేశంలో మతోన్మాదశక్తులు రాజ్యాంగాన్ని మార్చేందుకు, అసలు రాజ్యాంగమే లేకుండా మనువాదాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, దాన్ని తిప్పికొట్టడం కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యంగా ఉండాలన్నారు. ఒకవైపు మతోన్మాద శక్తులను ఎదుర్కొంటూనే మరోవైపు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని, పోరాటాలతోనే ప్రజా మద్దతును పొందగలుగుతామని స్పష్టంచేశారు. ప్రస్తుతం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కార్యకర్తలు అహర్నిశలు పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశాన్ని దోచుకుంటున్న బీజేపీ.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పక్కదారి పట్టించేందుకు అనేక రకాలుగా మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నదని, ఆ రాజకీయాల్లో పడి దేశ ప్రజలు మోసపోవద్దన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేశాకే ఓటు అడగాలని ప్రజా ప్రతినిధులను ప్రశ్నించాలని తెలిపారు. వేసవి తీవ్రతతో నీళ్ళు లేక పంటలు ఎండిపోతున్నందున ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీల అమలులో అవకతవకలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, నండ్ర ప్రసాద్, ఊరడి సుదర్శన్ రెడ్డి, గొడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఎడవల్లి రమణారెడ్డి, మండల నాయకులు అంగిరేకుల నరసయ్య, వశపొంగు వీరన్న, తుశ్లూరు నాగేశ్వరరావు, దాసరి మహేందర్, బింగి రమేష్, మల్లెల సన్మతరావు, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం

- ఎలక్టోరల్ బాండ్ల వివరాలు గడువులోగా వెల్లడిస్తాం :సీఈసీ రాజీవ్ కుమార్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


ఎలక్టోరల్ బాండ్ల వివరాలను గడువు లోగా బహిర్గతం చేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ అన్నారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలు సుప్రీం కోర్టు గడువులోగా వెల్లడిస్తామని తెలిపారు. బుధవారం జమ్మూ కాశ్మీర్‌లో మీడియాతో ఆయన అన్నారు. ఎస్‌బీఐ నుంచి ఆ సమాచారం అందిన విషయాన్ని ధ్రువీ కరించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తామని చెప్పా రు. జమ్మూ కాశ్మీర్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లు ఈ ప్రజాస్వామ్య పండగలో ప్రతిఒక్కరూ ఎంతో ఆసక్తిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నామని సీఈసీ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. తప్పుడు వార్తలపై ఎప్పటికప్పుడు స్పందించేందుకు గాను ప్రతీ జిల్లాలో ఒక సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభ్యర్థులందరికీ సరైన భద్రత సమకూర్చడంతోపాటు కేంద్ర బలగాలను దింపుతామన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆన్‌లైన్ నగదు బదిలీపైనా పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. 'మార్చి 12 నాటికి ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల డేటా అందించాల్సి ఉండగా, ఆ వివరాలు మాకు అందాయి. ప్రజలకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. కమిషన్ అనేది పారదర్శ కతకు ఎప్పుడూ అనుకూలమే. గడువులోగా దాన్ని బహిర్గతం చేస్తాం' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు.

నేటితో ముగియనున్న ఇంటర్ ప్రధాన పరీక్షలు

- 22,409 మంది విద్యార్థుల గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ప్రధాన పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. గతనెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 19 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. గురువారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-2 పరీక్షలు కొనసాగుతాయి. రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-1 పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 5,14,400 మంది దరఖాస్తు చేయగా, 4,91,991 (95.7 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 22,409 (4.3 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఒకరు, జగిత్యాలలో ఎనిమిది మంది, నిజామాబాద్‌లో ఇద్దరు, వికారాబాద్‌లో ఒకరు కలిపి మొత్తం 12 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం మ్యాథమెటిక్స్, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్-1 పరీక్షకు సెట్ సీ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు.




బీఆర్ఎస్ హయాంలో పది రెట్ల అప్పుల భారం

- కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్‌తో బీడు భూములు సస్యశ్యామలం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అప్పుల భారాన్ని 10రెట్లు పెంచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామంలో రూ.47.54 కోట్లతో ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, రూ.5.30 కోట్లతో ఉత్తమ్ పద్మావతి శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పునరుద్ధరణ కార్యక్రమాలకు మంత్రులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా శాంతినగర్, రెడ్లకుంట్ల గ్రామాల్లో పదివేల ఎకరాల వరకు పంటలు సాగు చేసే అవకాశం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 3,500 మంది నిరుపేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు అందివ్వనున్నట్టు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మార్చి ఒకటో తేదీ నుంచి తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. కోదాడలో పట్టణంలో రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, పాండు రంగారావు, యెర్నేని బాబు, రామారావు, పార సీతయ్య, సాధినేని అప్పారావు, గంగావరపు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాబుదానా అనగానే అదేదో ఒక పంట నుండి వచ్చిందని లేదా మొక్కలకు పండుతుందని అనుకుంటారు చాల మంది. సాబుదానా దేన్నుంచి తయారవుతుంది? దాని ముడిసరుకేంటి? అని ఎప్పుడైనా ఆలోచించారా? సాబుదానా 'కర్ర పెండలం' అనే దుంప నుంచి తయారవుతుంది. సాబుదానాలో రెండు రకాలు ఉంటాయి. వేయించి, ఎండబెట్టే సాధారణ సాబుదానాతోపాటు.. ఆవిరి మీద ఉడికించి ఎండబెట్టే నైలాన్ సాబుదానా కూడా ఉంటుంది. ఈ రెండు రకాల సాబుదానాలు మూడు సైజుల్లో తయారవుతాయి. మన దేశంలో తమిళనాడులోని సాలెం, ఆంధ్రప్రదేశ్‌లోని సామర్లకోటల్లో ఇవి తయారవుతున్నాయి.



సాబుదానాతో ఆరోగ్యంగా..

తెల్లటి ముత్యాల మాదిరిగా కనిపించే సాబుదానాలో ఎన్నో పోషకాలు దాగున్నాయి. సాబుదానా రోజూ తింటే.. ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

సాబుదానా తయారీ విధానం : కర్ర పెండలాన్ని తొక్కు తీసి దంచి చిన్న ముక్కలుగా చేస్తారు. ఈ ముక్కలను పెద్ద పెద్ద ట్యాంకుల్లో నానబెడతారు. తర్వాత మూడు నుంచి 8 గంటలపాటు కదల్చకుండా ఉంచితే అడుగున గంజిలాంటి పదార్థం పేరుకుంటుంది. దీన్ని సేకరించి ఎండబెట్టి ఫ్యాక్టరీకి తరలిస్తారు. ఉండలుగా తయారుచేసి పాలిష్ పడతారు. తర్వాత సోలార్ డ్రయింగ్ చేస్తారు. ఈ ప్రాసెస్‌తో చివరికి తెల్లని ముత్యాల్లాంటి సాబుదానా తయారవుతాయి.

ప్రయోజనాలెన్నో...

సాబుదానాలో ప్రొటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిలోని పిండిపదార్థాలు రోజంతటికి కావాల్సిన శక్తిని శరీరానికి అందిస్తాయి. జీర్ణవ్యవస్థ పనితీరుపైనా ప్రభావం చూపుతాయి. తద్వారా మలబద్ధకం లాంటి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

ఎముకలను బలంగా మారుస్తాయి: సాబుదానా రోజూ తింటే ఎముకలు ధృఢంగా మారుతాయి. ఇందులో అధిక మొత్తంలో కాల్షియం, మెగ్నీషియం ఉంటుంది. ఇది ఎముకల పెరుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇది కాకుండా, వీటిలో ఐరన్ కూడా ఉంటుంది. ఇది బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

రక్తపోటును నియంత్రిస్తాయి: అధిక రక్తపోటు సమస్యను అధిగమించాలనుకుంటే సాబుదానా తినాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో ఫైబర్, ఫాస్పరస్, పొటాషియం, ఫాస్పరస్ ఉన్నాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంతో పాటు శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తాయి.

మెదడుకు మేలు: సాబుదానా తినడం వల్ల మంచి శారీరక అభివృద్ధి జరగడమే కాకుండా మెదడు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇందులో ఉండే ఫోలేట్ మెదడు సమస్యలను దూరం చేస్తుంది.

శాకాహారులకు శరీరానికి తగినన్ని మాంసపుకృత్తులు అందవు. ఇలాంటప్పుడు సాబుదానా రోజూ ఏదో ఒక రూపంలో ఆహారంలో భాగం చేసుకోవాలి. తద్వారా వాటిలోని మాంసపుకృత్తులు శక్తినివ్వడమే కాదు.. కండరాలు ఆరోగ్యంగా ఉండేందుకూ సహాయపడతాయి.

సాబుదానాతో వివిధ రకాల వంటకాలను తయారు చేసుకోవచ్చు. ముఖ్యంగా వీటి ద్వారా కిచిడీ, పాయసం, గంజి వంటివి తయారు చేస్తారు. చాలామంది దీనిని ఉపవాస సమయంలో తినడానికి ఇష్టపడతారు.

సగ్గుబియ్యంతో పాయసం, వడతోపాటు వివిధ రకాల వంటకాలను తయారుచేస్తుంటారు. వాటి గూర్చి తెలుసుకుందాం....

పరాఠా

కావలసిన పదార్థాలు :
సాబుదానా - ఒక కప్పు, పల్లీలు - అర కప్పు, నీళ్లు - ఒక కప్పు, పచ్చి మిర్చి - రెండు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగు, ఉడికించిన ఆలు - రెండు, కొత్తిమీర - ఒక టీ స్పూను, జీలకర్ర - ఒక టీ స్పూను, ఎండు మిర్చి - రెండు, ఉప్పు - తగినంత, నూనె - తగినంత.



తయారీ విధానం:
ఒక పాత్రలో సాబుదానా వేసి రెండుమూడు సార్లు బాగా కడిగి, నీరు వంపేయాలి. స్టౌ మీద బాండీలో పల్లీలు వేసి బాగా వేయించి చల్లార్చాలి. మిక్సీ జార్‌లో పల్లీలు, పచ్చి మిర్చి, వెల్లుల్లి వేసి బరకగా మిక్సీ పట్టి సాబుదానాలో కలపాలి. ఉడికించిన ఆలు, కొత్తిమీర, జీలకర్ర, కారం, ఉప్పు జత చేసి బాగా కలపాలి.


పాలిథిన్ కవర్ మీద కానీ, బటర్ పేపర్ మీద కానీ కొద్దిగా నూనె పూయాలి.

తయారుచేసి ఉంచుకున్న మిశ్రమాన్ని కొద్దిగా తీసుకుని, గుండ్రంగా రొట్టెలా ఒత్తుకోవాలి.

స్టౌ మీద పెనం వేడయ్యాక కొద్దిగా నూనె వేసి తయారుచేసి ఉంచుకున్న పరాఠాను మీడియం మంట మీద రెండువైపులా కాల్చుకోవాలి.

ఉప్మా

కావలసిన పదార్థాలు : సాబుదానా ఒక కప్పు. పల్లీ పొడి - ఒక కప్పు, పచ్చిమిర్చి - 4, పచ్చికొబ్బరి తురుము 2 స్పూన్లు, ఆవాలు, జీలకర్ర - తాలింపుకు, నిమ్మరసం : 3 స్పూన్లు, నూనె, ఉప్పు : తగినంత, కరివేపాకు : ఒక రెమ్మ, నీళ్లు తగినన్ని.



తయారీ విధానం:
సగ్గుబియ్యం గంటపాటు నీళ్లలో నానబెట్టాలి.

బాండీలో నూనె పోసి ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. తర్వాత సగ్గు బియ్యం, పల్లీ పొడి, ఉప్పు వేయాలి. కొద్దిగా ఉడికాక తగినన్ని నీళ్లు పోసి చిన్న మంట మీద దగ్గరగా అయ్యే వరకూ ఉడికించాలి.

చివర్లో కొబ్బరి, నిమ్మరసం వేసి కలిపి దింపేయాలి.

పొంగనాలు

కావలసినవి: సాబుదానా- ఒక కప్పు, ఉడికించిన ఆలు - రెండు, కొత్తి మిర తరుగు - ఒక టీ స్పూన్, పచ్చి మిర్చి తరుగు - ఒక టీ స్పూను, అల్లం తురుము -ఒక స్పూను, జీలకర్ర -ఒక టీ స్పూన్, ఉప్పు - తగినంత, నూనె- తగినంత.




తయారీ విధానం :
నూనె లేకుండా సాబుదానాను రెండు నిమిషాలు బాండీలో వేయించాలి (తడి పోయి పొడి చేయడానికి వీలుగా ఉంటుంది). ప్లేట్‌లో పోసి చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా పొడి చేయాలి. ఈ పొడి పిండిలో కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ, దోసెల పిండి కంటె కొద్దిగా గట్టిగా కలుపుకోవాలి.

ఒక పాత్రలో ఆలూ వేసి మెత్తగా చేసుకోవాలి. సగ్గు బియ్యం పిండి జత చేసి కలపాలి. కొత్తిమీర తరుగు, పచ్చి మిర్చి తరుగు జత చేసి మరోమారు కలుపుకోవాలి. అల్లం తురుము, జీలకర్ర, ఉప్పు జత చేసి మరోమారు బాగా కలపాలి. కొద్దిగా నీళ్లు జతచేసి దోసెల పిండిలా అయ్యేలా కలిపి మూత ఉంచి, సుమారు అర గంట సేపు నానబెట్టాలి. స్టౌ మీద పొంగనాల స్టాండ్ ఉంచి, నూనె పూసి, ఒక్కో గుంటలోను తగినంత పిండి వేసి, మూత పెట్టాలి. మీడియం మంట మీద సుమారు పది నిమిషాలు ఉంచాక, పొంగనాలను తిరగేసి, మరో ఐదు నిమిషాలు ఉంచి తీసేయాలి.

కట్లెట్

కావలసిన పదార్థాలు: సాబుదానా - ఒకటిన్నర కప్పులు, ఉడికించిన ఆలుగడ్డ - ఒకటి, పచ్చిమిర్చి - రెండు, పల్లీల పొడి - అర కప్పు

జీలకర్ర - అర టీస్పూను, ఉప్పు, నూనె - సరిపడా, కొత్తిమీర, పుదీనా - కొద్దిగా.



తయారీ విధానం:
సాబుదానా మునిగేలా నీళ్లుపోసి 3 గంటలు నాన బెట్టాలి.

కొత్తిమీర, పుదీనా సన్నగా తరగాలి..

ఒక గిన్నెలో ఆలుగడ్డ, పచ్చిమిర్చి ముక్కలు, పుదీనా, కొత్తిమీర తురుము, పల్లీల పొడి, ఉప్పు, నానిన సగ్గుబియ్యం వేసి బాగా కలపాలి. అందులో నీళ్లు పోయకూడదు. పొయ్యి మీద నాన్ స్టిక్ పాన్ పెట్టి వేడిచేయాలి. సగ్గుబియ్యం ముద్దను కొద్దిగా చేతిలోకి తీసుకుని వెడల్పుగా వత్తి పాన్ మీద ఉంచి నూనె పోసి రెండు వైపులా కాల్చాలి. సాస్ లేదా చట్నీతో వేడివేడిగా తింటే భలేగా ఉంటాయి.

బూరెలు

కావలసిన పదార్థాలు:
సాబుదానా : పావు కిలో, మైదా 100 గ్రా., బెల్లం -పావు కిలో, యాలుకలు 10, కొబ్బరి తురుము - 2 స్పూన్లు, పాలు- ఒక గ్లాసు, నూనె - సరిపడా



తయారీ విధానం:
సాబుదానాను పాలల్లో మూడు గంటలు నానబెట్టాలి. మైదా పిండిని జల్లించి పెట్టుకోవాలి. బెల్లం సన్నగా తరగాలి. యాలుకలను పొడికొట్టి పెట్టుకోవాలి. మైదాపిండి, బెల్లం తురుము, కొబ్బరి తురుము, యాలకుల పొడి, సగ్గుబియ్యంలో వేసి బాగా కలపాలి.

బాండీలో నూనె పోసి కాగాక సాబుదానా మిశ్రమంతో ఉండలుచేసి బూరెల్లా నూనెలో వేయించుకోవాలి. ఇవి సాగుతున్నట్టుగా ఉంటాయి. అయినా చాలా రుచిగా ఉంటాయి. ఇవి వారం రోజులపాటు నిల్వ ఉంటాయి.

కాంగ్రెస్ నారీ న్యాయ్ గ్యారంటీ

(మొదటిపేజీ తరువాయి)

పోస్ట్‌లో షేర్ చేసిన వీడియోలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఇప్పటికే భాగస్వామ్య న్యాయం, రైతు న్యాయం, యువత న్యాయంపై కాంగ్రెస్ తన హామీలను ప్రకటించిందని ఖర్గే వివరించారు. ప్రత్యర్థులు పుట్టినప్పుడు మేం మేనిఫెస్టోలు రూపొందించి, ఆ ప్రకటనలను నెరవేరుస్తున్నామనీ, ఇది 1926 నుంచి ఇప్పటి వరకు మా రికార్డు అని ఆయన వీడియోలో చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే ఈ పోరాటంలో మీరందరూ కాంగ్రెస్ పార్టీకి మీ ఆశీస్సులు అందిస్తూ, బలోపేతం చేయాలని ఖర్గే అన్నారు. మహారాష్ట్రలోని ధూలేలో జరిగిన 'మహిళా సదస్సు'లో కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ ప్రకటనలు చేశారు.

- "మహాలక్ష్మి" హామీ కింద, ప్రతి పేద కుటుంబం నుంచి ఒక మహిళకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా సంవత్సరానికి రూ. 1 లక్ష రూపాయల సహాయం అందనున్నది.
- "ఆదీ ఆబాదీ పూరా హక్" కింద కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం కొత్త రిక్రూట్‌మెంట్‌లలో మహిళలకు రిజర్వ్ చేయనున్నది.
- "శక్తి కా సమ్మాన్" హామీ కింద ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలవారీ వేతనానికి కేంద్రం ఇచ్చే సహకారం రెట్టింపు అవుతుందని ఖర్గే తెలిపారు.
- "అధికార్ మైత్రి" హామీ కింద, కాంగ్రెస్ ప్రతి పంచాయతీలో "అధికార్ మైత్రి"ని నియమిస్తుంది. ఇది మహిళలకు వారి చట్టపరమైన హక్కుల గురించి అవగాహన కల్పించటానికి, వాటిని అమలు చేయటంలో వారికి సహాయం చేయటానికి పారా లీగల్ కార్యకర్తగా పని చేస్తుంది.
- "సావిత్రి బాయి పూలే హాస్టల్స్" హామీ కింద, దేశంలోని వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తుంది. ప్రతి జిల్లాలో కనీసం ఒకటి ఉంటుంది.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు

- బడుల్లో వసతులు, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం
- స్వయం సహాయక బృందాలకు నిర్వహణ బాధ్యత
- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ)లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. పాఠశాలల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ)కు అప్పగించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చడమే కాకుండా వాటిలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని తెలిపారు. విద్యాశాఖపై ప్రత్యేక దృష్టిసారించామని పేర్కొన్నారు. అందులో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి, వాటిద్వారా బడులను బలోపేతం చేస్తామని వివరించారు. అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలనీ, ఆ పనులను పర్యవేక్షించాలనీ, బడులను బలోపేతం చేసేందుకు ఆ కమిటీల సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యం, పాఠశాలల్లో పారిశుధ్యం నిర్వహణ వంటి పనులను ఆ కమిటీలు పర్యవేక్షిస్తాయని వివరించారు. భారీ, చిన్న తరహా మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ బిల్లులను తగ్గించడం కోసం సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, యూనిఫారాలను కుట్టడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. గ్రామసంఘం/ఫెడరేషన్ ప్రాంత స్థాయి అధ్యక్షులు ఆ కమిటీలకు అధ్యక్షులుగా, ఆ పాఠశాల హెచ్‌ఎం సభ్యకార్యదర్శిగా వ్యవహరిస్తారని వివరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించడంతోపాటు పాఠశాల నిర్వహణ బాధ్యత పూర్తిగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలే చూస్తాయని పేర్కొన్నారు.

22,217 బాండ్లు జారీ

(మొదటిపేజీ తరువాయి)

తీర్పు ఇచ్చిన తేదీ) 22,217 బాండ్లు జారీ చేశానని ఎస్‌బీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. వీటిలో రాజకీయ పార్టీలు 22,030 బాండ్లను నగదుగా మార్చుకున్నాయని చెప్పింది. నిబంధనల ప్రకారం మిగిలిన 187 బాండ్లను నగదుగా మార్చి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధిలో జమ చేశామని తెలిపింది.

రద్దయిన ఎన్నికల బాండ్ల పథకం కింద దాతలు ఏదైనా రాజకీయ పార్టీకి విరాళం అందించేందుకు ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చు. అయితే ఆయా పార్టీలు వాటిని పదిహేను రోజులలో నగదుగా మార్చుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఆ మొత్తాన్ని ప్రధానమంత్రి సహాయ నిధికి జమ చేస్తారు.

కాగా ఎన్నికల బాండ్లను ఎవరు కొనుగోలు చేశారు? ఏ తేదీన కొనుగోలు చేశారు? వాటి విలువ ఎంత? ఆ బాండ్లను ఏయే రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నాయి? ఏ తేదీన మార్చుకున్నాయి? వాటి విలువ ఎంత? వంటి వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్‌కు అందజేశానని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎస్‌బీఐ తెలిపింది. అయితే ఎన్నికల బాండుపై ఉన్న యూనిక్ కోడ్ విషయాన్ని మాత్రం అందులో ప్రస్తావించలేదు. పార్టీలకు అందిన ప్రతి విరాళాన్నీ ఈ యూనిక్ కోడ్‌తో సరిపోల్చాల్సి ఉంటుంది.

ఎస్‌బీఐ అందజేసిన పీడీఎఫ్ ఫైల్స్‌ను పరిశీలించడానికి ఒక కమిటీని నియమించే అవకాశం ఉన్నదని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. ఎస్‌బీఐ అందజేసిన ఫార్మట్‌లోనే సమాచారాన్ని ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని చెప్పాయి. ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు జమ్మూకాశ్మీర్ పర్యటనకు వెళ్లిన ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ గురువారం ఉదయం ఢిల్లీలోని కార్యాలయానికి చేరుకుంటారు.

లేఖ రాసేందుకు ఆయనకు అధికారం ఇవ్వలేదు
సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వివరణ

ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేయాలంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అదిష్ అగర్వాల రాసిన లేఖ గందరగోళం సృష్టించిన నేపథ్యంలో ఆ సంఘం వివరణ ఇచ్చింది. రాష్ట్రపతికి లేఖ రాసేందుకు తాము అగర్వాలకు అధికారం ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల వ్యవహారంపై న్యాయస్థానం మరోసారి విచారణ జరిపే వరకూ సుప్రీంకోర్టు తీర్పును నిలిపివేయాలని మంగళవారం ముర్ముకు రాసిన లేఖలో అగర్వాల విజ్ఞప్తి చేశారు.

'రాజ్యాంగపరమైన ప్రతిష్టంభనను కలిగించే విధంగా తీర్పులు వెలువరించడానికి సుప్రీంకోర్టును అనుమతించకూడదు. పార్లమెంట్ ఔన్నత్యాన్ని దెబ్బతీసే విధంగా తీర్పులు ఇవ్వడాన్ని అనుమతించకూడదు. పార్లమెంటులో ప్రజాప్రతినిధులందరూ కలిసి తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడాన్ని అనుమతించకూడదు. రాజకీయ పార్టీల పనితీరును ప్రశ్నించేలా తీర్పులు ఇవ్వకూడదు' అని ఆయన ఆ లేఖలో అభిప్రాయపడ్డారు. వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన కార్పొరేట్ సంస్థల వివరాలను బహిర్గతం చేస్తే అవి కక్షసాధింపు చర్యలకు గురయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు.

ఈ లేఖపై బార్ అసోసియేషన్ స్పందిస్తూ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ఆల్ ఇండియా బార్ అసోసియేషన్ ఛైర్మన్ హోదాలో అగర్వాల ఈ లేఖ రాసినట్లు కన్పిస్తోందని తెలిపింది. అయితే కమిటీ సభ్యులు ఆయనకు అలా లేఖ రాసే అధికారం ఇవ్వలేదని, అంతేకాక ఆ లేఖలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలను వారెవ్వరూ సమర్థించడం లేదని స్పష్టం చేసింది. అగర్వాల్ చర్య, ఆయన రాసిన లేఖలోని వివరాలు సుప్రీంకోర్టు అధికారానికి భంగకరంగా ఉన్నాయని, ఈ చర్యను తాము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నామని బార్ అసోసియేషన్ ఆ తీర్మానంలో తెలియజేసింది.

డాక్టర్ ఎన్.సుధాకర్ రావు మరణం

- హరీశ్ రావు సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మెన్ డాక్టర్ ఎన్.సుధాకర్ రావు బుధవారం సాయంత్రం మరణించారు. ప్రముఖ వైద్యులు సుధాకర్ రావు మూత్రపిండ సమస్యతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించింది. ఆయన్ను వెంటనే ఐసీయూకి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించారు.

సంతాపం

మాజీ శాసన సభ్యులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మెన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు మరణం బాధాకరమంటూ మాజీ మంత్రి హరీశ్ రావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హీట్ పెంచుతున్న ఎంపీ సీట్లు..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, బస్వరాజు సారయ్య తదితరులు వరంగల్‌లో ఆరూరితో నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో వారు ఆయన్ను బలవంతంగా హైదరాబాద్‌లోని కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. మాజీ సీఎంతో మంతనాల అనంతరం ఆయన మెత్తబడ్డారు. మరోవైపు కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారనీ, ఆయన్ను వరంగల్ నుంచి పోటీ చేయించేందుకు ఆ పార్టీ అధిష్టానం అంగీకరించిం దంటూ గుసగుసలు సైతం వినిపించాయి. తనకు ఎంపీ టిక్కెట్ ఇచ్చి, తాను ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ నుంచి తన కూతురికి అవకాశమివ్వాలంటూ కడియం కోరినట్టు కూడా తెలిసింది. దీనికి అధికార పార్టీ అంగీకరించిందనే సమాచారంతో టీవీ ఛానళ్లలో కథనాలు కూడా ప్రసారమయ్యాయి. చివరికి కేసీఆర్ ఆయనతో జరిపిన చర్చలు ఫలప్రదం కావటంతో కడియం వెనక్కు తగ్గారు. ఇది జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే ఆయన కూతురు డాక్టర్ కావ్య పేరును వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించటం గమనార్హం. మరోవైపు ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్-బీఎస్పీ మైత్రిని మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సంగతి విదితమే. ఆయన ఇప్పుడు మరో అడుగు ముందుకేసి బీఆర్ఎస్ సిర్పూర్ కాగజ్‌నగర్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. గురువారం మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు కోనప్ప ప్రకటించారు. ఈ రకంగా బీఆర్ఎస్‌లో అలకలు, అసంతృప్తులు, బుజ్జగింపులు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిణామాల నేపథ్యంలోనే కేసీఆర్ బుధవారం మరో నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నిజామాబాద్ - బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ - గాలి అనిల్ కుమార్, వరంగల్ -డాక్టర్ కడియం కావ్య పేర్లను ఆయన ప్రకటించారు. ఇప్పటికే ఖమ్మం -నామా నాగేశ్వరరావు (సిట్టింగ్), మహబూబాబాద్ -మాలోత్ కవిత (సిట్టింగ్), మహబూబ్‌నగర్ -మన్నె శ్రీనివాసరెడ్డి (సిట్టింగ్), కరీంనగర్ -బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి -కొప్పుల ఈశ్వర్ పేర్లను ప్రకటించిన సంగతి విదితమే. వీటితో కలిపి బీఆర్ఎస్ మొత్తం తొమ్మిది లోక్‌సభ స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించింది.

పెంబర్తి వద్ద హైడ్రామా

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, బసవరాజు సారయ్యలతో ఆరూరి అనుచరులు వాగ్వాదానికి దిగారు. అయినా బలవంతంగా బీఆర్ఎస్ నాయకులు రమేష్ ను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

పెంబర్తి వద్ద తోపులాట..

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు ఆరూరిని తీసుకొని ఎర్రబెల్లి దయాకర్ రావు, బసవరాజు సారయ్య హైదరాబాద్ వెళుతున్న క్రమంలో వారి వాహనాన్ని జనగామ జిల్లా పెంబర్తి వద్ద బీజేపీ నాయకులు దశమంత రెడ్డి, ఉడుగుల రమేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు అడ్డుకొన్నారు. వాహనం నుంచి రమేష్‌ను బలవంతంగా దింపి తమ వాహనంలోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. దాంతో బీఆర్ఎస్ నాయకులు వారిని అడ్డుకున్నారు. ఈ తోపులాటలో ఆరూరి చొక్కా చినిగింది. అయితే రమేష్ బీజేపీ వాళ్ల వాహనంలోకి ఎక్కకుండా తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని చెప్పారు. దాంతో బీజేపీ నాయకులు ఉడుగుల రమేష్.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డికి ఫోన్ చేసి ఆరూరి రమేష్‌తో మాట్లాడించారు. తనను ఎవరూ బలవంతంగా తీసుకెళ్లడం లేదని, తన వ్యక్తిగత పనిమీద వెళుతున్నానని, మాట్లాడి వస్తానని ఆరూరి రమేష్ ఫోన్‌లో కిషన్‌రెడ్డికి సమాధానం ఇచ్చారు. అనంతరం వారంతా హైదరాబాద్‌కు వెళ్ళిపోయారు. కాగా, హైదరాబాద్‌లో కేసీఆర్‌తో ఆరూరి భేటీ అయ్యారు. ఈక్రమంలో ఆరూరి.. చివరికి బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, బీజేపీ అగ్రనేత అమిత్ షాను కలవలేదని ప్రకటించారు. అయితే ఆయనకు వరంగల్ టికెట్‌ను బీఆర్ఎస్ పార్టీ కేటాయించలేదు. కడియం శ్రీహరి కూతురు కావ్యకి కేటాయించడం గమనార్హం.

కలెక్టర్లూ... బడులను తనిఖీ చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

నాణ్యతను పరిశీలించాలని కోరారు. అధికారులకు సమాచారం ముందే ఇవ్వకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించినట్టు సమాచారం. జాయింట్ కలెక్టర్లు, డీఈవోలు పాఠశాలల పర్యవేక్షణకు ఉన్నా కలెక్టర్లు తనిఖీ చేస్తే ఆ ప్రభావం వేరుగా ఉంటుందని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు తెలిసింది. దానివల్ల ఉపాధ్యాయుల్లో బాధ్యత పెరుగుతుందనీ, బోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. ఇంకోవైపు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు మెరుగవుతుందని ప్రభుత్వం భావిస్తున్నది. మరోవైపు బడుల్లో ఉండే సమస్యల గురించి కలెక్టర్ల ద్వారా నివేదిక రూపంలో వస్తే వాటికి విలువ ఉంటుందనీ, వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చే ఆస్కారముంటుందని సీఎం భావిస్తున్నట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో ఆశ్రమ పాఠశాలలతో కలిపి 27,441 సర్కారు బడుల్లో 21,19,439 మంది విద్యార్థులు చదువుతున్నారు.

చరిత్రను వక్రీకరించడమే..

(మొదటిపేజీ తరువాయి)

హత్యాకాండ చేశాయని తెలిపారు. భయంకరమైన అణచివేత సాగించారని పేర్కొన్నారు. ఈ వాస్తవాల నుంచి కొత్తతరం ప్రజలను పక్కదోవ పట్టిస్తూ, ఆనాటి పోరాటానికి మతం రంగు పులిమే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని ఆయన కోరారు.

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘంఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పకడ్బందీగా ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి అర్థ గణాంక శాఖ అధికారులకు సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని అర్థ గణాంక శాఖ, ప్రణాళిక అభివృద్ధి సొసైటీ కార్యాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లోని వివిధ విభాగాలను నిశితంగా పరిశీలించారు. ఆయా శాఖల్లో జరుగుతున్న పనుల తీరు శాఖల కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాలనలో వివిధ శాఖలకు గణాంకాలు సర్వే వివరాలు ఇతర సమాచారాన్ని అందించడంలో ప్రణాళిక శాఖ కీలక పాత్రను పోషిస్తోందన్నారు.

చివరి లీగ్‌లో ఢిల్లీ బౌలర్ల సత్తా

గుజరాత్ జెయింట్స్ 126/9



న్యూఢిల్లీ: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్-2 ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు సత్తా చాటారు. అరుణ్‌జైట్లీ స్టేడియంలో గుజరాత్ జెయింట్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను కాప్, జొన్నాసెన్ కట్టడి చేశారు. దీంతో గుజరాత్ జట్టు 16పరుగులకు టాపార్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో లిచ్‌ఫీల్డ్(21) కాస్త ఫర్వాలేదనిపించినా.. గార్డినర్(12) నిరాశపరిచింది. దీంతో గుజరాత్ జట్టు 48పరుగులకు సగం వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత భారతి(42), బ్రైస్(28నాటౌట్) ఆచి తూచి ఆడి గుజరాత్‌ను ఆదుకున్నారు. వీరిద్దరూ 6వ వికెట్‌కు 68పరుగులు జతచేశారు. ఆ తర్వాత గుజరాత్ మళ్లీ వరుసగా వికెట్లను కోల్పోయింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి ఆ జట్టు కేవలం 126పరుగులే చేయగల్గింది. కాప్, శిఖా పాండే, మిన్ను మణికి రెండేసి, జొన్నాసెన్‌కు ఒక వికెట్ దక్కాయి. గుజరాత్, యుపి మహిళల జట్లు ప్లే-ఆఫ్‌నుంచి ఇప్పటికే నిష్క్రమించగా.. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి జట్లు ప్లే-ఆఫ్‌కు చేరిన సంగతి తెలిసిందే.

స్కోర్‌బోర్డు...

గుజరాత్ జెయింట్స్ మహిళల ఇన్నింగ్స్: వోల్వోడార్ట్ (సి)షెఫాలీ వర్మ (బి)కాప్ 7, మూనీ (బి)కాప్ 0, హేమలత (బి)జొన్నాసెన్ 4, లిచ్‌ఫీల్డ్ (సి)రాధా యాదవ్ (బి)మిన్ను మణి 21, గార్డినర్ (బి)మిన్ను మణి 12, ఫుల్మలి (బి)శిఖా పాండే 42, బ్రైస్ (నాటౌట్) 28, తనుజ కన్వార్ (బి)శిఖా పాండే 0, షబ్నమ్ (రనౌట్)షెఫాలీ/తానియా భాటియా 1, మేఘన సింగ్ (రనౌట్) తానియా భాటియా/జొన్నాసెన్ 4, మన్నత్ కశ్యప్ (నాటౌట్) 0, అదనం 7. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 126పరుగులు.

వికెట్ల పతనం : 1/1, 2/12, 3/16, 4/39, 5/48, 6/116, 7/116, 8/118, 9/122

బౌలింగ్: కాప్ 4-0-17-2, శిఖా పాండే 4-0-23-2, జొన్నాసెన్ 4-0-32-1, రీచా యాదవ్ 2-0-17-0, అరుంధతి 3-0-20-0, మిన్ను మణి 2-0-9-2, అలైస్ కాప్సీ 1-0-3-0



రసపట్టులో రంజీ ఫైనల్

● విదర్భ లక్ష్యం 538, ప్రస్తుతం 248/5 ● కరుణ్ నాయర్, అక్షయ్ పోరాటం ● కీలకంగా మారిన చివరిరోజు ఆట



ముంబయి: విదర్భ-ముంబయి జట్ల మధ్య వాంఖెడే స్టేడియంలో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ రసవత్తరంగా సాగుతోంది. 538పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ జట్టు నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 248పరుగులు చేసింది. విజయానికి విదర్భ జట్టు చివరిరోజైన గురువారం మరో 290పరుగులు చేయాల్సి ఉండగా.. మరో ఐదు వికెట్లు కూల్చితే ముంబయి విజయం సాధించనుంది. ఈ క్రమంలో విజయం కోసం ఇరు జట్లూ హోరాహోరీగా పోరాడుతున్నాయి. ముంబయి నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నాలుగో రోజు 92ఓవర్లు ఆడి 5వికెట్లు కోల్పోయి 248పరుగులు చేసింది. ఓవర్ నైట్ స్కోరు 10 పరుగులతో నాల్గోరోజు ఆటను కొనసాగించిన విదర్భ.. తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించింది. ఓపెనర్లు అథర్వ తైడే(32), ధ్రువ్ షోరే(28)లు 18.5 ఓవర్ల పాటు నిలబడ్డారు. శామ్స్ ములానీ 19వ ఓవర్లో అథర్వను ఔట్ చేసి ముంబయికి తొలి బ్రేక్ ఇచ్చాడు. ఆ మరుసటి ఓవర్లోనే తనుష్ కొటియాన్.. ధ్రువ్ వికెట్ తీసి విదర్భకు షాకిచ్చాడు. అమన్ మొఖడె(32) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. యశ్ రాథోడ్(7)ను ముషీర్ ఖాన్ ఔట్ చేశాడు. 133 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన విదర్భను కరుణ్ నాయర్ తో పాటు కెప్టెన్ అక్షయ్ వాద్కర్ (91 బంతుల్లో 56 నాటౌట్) ఆదుకున్నాడు. కరుణ్ నాయర్.. 220 బంతులాడి 74పరుగులు చేశాడు. ఐదో వికెట్‌కు అక్షయ్‌తో కలిసి 90 పరుగులు జోడించాడు. నాలుగో రోజు మరో ఐదు ఓవర్లలో ముగుస్తుందనగా ముషీర్ ఖాన్.. విదర్భను మరోసారి దెబ్బతీశాడు. కరుణ్ నాయర్‌ను అతడు పెవిలియన్‌కు పంపాడు. దీంతో విదర్భ ఐదో వికెట్ కోల్పోయింది. క్రీజ్‌లో అక్షయ్ వాడ్కర్(56)తో పాటు హర్ష్ దూబే(11) ఉన్నారు. వీరిద్దరిమీదే విదర్భ గెలుపు అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్ ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఇక ముంబయి జట్టు రికార్డుస్థాయిలో 41సార్లు ఈ టైటిల్‌ను చేజిక్కించుకోవడంతోపాటు వరుసగా 15సార్లు టైటిల్‌ను చేజిక్కించుకొన్న చరిత్ర కలిగి ఉండగా.. విదర్భ జట్టు మూడుసార్లు మాత్రమే ఈ ట్రోఫీని సాధించింది.

నవచిత్రం

ప్రియమైన కళ్యాణి వచ్చా వచ్చా..



మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న "ఫ్యామిలీ స్టార్" సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'కళ్యాణి వచ్చా వచ్చా..' రిలీజైంది. వెడ్డింగ్ సెలబ్రేషన్స్ సందర్భంగా వచ్చే ఈ పాటకు అనంత శ్రీరామ్ క్యాచీ లిరిక్స్ అందించగా...మంగ్లి, కార్తీక్ ఎనర్జిటిక్‌గా పాడారు. గోపీ సుందర్ మంచి డ్యాన్స్ నెంబర్ కంపోజ్ చేశారు. ఈ పాటలో విజయ్, మృణాల్ మేకోవర్, అప్పీయరెన్స్, బ్యూటిఫుల్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. .

అల్-హిలాల్ జట్టు ప్రపంచ రికార్డు

● వరుసగా 28 మ్యాచుల్లో గెలుపు ● సౌదీ ప్రొ లీగ్



దుబాయ్: సౌదీ ప్రొ లీగ్‌లో అల్-హిలాల్ జట్టు ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ లీగ్‌లో వరుసగా 28మ్యాచుల్లో గెలుపొందిన జట్టుగా ఈ రికార్డును సాధించింది. సౌదీ ప్రొ లీగ్‌లో భాగంగా ఆసియా ఛాంపియన్స్ లీగ్ క్వార్టర్‌ఫైనల్లో అల్ హిలాల్ జట్టు 2-0తో అల్-ఇత్తిహాద్‌ను ఓడించింది. గతంలో 2016-17 సీజన్‌లో వేల్స్ ప్రిమియర్ లీగ్‌లో ఛాంపియన్ షిప్‌లో జార్జి జీసస్ జట్టు 27 మ్యాచుల్లో నెగ్గి రికార్డు నెలకొల్పింది. అంతకుముందు 44ఏళ్ల క్రితం 26మ్యాచుల్లో గెలిచిన అజాక్స్ ఆమ్‌స్టర్‌డామ్ రికార్డును జీసస్ జట్టు ఎనిమిదేళ్ల క్రితం బ్రేక్ చేయగా.. తాజాగా అల్-హిలాల్ జట్టు ఆ రికార్డును చెరిపేసింది. ఫుట్‌బాల్ చరిత్రలోనూ గతంలో ఏ జట్టు వరుసగా 28మ్యాచుల్లో గెలుపొందిన దాఖలాలు లేవు. ఇక సౌదీ లీగ్‌లో జీసస్ జట్టు 65పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో ప్రాతినిధ్యం వహిస్తున్న అల్-నాసర్ జట్టు కంటే 12పాయింట్ల ఆధిక్యతలో ఉంది. 2022 రన్నరప్ అల్-హిలాల్‌తో సెమీస్‌లో అల్-ఐన్ జట్టు తలపడనుంది.

ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నా: హ్యారీ బ్రూక్



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ఆటగాడు హ్యారీ బ్రూక్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ సీజన్ ఐపిఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాడు. ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్, జో రూట్, జాసన్ రాయ్ ఈ సీజన్ ఐపిఎల్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకోగా.. తాజాగా హ్యారీ బ్రూక్ ఆ జాబితాలో చేరాడు. వ్యక్తిగత కారణాలతో ఈ లీగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించాడు. దీంతో ఢిల్లీ ఫ్రాంచైజీ అతని స్థానంలో ఫ్రేజర్ మెక్‌గుర్క్‌ను ఎంపిక చేసింది. బ్రూక్‌ను 2023 ఐపిఎల్ మినీ వేలంలో రూ.4 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకోగా.. అంతకుముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ ఏకంగా 14కోట్లు పెట్టి బ్రూక్‌ను కొనుగోలు చేసి భారీ మూల్యం చెల్లించుకున్న సంగతి తెలిసిందే.

టాప్‌లో అశ్విన్

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: టెస్టుల్లో ప్రపంచ నంబర్‌వన్ బౌలర్‌గా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టెస్టులో అశ్విన్ తొమ్మిది వికెట్లు పడగొట్టడంతో అతని ర్యాంక్ మెరుగైంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విన్ టాప్‌లో ఉండగా.. జస్ప్రీత్ బుమ్రా మూడోస్థానానికి స్థానానికి పడిపోగా.. కుల్దీప్ యాదవ్ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నాడు. ఇంతకుముందు ఈ స్థానంలో బూమ్రా కొనసాగాడు. అశ్విన్‌కు 870 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియాకు బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ 847 రెండో స్థానంలో, జస్ప్రీత్ బుమ్రా మూడోస్థానంలో కొనసాగుతున్నారు. కగిసో రబడ నాలుగు, పాట్ కమిన్స్ ఐదో స్థానంలో నిలిచారు. కుల్దీప్ 15స్థానాలను మెరుగుపరుచుకొని.. 16వ స్థానంలో నిలిచాడు. టెస్టు బ్యాటర్ల జాబితాలో రోహిత్, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ ర్యాకింగ్స్‌ను మెరుగుపరుకున్నారు. రోహిత్ శర్మ ఐదు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి, జైస్వాల్ రెండు స్థానాలు మెరుగుపరుచుకొని ఎనిమిదో స్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ తొమ్మిదవ స్థానానికి పడిపోయాడు. ఇక శుభ్‌మన్ గిల్ 21వ ర్యాంక్‌కు చేరుకోగా.. న్యూజిలాండ్ ఆటగాడు కేన్ విలియమ్సన్ టాప్‌లో కొనసాగుతున్నాడు.

వేసవి కానుకగా ఆ ఒక్కటీ అడక్కు

హీరో అల్లరి నరేష్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫారియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది.టైటిల్ గ్లింప్స్ సినిమా అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇవ్వగా, మొదటి సింగిల్ ఓ మేడమ్ కూడా మంచి ఆదరణ పొందింది. ఈరోజు మేకర్స్ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు.

ఆద్యంతం వినోదాత్మకం



రావు రమేష్

తెలుగు ప్రేక్షకులు మెచ్చిన నటుడు రావు రమేష్. వైవిధ్యమైన పాత్రలు, విలక్షణ నటనతో ప్రేక్షకుల్ని అలరించిన రావు రమేష్... 'మారుతి నగర్ సుబ్రమణ్యం' సినిమాతో హీరోగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.

రావు రమేష్ కథానాయకుడిగా, టైటిల్ రోల్‌లో నటించిన సినిమా 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, హర్షవర్ధన్ కీలక పాత్రధారులు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై ఈ సినిమా రూపొందుతోంది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. ప్రేక్షకులే ముఖ్య అతిథులుగా వినూత్నంగా ఈ రోజు సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు.

సాధారణంగా సినీ ప్రముఖుల చేతుల మీదుగా ఫస్ట్ లుక్ విడుదల చేయించడం కామన్. 'మారుతి నగర్ సుబ్రమణ్యం' టీమ్ కొత్తగా ఆలోచించింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫస్ట్ లుక్ విడుదల చేయమని ప్రేక్షకుల్ని కోరింది. సినిమా ఇండస్ట్రీలో ఈ విధంగా క్యూఆర్ స్కానింగ్ ద్వారా లుక్ విడుదల చేయడం ఇదే తొలిసారి. ఫస్ట్ టైమ్ 'మారుతి నగర్ సుబ్రమణ్యం' టీమ్ చేసిన కొత్త ప్రయత్నానికి సూపర్బ్ రెస్పాన్స్ లభించింది.

'మారుతి నగర్ సుబ్రమణ్యం' ఫస్ట్ లుక్ విడుదల చేసిన సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ... "ఇప్పటి వరకు రావు రమేష్ చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్రలో ఈ సినిమాలో కనిపిస్తారు. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఎంటర్‌టైన్ చేస్తారు. వినోదంతో పాటు భావోద్వేగాలు సైతం సినిమాలో ఉన్నాయి. ఫస్ట్ లుక్ విడుదల తర్వాత ఫెంటాస్టిక్ రెస్పాన్స్ వచ్చింది. రావు రమేష్ గారి లుక్ చాలా బావుందని చెబుతున్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.